PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 327 | విజయవాడ, సోమవారం 1జులై 2024 | 8 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 1 July 2024 | Rs

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పండుగలు ప్రారంభం

రూ.7,000ల ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీతో తొలి పండుగ నేడు

ముఖ్యమంత్రిగా శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి మూడవ సంతకం
చారిత్రాత్మక నిర్ణయం.. ఇకపై రూ.4000 పింఛను

"నేడు మీరు అందుకుంటున్న రూ.4000లో మన ప్రభుత్వ హయాంలో పెంచిందే రూ.2875 అని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను

"గత ప్రభుత్వం విడతల వారీ పెంపు అంటూ చేసిన మోసంతో ఒక్కొక్కరికి రూ.32000 నష్టం

+ =

జూలై నెల పింఛను	ఏప్రిల్, మే, జూన్ నెల పింఛను పెంపు	మొత్తం
రూ. 4000	రూ. 3000	రూ. 7000

పేదలకు అండగా "ఎన్టీఆర్ భరోసా"

- 28 వర్గాలకు చెందిన 65,18,496 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ
- దేశ చరిత్రలో తొలిసారిగా ఒకే రోజు పింఛన్ల కోసం రూ.4408 కోట్ల పంపిణీ
- పెరిగిన పింఛన్లతో ప్రభుత్వంపై ప్రతి నెల అదనపు భారం రూ.819 కోట్లు,
- గడచిన మూడు నెలలకు పెంచిన పింఛను కోసం చేస్తున్న ఖర్చు రూ.1650 కోట్లు

- వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, చర్మకారులు, డప్పు కళాకారులు, హిజ్రాలు, హెచ్ఐవీ బాధితులు, కళాకారులకు రూ.3000 నుంచి రూ.4000లకు పెంపు
- దివ్యాంగులకు ఎన్నడూ లేని విధంగా పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంపు

- తీవ్రమైన అనారోగ్యంతో వీల్ చైర్ లేదా మంచానికి పరిమితమైన వారికి పింఛను రూ.5 వేల నుంచి ఏకంగా రూ.15000లకు పెంపు
- కిడ్నీ, కాలేయం, తలసీమియా బాధితులకు రూ. 5 వేల నుండి రూ.10,000లకు పెంపు
- కుష్టువ్యాధి కారణంగా వైకల్యం పొందిన వారికి నెలకు రూ. 6 వేలు

ఇకపై నెలనెలా 1వ తేదీన ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ

మీ భద్రత – మా బాధ్యత

జారీ చేసిన వారు : కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ విజయవాడ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం.

మోడీ పాలనలో భావప్రకటనా స్వేచ్ఛపై దాడి

- సమాజాన్ని మేల్కొలిపే కథలు, కవితలు, పాటలు మరిన్ని రావాలి
- సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి

సభలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి - విజయవాడ

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి చేస్తోందని సాహిత్య ప్రస్థానం ప్రధాన సంపాదకులు తెలకపల్లి రవి అన్నారు. ఈ నేపథ్యంలో భావ ప్రకటనా స్వేచ్ఛను, సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన కర్తవ్యం మనందరిపై ఉందని తెలిపారు. మేడే -2024 సాహిత్య పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఘనంగా జరిగింది. జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నాలుగు సెషన్లుగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రారంభ సభకు సాహితీ స్రవంతి ప్రతినిధి వీరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి తెలకపల్లి రవి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని, ప్రముఖ మేధావి అరుంధతీరాయ్‌పై 14 ఏళ్ల నాటి కేసును నేడు తిరగదోడడమే దీనికి నిదర్శనమని తెలిపారు. అక్షరానికి కూడా సంకెళ్లు పడుతున్న తరుణంలో కవులు, రచయితలు, కళాకారులు, కళాభిమానులు, మేధావులు తమ స్వేచ్ఛను కాపాడుకుంటూనే.. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై ఎప్పటికప్పుడు రచనలు చేస్తూ సమాజాన్ని చైతన్యపరిచేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రాజ్యం, పాలన, సంస్కృతి, సాహిత్యం, కళలు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, ఇవన్నీ కార్పొరేటీకరణ, కాషాయీకీకరణ విష సంస్కృతి కోరల్లో చిక్కుకొని ప్రమాదంలో పడిన తరుణంలో వీటన్నింటికీ ప్రత్యామ్నాయంగా ఎంబివికె అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటం ఎంతో అభినందనీయమని తెలిపారు.

'కళింగాంధ్ర కథా జాడ' పుస్తకం ఆవిష్కరణ

అనంతరం జరిగిన కార్యక్రమంలో 'కళింగాంధ్ర కథా జాడ' పుస్తకాన్ని సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎంవిఎస్ శర్మ ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి బాధ్యులు సత్యాజీ అధ్యక్షత వహించగా, ప్రముఖ కథా రచయిత, విమర్శకులు అట్టాడ అప్పలనాయుడు పుస్తకాన్ని పరిచయం చేశారు. సాహితీ స్రవంతి బాధ్యులు చీకటి దివాకర్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవిఎస్ శర్మ మాట్లాడుతూ... 'కళింగాంధ్ర కథా జాడ' పుస్తకాన్ని ఎంతో అవగాహనతో తీసుకొచ్చిన అట్టాడ అప్పలనాయుడు, చీకటి దివాకర్‌లను అభినందించారు. 'మాసిపోని మరకలు' కథా సంకలనం పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత, విమర్శకులు అట్టాడ అప్పలనాయుడు ఆవిష్కరించగా, కథా రచయిత్రి కె.ఉషారాణి పుస్తక పరిచయం చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వాల విధానాలు, దోపిడీ వర్గాల వారి శ్రమ దోపిడీ రూపాలను సులువైన భాషలో ప్రజలకు అర్థమయ్యే రీతిలో రచనలు తీసుకొస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ న్యాయవాది సంపర శ్రీనివాసరావు మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యాన్ని తీసుకొచ్చే దానిలో తమ సహకారం అన్ని వేళలా ఉంటుందని తెలిపారు. 'క్షేత్రం' కవితా సంకలనం పుస్తకాన్ని ప్రముఖ కవి, విమర్శకులు సీతారామ్ ఆవిష్కరించగా, ప్రముఖ కవి, విమర్శకులు సుంకర గోపాలయ్య పుస్తకాన్ని పరిచయం చేశారు. ప్రముఖ కవి అనిల్ డ్యాని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీతారామ్ మాట్లాడుతూ సమాజానికి ఏమి కావాలో అనే వివేకంతో ఆలోచించే స్థాయిలో లేమని ఆందోళన వ్యక్తం చేశారు. సాహితీ స్రవంతి ప్రతినిధి శాంతిశ్రీ మాట్లాడుతూ భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడి జరుగుతోన్న ప్రస్తుత తరుణంలో మరిన్ని మంచి కథలు, కవితలు, పాటలు, ఇతర రచనలు తీసుకురావాలని ఆకాంక్షించారు. 'దీపం' పాటల సంకలనం పుస్తకాన్ని పోలవరపు సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు ఆవిష్కరించగా, జాషువా సాంస్కృతిక వేదిక బాధ్యులు గుండు నారాయణరావు పుస్తకాన్ని పరిచయం చేశారు. శాంతిశ్రీ అధ్యక్షత వహించగా ప్రజానాట్యమండలి సీనియర్ గాయకులు జగన్ పలు విప్లవ గేయాలను ఆలపిస్తూ, పాట దాని పుట్టుక, సమాజంపై దాని ప్రభావంపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా సాహితీ స్రవంతి ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి, ప్రముఖ స్త్రీవాద కవయిత్రి మందరపు హైమావతి, అరసం నాయకులు పరుచూరి అజయ్, సాహితీవేత్త డాక్టర్ రావెళ్ల శ్రీనివాసరావు, ప్రముఖ కవయిత్రి వైష్ణవి శ్రీ, ప్రముఖ సాహితీవేత్త కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ పాట, కథ, కవిత, తదితర విభాగాల్లోని మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

కళింగ కథా జాడ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంవిఎస్ శర్మ

కథల పోటీల్లో ప్రథమ బహుమతి సయ్యద్ గఫూర్ (మాసిపోని మరకలు), ద్వితీయ బహుమతి కె.ఆనందాచారి (హిందూ సితా హమారా కథ), తృతీయ బహుమతి ఎల్.శాంతి (థింసాచామంతి), కవితల పోటీల్లో ప్రథమ బహుమతి డాక్టర్ దారల విజయకుమారి (క్షేత్రం), ద్వితీయ బహుమతి కంచరాన బుజంగరావు (మేడే జెండా కవిత), తృతీయ బహుమతి సోమిశెట్టి వేణుగోపాల్ (శ్రమ గొలుసు), పాటల పోటీల్లో ప్రథమ బహుమతి పావెల్ (మేడే దీపం), ద్వితీయ బహుమతి దుర్గా ప్రసాదరావు (నిరుపమానమైన జెండా), తృతీయ బహుమతి రావెళ్ల (లేవరా రైతన్న లేవరా) అందుకున్నారు.

నేటి నుంచి ఐపిసి స్థానంలో భారతీయ న్యాయ సంహిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశంలో ప్రస్తుతం అమలులో వున్న ఇండియన్ పీనల్ కోడ్ (ఐపిసి) స్థానంలో కేంద్ర ప్రభుత్వం గతేడాది చట్టం చేసిన భారతీయ న్యాయ సంహిత-2023 (బిఎన్ఎస్) అమలులోకి రానుంది. ఈ చట్టంలో ఇప్పటి వరకు చిన్నచిన్న నేరాలుగా గుర్తించే వ్యవస్థీకృత వాటికి కూడా తీవ్రమైన శిక్షలు వుండబోతున్నాయి. భారతీయ న్యాయ సంహిత చట్టం-2023 రవాణా రంగానికి గొడ్డలి పెట్టు అని ఆలిండియా ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఈ చట్టాన్ని తీవ్రంగా ఖండిస్తోంది. ఈ చట్టాన్ని నిరసించాలని ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ దేశవ్యాప్తంగా పిలుపునిచ్చింది.

టిటిడి వెబ్‌సైట్లో పాలక మండలి నిర్ణయాలు

ప్రజాశక్తి- తిరుమల

టిటిడి పాలనలో పారదర్శకత తీసుకొచ్చేందుకు ఇఒ శ్యామలరావు చర్యలు చేపట్టారు. గత పాలక మండలి తీసుకున్న నిర్ణయాలను వెబ్‌సైట్లో పెట్టించారు. 2023 నుండి 2024 వరకు ధర్మకర్తల మండలి సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను ఆదివారం టిటిడి వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయించారు. గత ఎనిమిది నెలలుగా బోర్డు నిర్ణయాలు ఎందుకు వెబ్‌సైట్‌లో ఉంచలేదంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో అధికారుల తీర్మానాలు సందర్శకులకు తెలిసేలా టిటిడి వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు.

పోర్ట్ కంటైనర్ కార్యకలాపాలు పునరుద్ధరించండి

- ఉద్యోగుల డిమాండ్

ప్రజాశక్తి - నెల్లూరు

మరో ప్రాంతానికి తరలించిన కృష్ణపట్నం పోర్టు కంటైనర్‌ను తిరిగి పోర్టుకు తీసుకొచ్చి తమను ఆదుకోవాలని ఉపాధి కోల్పోయిన ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లాలోని ప్రెస్ క్లబ్‌లో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధి కోల్పోయిన ఉద్యోగి బి రామారావు మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్దదైన కృష్ణపట్నం ఓడరేవు గతంలో వందలాది వాహనాలు, వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు, ఎగుమతులు, దిగుమతులతో కళకళ లాడుతుండేదన్నారు. పోర్టు కంటైనర్ మరో ప్రాంతానికి తరలించడం వల్ల ఈ ప్రాంతం ఇప్పుడు కళా విహీనమైందన్నారు. తమ బాధను గత ప్రభుతంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినప్పుడు ఆయన అవహేళన చేస్తూ మాట్లాడారని పేర్కొన్నారు. అదే సమయంలో తమ గోడును ఆలకించిన వామపక్ష పార్టీల నేతలు, ప్రస్తుతం అధికారంలో ఉన్న టిడిపి పార్టీ ప్రతినిధులు తాము చేపట్టిన ఉద్యమంలో పాల్గొని ప్రోత్సహించారన్నారు. ప్రస్తుతం టిడిపి ఎమ్మెల్యేగా ఉన్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కోర్టుకు వచ్చి కంటైనర్ వ్యవహారంపై యాజమాన్యాన్ని నిలదీశారని గుర్తు చేశారు. కంటైనర్‌ను తిరిగి జిల్లాకు తీసుకొచ్చేందుకు తన శక్తి మేరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నూతన ప్రభుత్వం దీనిపై చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో పోర్ట్ కంటైనర్ టర్మినల్ ఆధారిత ఉద్యోగులు రాంబాబు, శ్రీనివాసులు, ఫరీద్, బాలచంద్ర, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యుదయవాది సావిత్రమ్మ

- తెలుగు రాష్ట్రాల సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సంస్మరణ సభలో మాట్లాడుతున్న వీరయ్య

సిపిఎం అభిమాని సావిత్రమ్మ గొప్ప అభ్యుదయవాది అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం నవభారత్ నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన సావిత్రమ్మ సంస్మరణ సభకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సిపిఎం నాయకులు హాజరై ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పిల్లల చిన్నతనంలోనే భర్త చనిపోయినా అధైర్యపడకుండా ముగ్గురు కుమారులను సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల వెనుక మహిళలు విశిష్ట పాత్ర పోషిస్తారనడానికి సావిత్రమ్మ ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ, సావిత్రమ్మ తన కుమారులను పార్టీ కోసం పనిచేసేలా ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా ఆమెతో ఉన్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు.

సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున, తన తరుపున సావిత్రమ్మ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడం వల్లే ఆ కుటుంబం సమాజం పట్ల ఎంతో బాధ్యతగా పనిచేసిందన్నారు. ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, వి వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ సావిత్రమ్మ ఆలోచనలు, ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతముందు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, బి వి రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, , కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్, బి వెంకట్ తమ సంతాప సందేశాన్ని పంపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి లోకనాథం, శ్రీకాకుళం, విశాఖ జిల్లా కార్యదర్శులు డి గోవిందరావు, జగ్గునాయుడు, సావిత్రమ్మ కుమారులు సిపిఎం తెలంగాణ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బాబూరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి జయరాం, మరో కుమారుడు పోస్టల్ యూనియన్ నాయకులు జ్యోతీశ్వరరావు, సిపిఎం జిల్లా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

మిథున్‌రెడ్డి పుంగనూరు పర్యటన అడ్డగింత

ప్రజాశక్తి- పుంగనూరు (చిత్తూరు జిల్లా)

రాజంపేట వైసిపి ఎపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని పుంగనూరు రానీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి ఆందోళన నేపథ్యంలో ఈ చర్యకు పాల్పడ్డారు. పుంగనూరు రూరల్, అర్బన్ వైసిపి నాయకుల సమీక్షా సమావేశంలో పాల్గొనడానికి ఎంపి వస్తున్నారని తెలుసుకుని టిడిపి నాయకులు స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎంపి మిథున్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. టిడిపి జెండాలు, నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ వైసిపి అధికారంలో ఉన్నప్పుడు టిడిపి నాయకులను నియోజక వర్గంలో తిరగనివ్వలేదని, ఈ దృష్ట్యా ప్రస్తుత వైసిపి ఎంపిని, వైసిపి ఎమ్మెల్యేను పుంగనూరు నియోజకవర్గంలోకి రానివ్వబోమని అన్నారు. వారు ఇక్కడికి వస్తే ప్రజావ్యతిరేకత ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. తిరుపతి నుంచి బయలుదేరిన ఎంపి మిథున్‌రెడ్డిని టిడిపి వారి ఆందోళన నేపథ్యంలో పుంగనూర్‌లోకి ప్రవేశించనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఆయనను తిరిగి వెనక్కి పంపేశారు. సమీక్షా సమావేశంలో పాల్గొనడానికి చిత్తూరు మాజీ ఎంపి ఎన్.రెడ్డప్ప స్థానిక అంబేద్కర్ భవన్ వద్దకు చేరుకోగా, ఆయననూ పోలీసులు అడ్డుకున్నారు. ఇక్కడి పరిస్థితులు బాగా లేవని, తిరిగి వెళ్లిపోవాలని ఆయనకు సూచించారు. ఎంపి రాకను వ్యతిరేకిస్తూ ఆందోళనకు దిగిన వారిలో టిడిపి రూరల్ అధ్యక్షులు మాధవరెడ్డి, రాష్ట్ర బిసి సెల్ నేత శ్రీకాంత్, సివి.రెడ్డి, పి.గిరి, రామకృష్ణంరాజు, గంగాధర, సయ్యద్ సుహేల్ బాషా ఉన్నారు.

హోంమంత్రి ఓఎస్‌డిగా అనిల్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఓఎస్‌డిగా అడిషనల్ ఎస్‌పి పి అనిల్‌కుమార్‌ను నియామకమయ్యారు. ఈ మేరకు డిజిపి ద్వారకా తిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. అనిల్‌కుమార్ ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా లా అండ్ ఆర్డర్ విభాగంలో అడిషనల్ ఎస్‌పిగా వున్నారు. లా అండ్ ఆర్డర్ నుండి ఎస్ఐబి ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్‌పిగా బదిలీ చేస్తూ ఆ పోస్ట్ నుండి హోంమంత్రి ఓఎస్‌డిగా అటాచ్ చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబరు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసేందుకు పార్టీ కార్యాలయానికి వేలాదిగా ప్రజలు వస్తుండటంతో వారికి కొంతమేర ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో టోల్ ఫ్రీ నెంబరు 7306299999ను ఏర్పాటు చేసినట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రీవెన్స్‌ను సక్రమంగా నిర్వహించేందుకే టోల్ నెంబరును తెరమీదకు తెస్తున్నామన్నారు. స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యేల వద్ద పరిష్కారం కాని సమస్యలు ఉన్నప్పుడే టిడిపి కేంద్ర కార్యాలయానికి వస్తే మంచిదన్నారు. టోల్ ఫ్రీ నెంబరుకు సమస్యలు చెప్పిన అనంతరం సిఎం దృష్టికి తప్పనిసరిగా తీసుకెళ్లాల్సిన విషయం ఉంటే కచ్చితంగా సిఎంను కలిసి సమస్యను విన్నవించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరంపై వైసిపి చేసిన విధ్వంసంతో రూ.70 వేలకోట్లు నష్టపోయామన్నారు.

ఆలయం ఎదుట మంత్రి పొన్నం ప్రభాకర్

విభజన హామీల అమలుకు తెలుగు రాష్ట్రాలు కలిసి పోరాడాలి : తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి- తిరుమల

రెండు తెలుగు రాష్ట్రాలూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి విభజన హామీల అమలుకు కలిసి పోరాడాలని తెలంగాణ రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఆయన విఐపి విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఆలయం వెలుపల మీడియాతో మంత్రి పొన్నం మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఎపి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారమంతా ఒక్కటే అనే నినాదంతో వెళ్లాలన్నారు. తెలంగాణ భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని ఎపి ప్రభుత్వాన్ని కోరుతున్నానన్నారు. తెలంగాణ సిపార్సులను అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

క్యూలైన్లలో వేచి వున్న భక్తులు

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో సందర్శకుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్ల వరకు దాదాపు అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శనివారం స్వామివారిని 80,404 మంది దర్శించుకున్నారు. వారిలో 35,825 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ఆదాయం ఒక్కరోజే రూ.3.83 కోట్లు వచ్చిందని టిటిడి అధికారులు వెల్లడించారు.

దీక్షల్లో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ క్యాంటీన్ కార్మికులు

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పి.శ్రీనివాసరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1235వ రోజుకు చేరాయి.

దీక్షల్లో స్టీల్ క్యాంటీన్ కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులను ప్రధాని వద్దకు తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమానికి దేశవ్యాప్త మద్దతు దక్కుతోందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు ప్రభుత్వం సొంత గనులు, ఆర్థిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు కెఎస్ఎన్.రావు, కామేశ్వరరావు, సిఐటియు నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు. పి. నారాయణ, ఆదిరెడ్డి శ్రీను, జి.గౌరునాయుడు, కె.సురేష్. కాంతారావు పాల్గొన్నారు.

గ్రామ సభలో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

కర్లపాలెం నిర్వాసితులకు పరిహారం పెంచాలి

- సిఐటియు రాష్ట్ర పధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి -గుడ్లూరు (నెల్లూరు జిల్లా)

రామాయపట్నం పోర్టు నిర్వాసితులకు పరిహారం పెంచాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెల్లూరు జిల్లా గూడూరు మండలం కర్లపాలెంలో ఆ గ్రామ సర్పంచ్ చాపల రమణయ్య అధ్యక్షతన ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ.. పోర్టు కోసం మత్స్యకారులు సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారని తెలిపారు. వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో పోర్టులన్నిటినీ ప్రయివేటు వ్యక్తులకు, అదానీ, అంబానీ వంటి బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతోందని తెలిపారు. పోర్టులు వారి చేతుల్లోకి వెళ్లిన తరువాత నిర్వాసితులను పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కావాలంటే పోరాటమే ఏకైక మార్గమని అన్నారు. రామాయపట్నం పోర్టు నిర్మాణ వ్యయం పెరిగిన నేపథ్యంలో నిర్వాసిత గ్రామమైన కర్లపాలెంలో ఇళ్లకు మరోసారి రీసర్వే చేసి పరిహారం పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎర్రజెండా నీడన నా అనుభవాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మధు, నర్సింగరావు తదితరులు

ఉత్తమ కమ్యూనిస్టు ఎవి వర్మ

- 'ఎర్రజెండా నీడన నా అనుభవాలు' పుస్తకావిష్కరణ సభ'లో పి మధు, సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- తిరుపతి

సమ సమాజ స్థాపనకు అహర్నిశలూ శ్రమించిన ఉత్తమ కమ్యూనిస్టు ఎవి వర్మ అని, ఆయన జీవితం కార్యకర్తలకు ఓ విజ్ఞాన గని అని సిపిఎం నేత, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ఉద్ఘాటించారు. ఎవి.వర్మ తన జీవితానుభవాలతో తీసుకొచ్చిన 'ఎర్ర జెండా నీడన నా అనుభవాలు' అనే పుస్తకం ఆవిష్కరణ సభ తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షతన ఆదివారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మధు మాట్లాడుతూ నమ్ముకున్న సిద్ధాంతం కోసం 70 సంవత్సరాలుగా నిక్కచ్చిగా నిలబడడమే కాకుండా, అదే పంథాలో తన కుటుంబాన్ని అంతటినీ ఎర్రజెండా బాటలోనే నడిపించిన ఎవి వర్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ మతతత్వ, కక్షపూరిత వైఖరులను ఎండగట్టారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఛార్జిషీట్లో కేజ్రీవాల్ పేరు లేనప్పటికీ ఆయనను కక్షపూరితంగా మోడీ ప్రభుత్వం మళ్లీ అరెస్టు చేసిందన్నారు. ఛార్జిషీట్లో పేరు ఉన్న అరబిందో కంపెనీ శరశ్చంద్ర బిజెపికి 50 కోట్లు ముట్ట చెప్పడంతో ఆయనను అరెస్టు చేయకుండా వదిలివేసిందని దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన నీట్ ఎగ్జామ్ పేపర్ లీకేజీలో భాగస్వాములైన ఒయాసిస్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోగా, మళ్లీ అక్కడే యుపిఎస్‌సి ఎగ్జామ్స్ నిర్వహించడం శోచనీయమన్నారు. కక్షపూరితంగా కేరళలో గోవిందన్ మాస్టారుపై కేసునైతే పెట్టగలిగారు కానీ, లేని అవినీతిని నిరూపించగలరా అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ 'సొంత లాభం కొంత మానుకొని... పొరుగు వాడికి సాయపడవోయ్' అన్న గురజాడ అప్పారావు సూక్తులు ఆచరణలో చూపిన ఆదర్శవాది ఎవి వర్మ అని కొనియాడారు. సభాధ్యక్షులుగా కందారపు మురళి వ్యవహరించారు. టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు ఒవి రమణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి, స్విమ్స్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మునస్వామి, ఎవి వర్మ సతీమణి ఎ.లక్ష్మి, కుమార్తెలు ఎ.కల్యాణి, ఎ.వనజ, ఎ.పద్మజ పాల్గొన్నారు.

ఎపిఎల్ తొలి మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఘన విజయం

ప్రజాశక్తి- పిఎం.పాలెం (విశాఖపట్నం)

విశాఖ పిఎం.పాలెం సమీపంలోని ఎసిఎ విడిసిఎ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఎపిఎల్ తొలి మ్యాచ్‌లో రాయలసీమ కింగ్స్ ఘన విజయం సాధించింది.

కోస్టల్ రైడర్స్ జట్టుపై ఏడు వికెట్ల తేడాతో ఈ గెలుపును అందుకుంది. తొలుత బ్యాటింగ్ బరిలోకి దిగిన కోస్టల్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టపోయి 149 పరుగులు చేసింది. కెప్టెన్ షేక్ రషీద్ 57 బంతుల్లో ఏడు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో రాణించాడు. అనంతరం బరిలోకి దిగిన రాయలసీమ కింగ్స్ 15 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఓపెనర్లు కె.హనీష్ రెడ్డి, డిబి.ప్రశాంత్ కుమార్, పి.రోషన్ కుమార్ రాణించారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 327 | విజయవాడ, సోమవారం 1జులై 2024 | 8 + 8 పేజీ వెల : 5.50

Vol No | Vijayawada, Monday 1 July 2024 | Rs

సిఎం అదనపు కార్యదర్శిగా కార్తికేయ మిశ్రా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అదనపు కార్యదర్శిగా 2009 ఐఎఎస్ బ్యాచ్‌కు చెందిన కార్తికేయ మిశ్రా నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కేంద్ర ఆర్థిక శాఖలో డైరెక్టరుగా ఉన్న ఆయనను ఎపి సర్వీసుకు పంపాలని కేంద్రానికి సిఎం ఇటీవల లేఖ రాశారు. స్పందించిన డిఒపిటి.. కార్తికేయ మిశ్రాను ఎపి కేడర్‌కు పంపుతూ నిర్ణయం తీసుకుంది.

టీ20లకు జడేజా వీడ్కోలు

న్యూఢిల్లీ : అంతర్జాతీయ టీ20లకు భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా వీడ్కోలు పలికాడు. టీ20 ప్రపంచ కప్‌లో భారత్ విజేతగా నిలిచిన ఒక రోజు తరువాత ఆదివారం జడేజా ఈ నిర్ణయాన్ని ప్రకటించాడు. శనివారం విజేతగా నిలిచిన భారత్ జట్టులో జడేజా సభ్యుడిగా ఉన్నాడు. జడేజా వయస్సు 36 ఏళ్లు. శనివారం విజయం తరువాత విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలు టీ20లకు వీడ్కోలు ప్రకటించిన సంగతి తెలిసిందే. 2009లో శ్రీలంకపై అరంగేట్రం చేసిన జడేజా ఇప్పటివరకు 74 టీ20 మ్యాచ్‌లు ఆడి 515 పరుగులు చేసి.. 54 వికెట్లు పడగొట్టాడు.

'పోలవరం' కాఫర్ డ్యామ్‌లపై

అణువణువూ పరిశీలన

అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్న నిపుణులు

తొలిరోజు 6 గంటల తనిఖీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో/ఏలూరు ప్రతినిధి/పోలవరం

పోలవరం ప్రాజెక్టు లోపాలను పరిశీలించేందుకు వచ్చిన నిపుణులు తొలిరోజూ సుమారు ఆరు గంటలపాటు ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టులో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు అమెరికాకు చెందిన ఇరిగేషన్ రంగ నిపుణులైన డేవిడ్‌పాల్, జియన్ ఫ్రాంకో డిసీకో, కెనడాకు చెందిన రిచర్డ్ డోనేల్లీ, హిన్స్‌బర్గర్‌ను పోలవరం ప్రాజెక్టు అథారిటీ నియమించింది. వీరు కనీసం ఏడాదిపాటు తాత్కాలిక పద్ధతిలో ప్రాజెక్టుకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. బృందంలో ఒక్కొక్కరికీ ప్రతిరోజూ 1600 అమెరికన్ డాలర్లు చెల్లించనున్నారు. అమెరికాలో ఉండి నేరుగా ప్రాజెక్టు పనులు ఇతరత్రా పర్యవేక్షిస్తే గంటకు 175 డాలర్లు చెల్లిస్తారు. దేశంలో పర్యటించినంతకాలం విమాన ఛార్జీలు, హోటల్ ఖర్చులు, వీసా ఖర్చులన్నీ పిపిఎ భరించాల్సి ఉంటుంది. నలుగురు నిపుణుల పనిని ఆరు నెలల తరువాత రివ్యూ చేయనున్నారు. బాగుందనుకుంటే కొనసాగిస్తారు. లేదంటే అప్పటికప్పుడు వీరి కాంట్రాక్టు రద్దుచేసుకునే అధికారం పోలవరం ప్రాజెక్టు అథారిటీ కలిగి వుంటుంది. ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా శనివారం సాయంత్రం రాజమండ్రి చేరుకున్నారు. ఆదివారం ఉదయం పది గంటలకు అక్కడ్నుంచి ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. వీరితోపాటు ఇరిగేషన్ సలహాదారు వెంకటేశ్వరరావు కూడా ఉన్నారు. ప్రాజెక్టు స్థలంలో కొద్దిసేపు అధికారులతో చర్చించిన అనంతరం నేరుగా ప్రాజెక్టు మీదకు వెళ్లారు. అనంతరం ఎగువ కాఫర్ డ్యామ్‌పైకి చేరుకుని అక్కడ సీపేజీలను పరిశీలించారు. ఎప్పుడు? ఎలా? నిర్మించారనే వివరాలను అడిగి

ప్రాజెక్టు పనులు పరిశీలిస్తున్న అంతర్జాతీయ నిపుణుల బృందం

తెలుసుకోవడంతోపాటు నిర్మాణ సమయం అనంతరం వరద సమయంలో ఉన్న ఫొటోల వివరాలను తెప్పించుకుని చూశారు. 2021లో వరదలు వచ్చిన సమయంలో ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీలపై ప్రొఫెసర్ రాజు ఇచ్చిన రిపోర్టునూ తెప్పించుకుని పరిశీలించారు. వరద సమయంలో ఎంత వచ్చింది, ప్రవాహ వరద స్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆఫ్రే సంస్థ ఇచ్చిన నివేదిక, చైనేజ్ 1450, 290 మీటర్ల వద్ద ఏర్పడిన సమస్యలపై అధికారులను అడిగారు. అక్కడ నుండి నేరుగా దిగువ కాఫర్ డ్యామ్‌కు వెళ్లారు. 2021, 2022లో దానికి ఏర్పడిన సీపేజ్‌లు ఎక్కడెక్కడ ఉన్నాయి, అవి ఏర్పడానికి కారణాలేమీటని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యామ్‌లో గ్యాప్-1 ఏరియాను పరిశీలించారు. మొత్తం ప్రాజెక్టు ప్లాను, అక్కడున్న ప్రస్తుత స్థితిని పరిశీలించి నేరుగా రాజమండ్రి వెళ్లారు. ఉదయం పదిన్నర గంటల నుండి సాయంత్రం వరకూ సుమారు ఆరు గంటలపాటు పరిశీలించారు. తొలిరోజు వారికిచ్చిన షెడ్యూలు ప్రకారం అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

నేడు గ్యాప్-2, ఇసిఆర్ఎఫ్ పరిశీలన

దెబ్బతిన్న డయాఫ్రం వాల్, ఇసిఆర్ఎఫ్‌గ్యాప్-2తోపాటు ఇతర పనులను, సంబంధిత ప్రణాళికలను రెండోరోజు సోమవారం పరిశీలిస్తారు. మరో రెండు రోజులపాటు మిగతా 7లో

నేడు టెట్ నోటిఫికేషన్

2 నుంచి దరఖాస్తుల స్వీకరణ

గత డిఎస్‌సి నోటిఫికేషన్ రద్దు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డిఎస్‌సితోపాటు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సి నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. ఈ మేరకు ఆదివారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జులై ఒకటిన టెట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. జులై 2 నుంచి టెట్ దరఖాస్తుల స్వీకరణను ప్రభుత్వం చేపట్టనుంది. నోటిఫికేషన్, ఇన్‌ఫర్మేషన్ బులెటిన్, షెడ్యూల్, సిలబస్‌తోపాటు ఆన్‌లైన్‌లో జరిగే ఈ పరీక్షపై అభ్యర్థులకు సూచనలు, విధి విధానాలను విద్యాశాఖాధికారులు ఖరారు చేశారు. మరింత సమాచారం కోసం http//cse.ap.gov.inలో పొందవచ్చని విద్యాశాఖ కమిషనరు సురేష్‌కుమార్ పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం కమిషనరు కార్యాలయంలో ఏర్పాటుచేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలలో నిర్వహించిన టెట్‌లో అర్హత సాధించనివారు, టెట్ ప్రకటన తర్వాత బిఇడి, డిఇడి కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఉండటంతో వారిని కూడా కలిపి డిఎస్‌సితోపాటు టెట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. టెట్, మెగా డిఎస్‌సికి ఒకేసారి కొంచెం తేదీల మార్పుతో దరఖాస్తులు స్వీకరించనున్నారు. డిఎస్‌సికి సన్నద్ధమయ్యేందుకు నెల రోజులు సమయం ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు ఓ అభిప్రాయానికి వచ్చారు. అనంతరం డిఎస్‌సి పరీక్ష ఉంటుందన్నారు. గత డిఎస్‌సికి దరఖాస్తు చేసుకున్నవారు ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేదని, కానీ దరఖాస్తులు మాత్రం కొత్తగా చేసుకోవాల్సి ఉంటుందని విద్యాశాఖ వర్గాలు పేర్కొన్నాయి.

అమూల్ సంకటం!

- నాడు జగన్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టిన టిడిపి
- ఇప్పుడు మోడీ, అమిత్‌షాకు కోపం వస్తుందన్న మీమాంస
- గుజరాత్ సంస్థ వద్దంటున్న 'దేశం' నేతలు
- తమిళనాడు, కర్ణాటకలో ప్రతిఘటన
- ప్రభుత్వ వైఖరేంటో చెప్పాలంటున్న పాడి రైతులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

గుజరాత్‌కు చెందిన పాలు, పాల ఉత్పత్తుల వ్యాపార దిగ్గజం అమూల్ సంస్థను గత వైసిపి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోనికి ప్రవేశపెట్టగా, తాజాగా రాష్ట్రంలో అధికారంలోకొచ్చిన టిడిపి కూటమి సర్కారు వైఖరేంటనే విషయంపై పాడి రైతుల్లో చర్చ మొదలైంది. డెయిరీ రంగంలో బలంగా ఉన్న సహకార సంస్థలకు నష్టం కలిగించేలా, ప్రభుత్వ రంగంలో ఉన్న ఎపి డెయిరీకి చెందిన విలువైన భూములను, స్థిర, చరాస్తులను అమూల్‌కు ధారాదత్తం చేసేందుకు నాటి వైసిపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. అమూల్‌కు, ఎపి డెయిరీకి మధ్య 2020 జులై 21న పరస్పర అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదిరింది. అగ్రిమెంట్ రోజునే ఎపి డెయిరీ, అమూల్ వ్యాపార భాగస్వామ్యంపై గైడ్‌లైన్స్ విడుదల చేస్తూ జిఒఎంఎస్ నెం.25 జారీ అయింది. కాగా అమూల్ ఒప్పందాన్ని నాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి తీవ్రంగా తప్పుబట్టింది. రోడ్డెక్కి ఆందోళనలు కూడా నిర్వహించింది. గుజరాత్‌కు జగన్ సర్కారు అమ్ముడుపోయిందని అచ్చెన్నాయుడు వంటి వారు తీవ్రంగా ధ్వజమెత్తారు. తెలుగు జాతి గౌరవాన్ని దెబ్బతీశారని చంద్రబాబుతో సహా పలువురు టిడిపి నేతలు విమర్శించారు. అయితే ఎన్నికల్లో టిడిపి-జనసేన-బిజెపి కూటమి ఎ.పి.లో అధికారంలోకొచ్చిన తరుణంలో నాడు అమూల్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి ఏం చేస్తుంది, గత సర్కారు చేసుకున్న ఎంఒయును రద్దు చేస్తుందా, లేక కొనసాగిస్తుందా, అదీ కాకపోతే తాత్కాలికంగా అమూల్ ప్రాజెక్టును నిలిపివేస్తుందా అనే ప్రశ్నలు పాడి రైతుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా, అమూల్ వ్యవహారం రాజకీయంగా ముడిపడి ఉందని, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలో టిడిపి భాగస్వామి అయినందున, ఇక్కడా తమది ఎన్‌డిఎ ప్రభుత్వమని ప్రకటించుకున్నందున, అమూల్‌తో తెగదెంపులు చేసుకోవడం అంత ఈజీ కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

న్యాయస్థానాల దాకా..

వైసిపి ప్రభుత్వం 2020 మధ్యలో రాష్ట్రంలోకి అమూల్‌ను ప్రవేశపెట్టినప్పటికీ అన్ని జిల్లాలకూ ప్రతిపాదిత 'పాలవెల్లువ' ప్రాజెక్టు విస్తరించలేదు. ఎంఒయు వ్యవహారం హైకోర్టు వరకు వెళ్లింది. ఎపి డెయిరీ, అమూల్ రెండూ కలిసి పని చేయాలన్నది ఎంఒయు టార్గెట్. కొన్ని దశాబ్దాలలో లక్షలాది పాడి రైతులు సమిష్టిగా కూడబెట్టిన ఎపి డెయిరీ భూములను, మౌలిక సదుపాయాలను, మార్కెటింగ్ వనరులను అమూల్‌కు కారు చవకగా కట్టబెట్టడమే లక్ష్యంగా గత ప్రభుత్వంలో ప్రాజెక్టు నడిచింది. ఉదాహరణకు చిత్తూరు జిల్లా యూనిట్ భూములను 99 ఏళ్ల లీజుపై అమూల్‌కు కట్టబెట్టారు. చిత్తూరు, ప్రకాశం, కడప, గుంటూరు జిల్లాల్లోనే పాల సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ నడిచాయి. ఆర్‌బికెలలో బల్క్ కూలింగ్ కేంద్రాలు, సేకరణ కేంద్రాలన్నా కొన్ని ఆర్‌బికెలకే పరిమితమయ్యాయి. అమూల్ సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ ఎత్తుగడలపై అధ్యయనం చేస్తుందని చెప్పినా పెద్దగా వర్కవుట్ కాలేదు.

ముట్టుకుంటే కాలుతుంది...

గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మిగతా 7లో

మూకదాడి మృతునిపైనే

ఎదురు కేసు

- మరణించిన 11 రోజుల తరువాత ఫిర్యాదు, ఎఫ్ఐఆర్ నమోదు
- ఉత్తరప్రదేశ్‌లో యోగి మార్కు పాలన

న్యూఢిల్లీ : హిందుత్వ గుంపు మూకదాడిలో చనిపోయిన ముస్లిం వ్యక్తి, అతని సోదరుడుపైనే పోలీసులు ఎదురు కేసు నమోదు చేసిన విచిత్ర ఉందంతం ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ పాలనలో చోటు చేసుకుంది. ముస్లిం వ్యక్తి మరణించిన 11 రోజుల తరువాత ఒక మహిళ చేసిన ఫిర్యాదు ఆధారంగా అలీగఢ్ పోలీసులు అతనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మూక దాడి ఘటన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారినా స్థానిక బిజెపి ఎమ్మెల్యే ఒత్తిడితో ఈ హత్య కేసు విషయంలో ఎలాంటి పురోగతి చూపని అలీగఢ్ పోలీసులు, 11 రోజుల తరువాత ఫిర్యాదు చేసినా దోపిడీ, మహిళపై వేధింపులు వంటి అభియోగాలతో తక్షణమే కేసు నమోదు చేసి రంగంలోకి దిగడం అనుమానాలకు తావిస్తోంది. యోగి పాలనలో ఘటన ఎలాంటిదైనా ముస్లింలే బాధితులు అనే ఆవేదనను మరోసారి రుజువుచేస్తోంది.

ఈ వార్త వివరాల ప్రకారం అలీగఢ్‌లో ఒక హిందూ వ్యాపారి ఇంట్లో దొంగతానికి ప్రయత్నించాడన్న అనుమానంతో జూన్ 18వ తేదీ రాత్రి 35 ఏళ్ల ఔరంగజేబ్ అలియాస్ ఫరీద్‌పై స్థానికులు మూక దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి, మరణించాడు. దీనిపై ఔరంగజేబ్ సోదరుడు జాకీ ఫిర్యాదు మేరకు అలీగఢ్ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. ముస్లిం అనే కారణంతోనే దుండగులు తన సోదరుడిపై దాడికి పాల్పడ్డారని జాకీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేశారు. అయితే ఈ కేసులో నిందితులకు స్థానిక బిజెపి ఎమ్మెల్యే ముక్తా రాజా అండగా నిలుసున్నారు. హిందూ మతతత్వ కార్యకర్తలు, స్థానిక హిందూ వ్యాపారులతో కలిసి నిందితులపై పోలీసు చర్యను వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహించారు. తదుపరి అరెస్టులు చేయవద్దని డిమాండ్ చేశారు. మరోవైపు మిగతా 7లో



నేడు పెనుమాకలో సిఎం పింఛను

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం 5:45 గంటలకు ఉండవల్లిలోని ఆయన నివాసం నుంచి బయలుదేరి 6 గంటలకు పెనుమాక గ్రామానికి చేరుకుంటారని సిఎంఒ కార్యాలయం పేర్కొంది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఉదయం 6 గంటల నుంచి 6:20 గంటల వరకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎస్‌టి కాలనీలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నేరుగా పింఛన్లు పంపిణీ చేస్తారు. 6:30 గంటల నుంచి 7:15 గంటల వరకు పెనుమాకలోని మసీదు సెంటర్‌లో ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో ముచ్చటించనున్నారు. అనంతరం పెనుమాక నుంచి ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

నకిలీల నిరోధానికి చట్ట సవరణ అవసరం

కేంద్ర మంత్రి చంద్రశేఖర్

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

నకిలీ ఉత్పత్తులు మార్కెట్లోకి రాకుండా నిరోధించేందుకు ప్రస్తుతం ఉన్న చట్టాలను మార్పు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, ఐటి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. వ్యవసాయ శాఖపై గుంటూరు కలెక్టరేట్‌లో ఆయన ఆదివారం సమీక్షించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో నకిలీ విత్తనాల బెడద ఎక్కువగా ఉందని ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన దృష్టికి తేవడంతో దీనిపై ఏం చేయాలనే అంశంపై చర్చించారు. 6ఎ కేసులు నమోదు చేయడం వల్ల నిందితులు త్వరగా తప్పించుకుంటున్నారని, మళ్లీ అదే రీతిలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారని

మాట్లాడుతున్న మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

అధికారులు ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం మీడియాతో కేంద్ర మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వ్యాపారులపై 6ఎ సెక్షన్ కింద కేసులు నమోదు చేయడం వల్ల తీవ్రత ఉండడం లేదన్నారు. ఈ సెక్షన్లను మార్చేందుకు చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉందని, ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తానని చెప్పారు. నకిలీ విత్తనాలు, బయోమెట్రిక్ ఎరువుల విక్రయాన్ని నిరోధించాలని విజిలెన్స్ అధికారులను ఆదేశించామన్నారు. ప్రతి దుకాణం ముందు వారి విక్రయించే ఉత్పత్తుల వివరాలు, ధరలతో కూడిన బోర్డులను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించామని చెప్పారు. రైతులు దుకాణంలో ఏ ఉత్పత్తులు కొనుగోలు చేసినా తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ఒకవేళ ఆ విత్తనాలు, ఎరువులు నకిలీవని నిర్ధారణైతే సంబంధిత కంపెనీల నుంచి నష్టపరిహారం రాబట్టవచ్చని అన్నారు. సమీక్షలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బి.రామాంజనేయులు, నశీర్ అహ్మద్, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లోపలి పేజీలో..

విసిల వ్యవస్థపై ఆరోపణలు సరికాదు

- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

మందులపై జిఎస్‌టి దారుణం

- ప్రభుత్వ మందులు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలి : ఎపిఎంఎస్‌ఆర్‌యు

అమరావతి రాజధాని కనెక్టివిటీ కోసం

సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ

- బ్యారేజీ నుండి 200 అడుగుల వెడల్పు
- రెండో దశలో 1.8 కిలోమీటర్ల ఫ్లైఓవర్, 4.8 కిలోమీటర్ల రోడ్డు
- మణిపాల్ వద్ద జాతీయ రహదారికి లింకు
- మేఘా లిఫ్ట్ నుండి కరకట్ట విస్తరణకు ప్రణాళిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతికి కీలకమైన కనెక్టివిటీపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజధానికి సరైన రోడ్డు లేదని రాజకీయ పరమైన విమర్శలు ఎదుర్కొన్న నేపథ్యంలో ఈసారి అటువంటి విమర్శలకు తావివ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. రాజధాని

ప్రాజెక్టుల్లో రోడ్డు కనెక్టివిటీకి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. దీనికోసం ప్రస్తుతం ఉన్న కరకట్టను ప్రకాశం బ్యారేజీ నుండి వెంకటపాలెం ప్రకృతి ఆశ్రమం వరకూ 200 అడుగులు విస్తరించాలని నిర్ణయించింది. మొత్తంగా ప్రస్తుతం ఉన్న సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రకాశం బ్యారేజీ వరకూ ఒకదశ, పిడబ్ల్యుడి వర్కుషాపు నుండి సుందరయ్యనగర్ వరకూ రెండోదశలో ఫ్లైఓవర్, మూడోదశలో మణిపాల్ వరకూ కనెక్టివిటీ రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ప్రస్తుతం మధ్యలో ఆగిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డును విస్తరించి ట్రంకు రోడ్డు (పాత జాతీయ రహదారి) అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి ప్రాధాన్యతగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని సిఆర్‌డిఎ అధికారులకూ సూచించింది. గతంలో కరకట్ట రోడ్డు ఉన్నా అనుసంధాన విషయంలో కోర్టు కేసులు, రైతుల అభ్యంతరాలతో కాలం గడిచిపోయింది. దీంతో కనెకట్టివిటీ సమస్య పరిష్కారం కాలేదు. మాస్టర్‌ప్లాను ప్రకారం దొండపాడు నుండి వెంకటపాలెం రెవెన్యూ సరిహద్దు వరకూ 200 అడుగుల వెడల్పుతో రోడ్డు వేసి ఆపేశారు. టిడిపి ప్రభుత్వం మారిన వెంటనే కనీస రోడ్డులేని రాజధాని అంటూ రాజకీయ విమర్శలూ వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో ముందుగా సీడ్ యాక్సెస్ రోడ్డును ఉండవల్లి సమీపంలో పాత జాతీయ రహదారికి ప్రకాశం బ్యారేజీ దగ్గర కలపాలని నిర్ణయించారు. పెనుమాక రెవెన్యూలో 26.24 ఎకరాలకు గానూ 23 ఎకరాలు గతంలో రైతులు ఇచ్చేశారు. ఇంకా 3.24 ఎకరాలు పెండింగ్ ఉంది. ఇటీవల ఈ పొలం ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడంతో సిఆర్‌డిఎ అధికారులు మార్కింగు చేసి ఇచ్చేశారు. పరిహారం అంశంపై కమిషనర్‌నూ సంప్రదించారు. త్వరలో దీనికి పరిష్కారం లభించనుంది. అలాగే ఉండవల్లిలో మిగతా 7లో

నూతన ఆర్మీచీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

న్యూఢిల్లీ : లెఫ్టినెంట్ జనరల్ ఉపేంద్ర ద్వివేది చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ (సిఒఎఎస్)గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 1964 జులై 1న జన్మించిన లెఫ్టినెంట్ జనరల్ ద్వివేది 1984 డిసెంబర్ 15న సైన్యం (జమ్ము కాశ్మీర్ రైఫిల్స్)లో చేరారు. కమాండ్ ఆఫ్ రెజిమెంట్ (18 జెకెరైఫిల్స్), బ్రిగేడ్ (26 సెక్టార్ అస్సాం రైఫిల్స్), డిఐజి, అస్సాం రైఫిల్స్ (తూర్పు), 9 కార్ప్స్ వంటి కీలక పదవుల్లో పనిచేశారు. నార్తర్న్ ఆర్మీ కమాండర్‌గా సుదీర్ఘ కాలం సేవలందించారు. మధ్యప్రదేశ్‌లోని రేవా సైనిక్ స్కూల్‌లో ద్వివేది చదువుకున్నారు. నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి ఆయన పూర్వ విద్యార్థి. ఆర్మీ చీఫ్‌గా రెండేళ్లు సేవలందించిన జనరల్ మనోజ్ పాండే ఆదివారం పదవీ విరమణ చేశారు. 2022 ఏప్రిల్ మిగతా 7లో

అమ్మ కోసం చెట్టు

- భారత అథ్లెట్లకు శుభాకాంక్షలు
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతి ఒక్కరూ అమ్మ కోసం చెట్టు నాటాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. జులైలో జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే భారతీయ అథ్లెట్లకు శుభాకాంక్షలు తెలిపారు. 'చీర్4భారత్' హ్యాష్ ట్యాగ్‌తో వారిని ప్రోత్సహించాలని దేశ ప్రజలను కోరారు. ఆదివారం మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ మాట్లాడారు. కొన్ని నెలల విరామం ఉన్నప్పటికీ మీ నుండి లక్షల సందేశాలు వచ్చాయని, వాటిని చూడటం తనకు సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటికీ మన్ కీ బాత్ స్ఫూర్తి చెక్కుచెదరకుండా ఉందన్నారు. గిరిజనులు జరుపుకునే 'హుల్ దివాస్' సందర్భంగా ప్రధాని మోడీ తన శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంలో సంతాలీ తెగల ధైర్యసాహసాలకు ప్రతీకగా జూన్ 30న ఈ దివస్ జరుపుకుంటారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ తల్లితో కలిసి లేదా ఆమె పేరుతో ఒక మొక్క నాటాలని దేశ ప్రజలను కోరారు. అమ్మ పేరుతో ఒక చెట్టు 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారానికి మోడీ శ్రీకారం చుట్టారు. తాను తన అమ్మ పేరుతో మొక్క నాటానని చెప్పారు. అమ్మ పేరుతో మొక్కలు నాటడంతో తల్లిని గౌరవించడంతోపాటు మాతృ భూమిని కాపాడుకోవచ్చున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికలుగా మోడీ అభివర్ణించారు. ఏ దేశంలోనూ ఇంత పెద్ద ఎన్నికలు జరగలేదని, 65 కోట్ల మందికి పైగా ప్రజలు ఈ ఎన్నికల్లో ఓటు వేశారని అన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య ప్రక్రియపై తనకున్న విశ్వాసాన్ని ప్రజలు నిలబెట్టారని పేర్కొన్నారు. కేరళ సంస్కృతిలో గొడుగులకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అక్కడ అనేక సంప్రదాయాలు, ఆచారాలలో గొడుగులు ఒక ముఖ్య భాగమని తెలిపారు. కేరళలోని అట్టప్పాడిలో తయారయ్యే 'కర్తుంబి గొడుగులు' గురించి, ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు కాఫీ రుచి, సువాసనకు ప్రసిద్ధి చెందిందని కొనియాడారు. స్థానిక ఉత్పత్తులు ప్రజాదరణ పొందాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారత్‌కు చెందిన ఎన్నో ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని తెలిపారు.

“మనదేశంలోని ప్రాంతీయ భాషలను ‘వర్నాక్యులర్ లాంగ్వేజెస్’ అని పిలవటాన్ని వెంటనే మానుకోవాలి. లాటిన్ నుంచి వచ్చిన ఆ పదానికి ‘స్వదేశంలో జన్మించిన బానిసలు మాట్లాడే భాష’ అని అర్థం. బ్రిటీషు వలస పాలకులు భారతీయులను తృణీకరిస్తూ, మాతృభాషలను అగౌరవపరుస్తూ వాడిన పదం అది.”

– పాలగుమ్మి సాయినాథ్
ప్రముఖ పాత్రికేయుడు

మాటలే దేశద్రోహమైతే ...

మాటలే దేశ ద్రోహమైతే
నేను పదే పదే మాట్లాడతాను
నా వాక్కు స్వాతంత్ర్యాన్ని హక్కుగా
నా దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు
ఎన్ని సార్లైనా నేను మాట్లాడతాను

వెన్నెల కురిసే వేళలో మల్లెతీగ కోసం
మంచు కురిసే వేళలో వాసంత సమీరం కోసం
మాట్లాడుతూనే ఉంటా ...

ఒక్క వేకువ కోసం ఎన్ని నిషేధులు
తెగ్గోసినా ఫర్వాలేదు
ఎన్ని శిరస్సులు నేలకొరిగినా
నేను మాట్లాడుతూనే ఉంటాను

శంభూకుడి నుంచి ఏకలవ్యుని దాకా
గౌరీ లంకేశ్ నుంచి కుల్బుర్గి వరకు
ప్రశ్నించిన వారే చరిత్ర పుటల్లో
కోటి కాంతి దివ్వెలై ప్రకాశిస్తున్నవారే ...

గొంగళి పురుగును కాకుండా
సీతాకోకను కాలేనన్న సంగతి తెలిసినవాణ్ణి
నా మాట చైతన్యపు సునామీ అన్న
సంగతి ఎరిగినవాన్ని
మాట్లాడకుండా ఎలా ఉండగలను?

నేను మాట్లాడుతూనే ఉంటాను
మండే సూర్యుణ్ణి కౌగిలించుకున్న వాణ్ణి..
ఎండిన బీళ్లను పచ్చని పేర్లుగా మార్చినవాణ్ణి
మనుషుల కోసం మాట్లాడలేనా
మాట్లాడటం నేరమన్న వాడిని
కూల్చేదాకా మాట్లాడుతూనే ఉంటాను
నా గళాన్ని అగ్నిజ్వాలలా మండిస్తూనే ఉంటాను!

– రెడ్డి శంకరరావు
94943 33511

కాసుల కాంక్ష!

పాలుగారే లేలేత కొమ్మల
సుతిమెత్తని భుజాల మీద
బస్తాడు పుస్తకాల బరువా!
ఆరో క్లాసు నుంచే
ఐఐటీ, మెడికల్ బోధనల
అవిశ్రాంత మద్దెల దరువా!
అమాయకపు పసి మనసుల మీద
ఇది మిఠాయి పూసిన
కటారి కత్తుల దాడి కాదా?
ఎర్రగా నోళ్ళు తెరుచుకున్న
చిగురుటాకుల్ని మలమలా మాడ్చేసే
అల్ట్రా వయొలెట్ కిరణాల
దండయాత్ర కాదా?

ఎప్పుడైనా కాలం కొరడా దెబ్బలకు
కాళ్ళు లాగి తాళలేక
కాసిని నిమిషాలు లేటైతే
కారాలు మిరియాలు నూరి
ద్వారాలు మూసేయడం
ఏ శిక్షా స్మృతిలో సూత్రీకరించబడింది?

వత్తిడుల కత్తి మీద నడుస్తూ
ఊపిరాడక ఏనాడైనా ఇంటిపనిని
కాస్త వెనక్కి పెడితే బెత్తానికి పని చెప్పి
చంటి బత్తాయిల్ని దండించటం
ఏ న్యాయ శాస్త్ర నిఘంటువులో
లిఖించబడి వుంది?

రంగు రంగుల పూలు వన్నెచిన్నెల పూలు
వాటికి నచ్చిన రంగు
అవి పులుముకున్నా తప్పేనా?
మీరు మెచ్చిన రంగులోనే
అవి మునిగి తేలుతూగిలగిలా గింజుకోవాల్నా?

ఎన్నేళ్ళు ఎన్ని టెస్టుల అగ్ని పరీక్షలు నెగ్గినా
ఈ యుద్ధానికి ముగింపు పలకరే!
చిన్నపాటి సరదాలకైనా
ఏమాత్రం వెసులుబాటు నివ్వరే!

ఇంతా చేసి ఈ రూపాయల డాలర్ల
డాంబిక విలువల వేటలో
ఈ వూపిరి సలపని పెనుగులాటలో
ఆ మాలీలు నేర్పే విజ్ఞానం ఎంత?
ఈ మొక్కలకు వంటబట్టిన వివేకం ఎంత?
అర్థం లేని స్పర్ధలతో రూక చుట్టూ
గిరి గీసుకున్న దుగ్ధలతో
మానవత్వం మాటే ఎత్తని
ఈ మాయరోగపు చదువులలో
ఏ ఆత్మ విశ్వాసాన్ని బోధిస్తున్నట్టు?
శ్రమనూ చెమటనూ గౌరవించలేని
ఈ స్వార్థపూరిత విద్యల ద్వారా
ఏ స్నేహ సౌహార్ద్రాల్ని సాధిస్తున్నట్టు?

– పతివాడ నాస్తిక్.
94417 24167

మరమ్మతు చేసుకోవాలి

రూపం మారుతోంది
నదులు, సెలయేరులు,
జలపాతాలతో నిండుకున్న దేహంలోకి
కాగే ఇనుపగుండ్లు ప్రవేశించాయి

దేహాన్ని రాల్చుకుంటూ
ఒకానొక దశలో ఆకాశ దుప్పటిని కప్పుకున్నట్టు
ఎవరికీ కనపడని ప్రదేశంలో
రూపానికి మరమ్మతులు చేసుకోవాలి

గీసుకున్న రేఖల నుంచి
నిర్దేశించుకున్న చలనరహిత గమ్యాల నుంచి
తప్పటడుగుల గమనాల నుంచి
పాదముద్రలను చెరిపేసుకొని
తేజోవంతమైన పయనం వైపు సాగాలి
నిశీధిని పులుముకున్న నుదుటికి
అక్షర సమూహాలను పూసుకోవాలి
వేళ్ళ మధ్య బిగుసుకుపోయిన సున్నితత్వాన్ని
పొడిపొడిగా దేహంలోకి ఇంకించుకోవాలి.
ఇప్పుడు కావాల్సింది రెండే పరికరాలు
ఒకటి ఉలి
రెండు సుత్తి
కోల్పోతున్న రూపాన్ని చెక్కుకోడానికి!

– జాని తక్కెడశిల
72595 11956

నన్ను రచయితను చేసింది ప్రకృతి, ప్రజలు

తనను రచయితను చేసింది ప్రకతి, ప్రజలు అని ప్రముఖ రచయిత పి.చంద్రశేఖర ఆజాద్ అన్నారు. ఆయనకు ఇటీవల కేంద్రసాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారం ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయనతో జరిపిన ముఖాముఖి.



ఈ సాహిత్య పురస్కారం పొందిన మాయాలోకం నవలలో వస్తు వైవిధ్యం గురించి చెప్పండి?

మాయాలోకం ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోని ఒక మారుమూల గ్రామీణ నేపథ్యంతో రాసిన పిల్లల నవల. ఇందులో ప్రధాన పాత్రలు పిల్లలు. ఈ గ్రామానికి మూడు నాలుగు కిలోమీటర్ల అవతల ఓ రైల్వే స్టేషన్ వుంటుంది. రోజులో ఒకే ఒక్క రైలు ఓ రెండు నిమిషాలు ఆగుతుంది. తల్లిదండ్రులు విదేశాలకు వెళ్లడంతో తాత దగ్గర వుండి చదువుకునేందుకు బెంగళూరు నుంచి వచ్చిన అశోక్, అదే గ్రామానికి చెందిన బుల్లిబాబు, చిన్ని, గీత ఒకే బడిలో చదువుకుంటారు. వీరిలో బుల్లిబాబు చాలా మొరటు. ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా చలించడు. అశోక్ ఆ బడిలో చేరటంతో పిల్లల మధ్య పోటీ మొదలవుతుంది. అవన్నీ సహజ సిద్ధమైన సన్నివేశాలతో నడుస్తుంటాయి. బుల్లికి బడిలో వచ్చిన అనుభవం వల్ల తమ కుటుంబమంతా కలిసి వుండటం మంత్రాలతో సాధ్యం అనుకుంటాడు. ఆ గ్రామానికి అడుక్కోవటానికి వచ్చే ఓ సాధువును మంత్రాలు నేర్పించమని వెంటపడతాడు. చివరికి వచ్చీరాని భాషలో ఉత్తరం రాసి బోల్డన్ని డబ్బుల్తో వస్తానని వెళ్తాడు. అతన్ని మిగతా ముగ్గురు పిల్లలు ఎలా కాపాడుకున్నారు? అశోక్ కుటుంబం ఎలాంటి నిర్ణయం తీసుకుందనేది ఇందులో కీలకం. హాస్యం, జీవితం, గ్రామంలోని పరిస్థితులు ... ఇవన్నీ రేఖామాత్రంగా ఈ నవలలో చిత్రించే ప్రయత్నం చేశాను.



ఇప్పటిదాకా మీరు చేసిన సాహిత్య కృషి, మీ సృజన ఎక్కువగా దేనిపై కేంద్రీకరించారు?

1971లో మా కాలేజ్ సావనీర్‌లో తొలి కథ అచ్చయింది. ఇప్పటి వరకు 85 నవలలు, 18 నవలికలు, 850 వరకు కథలు, 15 కాలమ్స్, వ్యాసాలు, కవిత్వం రాశాను. రేడియో, టీవీ సీరియల్స్‌కి 5000 వరకూ రచనలు చేశాను. సినిమారంగంలోనూ పనిచేశాను. ఇలా ఇన్ని దశాబ్దాలుగా అన్ని రకాల ప్రక్రియల్లో రచనలు చేశాను. చేస్తున్నాను. సమాజంలో సమస్యలు ముందుకొచ్చిన ప్రతి సందర్భానికీ కథ, నవల, కాలమ్, వ్యాసాలు రాశాను. వివిధ పత్రికలు వాటిని ప్రచురించాయి.

ఆయా సందర్భాన్ని బట్టి అన్ని రూపాల్లో కృషి చేశాను. ముఖ్యంగా పిల్లలు నా జీవితంలో భాగం అయ్యారు. ఫిలాసఫీ, తాత్వికత నాకు సోవియట్ రచనల నుంచి అబ్బాయి. సరళంగా చెప్పే ప్రయత్నం, ఎక్కువ టోన్‌తో మాట్లాడని రచనలు నన్ను ప్రభావితం చేశాయి. అవి నాకు సరళత్వాన్ని నేర్పినా నా రచనలు అంత త్వరగా కొరుకుడు పడవు అంటారు. మనం దేని మీద కేంద్రీకరించాలన్నది పరిస్థితులే నిర్ణయిస్తాయి. ఏది రాస్తే అచ్చవుతుందనేది నా కొలబద్ద కాదు. ఏ పత్రికకు రాసినా నా దృష్టితో, నా పరిమిత అవగాహనతో రాశాను. ప్రచురించారు. ఆదరించారు.

మీ నేపథ్యం, రచనా రంగంలోకి రావటానికి ప్రేరణ?

మాది కమ్యూనిస్టు నేపథ్యం. మా తండ్రి లక్ష్మణరావు తెలంగాణ పోరాట సమయంలో కడలూరు జైలులో ఆరేండ్లు వుండి 1962లో మా చిన్నతనంలో చనిపోయారు. అప్పటికి కమ్యూనిస్టు పార్టీ చీలలేదు. నన్ను రచయితను చేసింది ప్రకృతి. మా మైదానం, మా చింతచెట్లు, అప్పటి పిల్లలు, ఆటలు, పాటలు ... అన్ని రంగాల్లో పైకి రమ్మని చిన్నప్పటినుండి పెనుగులాట. అంతులేని దారిద్ర్యం. చదివింది తక్కువ. అయినా రచయితగా నిలబడడానికి కారణం అది మాత్రమే నన్ను ముందుకు నడిపిస్తుందనే నమ్మకం.

ఇంటర్వ్యూ

ఇవన్నీ చెప్పాలంటే ఇక్కడ కుదరదు. నా రచనల్లో నా జీవితం కూడా వుంది. నేను కమర్షియల్ రచయితను కాకపోయినా అవసరాల కోసం రాసుకోవలసిన స్థితి. వారు ఇచ్చే 50, 100 రూపాయలు నాకు వేలతో సమానం.నా బాల్యం, నా ప్రయాణం తెలిసిన వారు ఇప్పుడు ఆశ్చర్య పోతారు. అన్ని కష్టాల నుంచి, అవ మానాల నుంచి ఎదిగాను. నాకు తెలిసిన వాడుక భాషలో ఇన్ని దశాబ్దాలు కొనసాగటం వేలాది పేజీలు రాయటంలోని వేదన, ప్రేరణ నా తల్లికి, భార్యకు, కుటుంబ సభ్యులకు మాత్రమే తెలుసు. కొందరు మిత్రులకు తెలుసు. ప్రజల్లోంచి, వారి జీవన పోరాటంలోంచి ప్రేరణ పొంది, రచనాంశాలను ఎంచుకున్నాను.

అవార్డు ప్రకటనపై మీ స్పందన?

“మీ రచనలు చదివి కవులు, రచయితలు అయినవారున్నారు. అలాగే ఉద్యోగరీత్యా మంచి స్థితిలో వున్నవారున్నారు. అది మీకు అసలయిన అవార్డు” అని ఓ మిత్రుడి మాట. ‘అందమైన పూలతోట’, ‘మా హృదయం’ అవి బాల సాహిత్యంలో ప్రయోగాత్మక రచనలు. నిజానికి పిల్లల పుస్తకం, ఆట.. ఈ రెండు నవలలు కూడా ఇంతకుముందు బాల సాహిత్య పురస్కారం పరిశీలనలోకి వెళ్లాయి. జమిందారు కోట, దేవత ఓ దేవతా, దారి తప్పిన పిల్లవాడు, రేపు రానున్న అన్వేక్షణం, ఏంజల్ ... ఇవన్నీ ఆధునిక పిల్లల నవలలు. వారి కోణం నుంచి చెప్పినవి. అందుకు వారిని దగ్గరగా చూశాను. మాట్లాడాను. కాబట్టే అవి పుట్టాయి. ఈ పురస్కార ప్రకటనను నేను ఊహించలేదు. ఇంకాస్త ఆలస్యం కావచ్చు అనుకున్నాను. రెండు రాష్ట్రాలవారు పోటీలో వుంటారు. అనేక లెక్కలుంటాయి.

నా 70 సంవత్సరాల వయసులో ఈ అవార్డు ప్రకటించారు. ఇప్పుడు నాకు అరవై సంవత్సరాలు తగ్గిపోయాయి. అందుకు కారణం నాలుగు దశాబ్దాల నుంచి పిల్లల కోసం కథ, నవల, కాలమ్, రేడియో, టెలీఫిల్మ్, సినిమా... ఇన్ని విభాగాల్లో పనిచేశాను. పిల్లల ప్రపంచం శీర్షిక ద్వారా కొంతమందిని పరిచయం చేశాను. మేం రాస్తున్నప్పుడు ఈ అవార్డు లేదు. పెద్ద పోటీలు లేవు. ఏ నవల రాసినా అందులో సామాజిక సమస్య వుంటుంది. అందుకే ఇది తాతగా కాదు, ఓ బాలుడిగా స్వీకరిస్తాను. ఆకాశంలో హరివిల్లు విరిస్తే పిల్లలు తొలకరి జల్లుల్లో ఎంత పులకరిస్తారో అంత అనుభూతిగా వుంది. ఇప్పుడు పిల్లలు కూడా రచనలు చేస్తున్నారు. అలాంటి వారికి ఒక్కసారన్నా ఈ అవార్డు ప్రకటిస్తే అప్పుడు ఈ పిల్లవాడు అంకుల్, తాత గర్వపడతాడు. ఇది నా ఆశ.

బాల సాహిత్యంలో రావలసిన మార్పులు?

నిన్నటి పిల్లలు వేరు, ఈ నాటి పిల్లలు వేరు. వారి హృదయం ఒక్కటే .అయితే తెలుగు చదువుతున్నావారు తక్కువ. ఈ సాహిత్యంలో మార్పులు రావాలంటే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పత్రికలు, మీడియా వారితో పాటు యాక్టివిస్టులు పూనుకోవాలి. అప్పుడే మార్పు వస్తుంది.

ఫ్యాంటసీ, సాహసం, హాస్యం, సైన్స్, ఇలా అనేక రకాల జోనర్స్‌లో రాయాలి. పదేండ్లు దాటిన పిల్లల కేంద్రంగా నా రచనలుంటాయి. ఇప్పుడు కావలసింది ఆధునిక బాల సాహిత్యం. ఇది అంత ఈజీ కాదు. అది పిల్లల కోసం హృదయాలను అంకితం చేసుకున్నవారు, నిశిత పరిశీలన చేసేవారు మాత్రమే రాయగలరు. సంవత్సరం పిల్లల చేతుల్లో సెల్‌ఫోన్లు వుంటున్నాయి. అందుకు తగ్గ రచనలు చేయాలి. వివిధ భాషల్లో రకరకాల ఆధునిక పాత్రలు, సిరీస్‌లు వస్తు న్నాయి. గ్రామసీమల్లో పిల్లలు ఎంతగా స్పందిస్తున్నారో. ఇన్ని చదువుల ఒత్తిళ్ళ నుంచి ఓ పిల్లల ప్రపంచాన్ని, స్వప్నలోకాలను సృష్టించుకోవటానికి చేయగలిగింది చేయాలి. అన్ని దేశాల్లో భాషాల్లో మహా రచయితలుగా పేరు పొందినవారు పిల్లల కోసం అనేక రూపాల్లో రచనలు చేశారు. మన తెలుగులో ఏ కారణాల చేతనైనా వారు పిల్లల కేసి దృష్టి సారించలేరు. అదో విషాదం.

వర్తమాన రచయితలకు మీ సూచనలు?

ఒకటి రెండు రచనలు చేసి అవార్డులు ఆశించవద్దు. పాత తరం నుంచి ఆధునిక తరం వారి రచనలు చదవండి. అసలు విషయం మనకు ప్రయాణం జీవితం. గదుల్లో కూర్చుంటే మంచి రచనలు రావు. ప్రయాణాలు చేయాలి. ప్రజల్లోకి వెళ్లాలి. వారి దగ్గర అనంతమైన సంపద వుంది. తరగని గనులున్నాయి. విమర్శను ఆహ్వానించండి. చిరు ప్రశంస చాలు. వాటిని తలకు ఎక్కించుకోవద్దు. ఎవరు ఎందుకు ప్రశంసలు కురిపిస్తారో, ఎందుకు అతిగా విమర్శిస్తారో గుర్తెరగాలి. సాహితీ ప్రపంచం అనేక రకాలుగా చీలిపోయింది. మనకు కొలబద్ద మానవీయ కోణం. ఇది. ఏ వాదానికయినా జోడించగలగాలి. బాధలు పడుతున న వారందరూ ఒక్కటే అని గ్రహించనంత కాలం అవి ఏకపక్షంగా వుంటాయి. మీ అనుభవాల నుండే మీకు పాఠాలు దొరుకుతాయి. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

సంభాషణ : **అనంతోజు మోహన్ కృష్ణ**
8897765417

వెలుగుల కోసం ‘కళింగ కథాజాడ’

1910లో అప్పటిదాకా వస్తున్న సాంప్రదాయ తెలుగు కథావరణాన్ని ఆధునికత వైపుగా ‘దిద్దుబాటు’కు లాకులు తెరిచిన గురజాడ గురుజాడను అనుసరించి కళింగాంధ్ర కథకులు గడచిన 114 ఏండ్లుగా విస్తారమైన కథా సేద్యం చేస్తూ వస్తున్నారు. ఆనాటి నుంచి అధమ పక్షం ఏడాదికి వంద కథలు వెలుగుచూశాయనుకున్నా కళింగాంధ్ర మొత్తం మీద పదకొండున్నర వేల కథలు ప్రజాబాహుళ్యాన్ని చుట్టివేశాయి. ఇంతటి కళింగ కథాసాహిత్యం అనే దధిని మధించి 63 కథల వెన్నముద్దను బయటకు తీయడం గొప్ప యజ్ఞమే! ఈ క్రతువును పట్టుదలతో నిర్వర్తించినవారు అట్టాడ అప్పల్నాయుడు, గంటేడ గౌర్నాయుడు, చీకటి దివాకర్ గార్లు.

ఒకానొక సందర్భంలో అట్టాడ అప్పల్నాయుడు కళింగాంధ్ర కథా సాహిత్యం మీద విహంగ వీక్షణం చేస్తూ, ఓ పత్రికలో వ్యాసం రాశారు. ఆ వ్యాసాన్ని చదివిన ఎంతోమంది పాఠకులు పలు విధాల స్పందనకు లోనయ్యారు. పలు రకాల అభిప్రాయాలను వెలువరించారు. అటువంటి పాఠకుల్లో ఓ అరుదైన పాఠకుడు ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యులు ఎంవిఎస్.శర్మ. వారో వేదిక మీద నుంచి మాట్లాడుతూ, ‘అట్టాడ అప్పల్నాయుడు గారి వ్యాసాన్ని చదివాను. ఆ వ్యాసాన్ని చదివిన తరువాత గురజాడ నుంచి ఇప్పటిదాకా వచ్చిన కళింగాంధ్ర కథా సాహిత్యాన్ని నాలుగు భాగాలుగా విభజించి, నాలుగు సంకలనాలుగా తెస్తే బావుంటుంది అనిపించింది. ఆలోచించండీ!” అంటూ సభలో వున్న సాహితీ ప్రేమికులకు ఓ అప్పీల్ చేశారు. ఆ సభలోని సాహితీ పిపాసులు కొందరు, సభానంతరం ఓచోట చేరి ‘శర్మ గారన్నట్టు మన కళింగ కథా సాహిత్యాన్ని నాలుగు సంకలనాలుగా తేవాలంటే మనమేం చేయాలి?’ అన్న ఆలోచన చేశారు. అనేక ఆలోచనల వడపోతల తరువాత ‘నాలుగు సంకలనాలుగా కాకుండా, నాలుగు తరాల మంచి కథలను ఎంపిక చేసి, ఒకే సంకలనంగా వెలుగులోకి తీసుకొస్తే మంచిది” అన్న అంతిమ నిర్ణయం వచ్చింది. ఆర్థిక వనరుల సమీకరణ ఏవిధంగా చేయాలన్న విషయం ముందుకొచ్చినప్పుడు “ఆ పుస్తకం ముద్రణకు ఎంత ఖర్చైనా మేము భరిస్తాం. మా చీకటి ప్రచురణల ద్వారా వెలువరిస్తాం” అంటూ చీకటి చంద్రిక, దివాకర్ దంపతులు ముందుకొచ్చారు. ఇంతకుముందు ఆ దంపతులు 2023లో ‘పేగుబంధం’ అనే శీర్షికన వందమంది కవులు రాసిన వంద కవితలతో ఓ బృహత్ సంకలనాన్ని వెలువరించారు. 2024లో వారి కుమారుడు రవితేజ, కోడలు వైష్ణవిల వివాహ సందర్భంగా ‘మహాకవుల మాటలు’ అన్న శీర్షికన దిగ్గజ కవుల, రచయితల ఉటంకింపులతో మలి సంకలనాన్ని వెలువరించారు.

సంపాదక వర్గ సభ్యులు ముగ్గురూ పలు దఫాలు సమావేశమై, 114 ఏండ్ల కళింగాంధ్ర కథా ప్రవాహంలో కొన్ని నెలలపాటు మునిగీతలు కొట్టి, నాటి గురజాడ నుంచి నేటి డా.భారతి దాకా 63 మంది కథకుల కథలను సంకలనం కోసం ఎంచుకున్నారు. అలా ఎంచుకున్న కథలను మొదట అనుకున్నట్టుగా నాలుగు తరాలుగా విభజన చేసుకున్నారు. ఈ సంకలనాన్ని చదివే ప్రతి పాఠకుడూ ఒక విషయాన్ని గమనంలో వుంచుకోవాలి. భూమి లోతుల్లో దాగివున్న బంగారాన్ని వెలికి తీయాలంటే పైనుంచి తవ్వుకుంటూ లోలోతుల్లోకి వెళ్ళితే తప్ప అది దొరకదు. అదేవిధంగా ఈ పుస్తకంలోని 63 కథలను సంపా దకులు నాలుగు తరాలుగా విభజించి వరుస వారిగా పొందుపరి చారు. పాఠకులు చదివేటప్పుడు నాలుగో తరంలోని కథలతో ప్రారంభించాలని నా సూచన. అంటే అవరోహణ క్రమంలో నాలుగో తరం నుంచి ఒకటో తరానికి చదువుకుంటూ వెళ్ళాలి. ఈ పద్ధతి 114 సంవత్సరాల కథల ఎదుగుదల క్రమాన్ని కూలంకషంగా అర్థం చేసుకోడానికి అనువుగా వుంటుంది.

నాలుగో తరంలో మొత్తం 29 మంది కథలను పొందుపర్చారు. ఈ కథల్లో ప్రధానంగా శ్రీకాకుళ సాయుధ పోరాటం చివరి దశ నుంచి మొదలై నేటి ప్రపంచీకరణలో విచ్ఛిన్నమైపోతున్న మానవ సంబంధాల స్థితిగతులను, రాజకీయార్థిక రంగాల్లో చొచ్చుకుపోతున్న ఆధునికానంతరవాద వ్యక్తి కేంద్ర విధానాల దుష్పరిణామాల ఫలితాలను... కథకులు తమ స్వంత కంఠస్వరంతో విన్పించడం గొప్పగా వుంది. నా దృష్టిలో మొదటితరం కథకుల కన్నా ఈ నాలుగో తరం కథకులు కథావరణంలో అడుగు పెట్టేనాటికి, ఆధునిక మానవ జీవనం పూర్తిస్థాయిలో సంక్లిష్టతను సంతరించుకుంది. సమాజ పరిణామాలు వేగంగా మారిపోసాగాయి. ఈ సంక్లిష్ట సమాజ గమన

పుస్తకం

వేగాన్ని అందుకోగలిగిన ఆధునిక కథకుల కథలనే సంపాదకవర్గం ఈ సంకలనంలోకి తీసుకొంది. గొప్ప ప్రయత్నాన్ని చేసిన ఈ నాలుగో తరంలోని ప్రతి కథకుణ్ణి పాఠకులు మనసారా అభినందిస్తూ, వారి నుంచి ముందు ముందు మరిన్ని మంచి కథల్ని ఆశించాల్సి వుంది.
ఈ తరంలో అట్టాడ, గంటేడ వంటి వారి కథలు ఉద్యమ స్ఫూర్తితో రాయబడిన కథలు. మిగతా కథలు వేటికవే స్వతంత్రమైన వస్తువుతో రాయబడిన కథలు. వీటిలో మానవ సంబంధాల, కుటుంబ బంధాల నేపథ్యంతో బమ్మిడి జగదీశ్వరరావు రాసిన ‘మట్టి తీగలు’. కె.ఎన్.మల్లీశ్వరి స్త్రీవాద దృష్టి కోణంతో రాసిన ‘వాడుపెరిగిన దాయి’, సత్యాజీ రాసిన ‘బంగారు పిచ్చుక’ లాంటివి మచ్చుకు కొన్ని మంచి కథలు.‘మూడో తరం’ దగ్గరికొస్తే ఇందులో మొత్తం 13 కథలున్నాయి. ఇది ఓ కథకుడుగా కళింగాంధ్రనే కాదు, మొత్తం తెలుగు సమాజాన్నే ఒక ఊపు ఊపిన భూషణం గారి తరంగా చెప్పుకోవాల్సిన తరం. వారితోపాటు చాగంటి తులసి, శ్రీపతి, పతంజలి, అర్నాద్ గార్లు కూడా కథక ప్రసిద్ధులే. కొద్దిగానే రాసినా ఎంతో మంచి కథలు రాసిన ఎన్.ఎస్.ప్రకాశరావు గారి కథల్లో నుంచి ‘పేపర్ టైగర్’ కథను తీసుకున్నారు. నిజానికి వారివి మరిన్ని మంచి కథలున్నాయి.

రెండవ తరంలో 11 మంది రచయితల కథలున్నాయి. కళింగాంధ్ర కథా క్షేత్రాన్ని సుసంపన్నం చేసిన నాలుగు తరాల్లో ఈ రెండవ తరమే మొత్తంగా లబ్ధప్రతిష్టమైన తరంగా చెప్పుకోవచ్చు. ఇందులో మొదటి కథ కుంకుడాకులు. చెట్టు మీద పండి, ఎండి నేలరాలిన ఓ బుట్టెడు కుంకుడాకులు ఒక పేద కుటుంబం పొయ్యి కిందికి ఆధారం. బుట్టెడు ఆకు ఓ చిన్నపిల్ల రెక్కల కష్టం. దాన్ని కూడా సహించలేని భూస్వామి ఆకును నేలపాలు చేస్తే? ఆ కుటుంబం ఆ పూటకు పస్తే! అది, పొయ్యి మీదికిచ్చే వాళ్ళుంటారు గాని, పొయ్యి కిందికిచ్చేవాళ్ళుండరని పేదలు రోదించే పాడు కాలం. ఆ కఠోర నిజాన్ని ఎంతో సున్నితంగా వివరించిన చాసో గారు రాసి కన్నా వాసితో వన్నెకెక్కిన కథకులు. మరో మంచి కథ కారా మాస్టారి ‘ఆర్తి’. బడుగు జీవులైన ఇద్దరు వియ్యపురాళ్ళ మధ్య ఒకరికి కూతురు, మరొకరికి కోడలు అయిన ఓ యువతిని, ఆ తల్లి తన బిడ్డను పండగ ముందు అత్తవారింటికి పంపనంటే పంపనని మొండికేస్తుంది. అత్త కూడా అంటే మోతాదులో ససేమిరా పంపాల్సిందే అంటుంది. అది ముందుగా రెండు కుటుంబాల పంచాయితీగా మొదలై తరువాత గూడెం పంచాయితీగాను, ఆ దరిమిలా మొత్తం గ్రామ పంచాయితీ గానూ రూపాంతరం చెందుతుంది. వియ్యపురాళ్ళిద్దరూ ఆ యువతిని తమ ఇంట్లోనే వుంచుకుంటామంటూ గొడవ పడడానికి మూల కారణం ఏమిటో గ్రామపెద్ద కనిపెడతాడు. ఆ నెల పంటకోతల కాలం, కాబట్టి యువతి ఎవరి ఇంట్లో వుంటే వాళ్ళకు ఆవిడ కూలిగింజలు దక్కుతాయి. అందుచేతనే ఆ అమ్మాయి కోసం వియ్యపురాళ్ళిద్దరూ గొడవ పడుతున్నారు. ఆ విషయంలోని ఆర్తిని అర్థం చేసుకున్న పెద్ద మనిషి దానికి ఎటువంటి ముగింపునిచ్చాడో తెలుసుకోవాలంటే తప్పకుండా కథను చదవాల్సిందే!

మొదటి తరంలో గురజాడ అప్పారావు గారి “దేవుళ్ళారా! మీ పేరేమిటి?’ కథా నుంచి మొదలు పెట్టి, “నీకేం తెలుసే అంట్ల వెధవా!” అన్న స్థానాపతి రుక్మిణమ్మ గారి కథ వరకు మొత్తం 10 కథలున్నాయి. ఇందులో సెట్టి ఈశ్వరరావు గారి కథ గురించి విచారిస్తే ఇదో ‘హిందూ – ముస్లిం’ కథ. అబ్బాస్ అనే ఓ బీద ముస్లిం యువకుడు నానా ఇబ్బందులు పడి పట్టణం చేరి ఒకచోట పండ్ల దుకాణం పెట్టుకొని జీవిస్తుంటాడు. ఒకరోజు రాందాస్ అనే యువకుడు ఆకలితో నకనకలాడుతూ వచ్చి ఏదైనా పని ఇమ్మని అడుగుతాడు. ఆ యువకుని అవతారాన్ని చూసిన అబ్బాస్ ‘రెండేండ్ల కిందట తన పరిస్థితి కూడా ఇలాగే వుంది కదా?’ అనుకున్నప్పటికీ రాందాస్‌తో పనిలేదు పొమ్మంటాడు. ముందుకు వెళ్ళిపోయిన రాందాస్ కొంతసేపటికి వెనుదిరిగి వస్తుంటే అతనికి పని దొరకలేదని గ్రహించిన అబ్బాస్ అతన్ని పిలిచి రెండు చపాతీలు, ఇంతపప్పు ఇస్తాడు. వాటిని తిన్న తరువాత ఒక ముస్లిం పెట్టిన రొట్టె తిని, పోసిన నీళ్ళు తాగాను. అందుకు తనను కన్న జాతి, మతమూ వెలి వేస్తాయేమోనన్న కించిత్ సందేహానికి లోనైనప్పటికి వెంటనే తేరుకుని ‘నా చర్మం వలిచి చెప్పులు కుట్టిచ్చినా ఇతని రుణం తీర్చలేను’ అనుకుని అతని దగ్గర కూలిగా కుదిరిపోతాడు.

అది చూసిన ముస్లిములు అబ్బాస్‌తో “ఒక కాఫీర్‌ని దగ్గర పెట్టుకున్నావెందుకు?” అంటూ బెదిరిస్తారు.

హిందువులొచ్చి రాందాస్‌తో “నువ్వు తురకోడి దగ్గర చాకిరీ చేసుకుంటూ వాడు పెట్టిన తిండి తినడం చూస్తుంటే మాకు తలవంపులుగా వుంది” అంటూ నిష్ఠూరమాడసాగారు. అయితే, అబ్బాస్, రాందాస్ లిరువురూ వాళ్ళ మాటలు పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుపోతుంటారు. ఇంతలో శ్రీరామ నవమి, మొహరం పడుగలు రెండూ కలిసొచ్చాయి. అబ్బాస్ తన మతస్తులైన పేదలతో పాటు హిందూ మతస్తులైన పేదలకు కూడా దానధర్మాలు చేస్తాడు. గుడిలో అభిషేకాలూ చేయిస్తాడు. అది చూసిన ముస్లిములు అతని పట్ల తీవ్రమైన కోపంతో రగిలి పోతుంటారు.

పండుగ సందర్భంగా హిందువులు దేవుణ్ణి మేళతాళాలతో మసీద్ ముందు నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లడానికి పోలీస్ వారి అనుమతి కోసం విన్నవించుకుంటారు. దాన్ని ముస్లిములు అడ్డుకుంటారు. ఫలితంగా పట్టణంలో హత్యలు, మానభంగాలు, గృహ దహనాలు జరగసాగాయి. ఆ దమనకాండలో చాలామంది చచ్చిపోయారు. చావు బతుకుల మధ్య నున్న వారితో ఆస్పత్రి నిండిపోయింది. తన దుకాణం మీద జరిగిన దాడిలో అబ్బాస్ తల మీది గాయం కావడంతో అతను చనిపోతాడు. అదే సమయంలో ఆస్పత్రి బెడ్ మీద మృత్యువుతో పోరాడుతున్న రాందాస్ మరికొద్ది సేపట్లో చనిపోతాడని తెలిసిన నర్సు “మీవాళ్లెవరన్నా వుంటే చెప్పండీ! పిలిపిస్తాం” అంటుంది. ఆ మాటలు విన్న రాందాస్ “పెద్దబజార్ దేవీడీ దగ్గర పళ్ళ దుకాణం అబ్బాస్‌ను పిలిపించండి” అంటాడు. ఆ మాటలు విన్న నర్సు అదిరిపడడంతో కథ ముగుస్తుంది.

ఈ సంకలనంలోని మొదటి కథ గురజాడ వారి “దేవుళ్ళారా! మీ పేరేమిటి” గురించి వినని, చదవని తెలుగు పాఠకులు ఉండకపోవొచ్చు. అదే విధంగా మతపరమైన అంశాన్ని వస్తువుగా తీసికొని ఓ మంచికథను రాసిన సెట్టి ఈశ్వరావు మనందరికీ ప్రాత:స్మరణీయులే. వారు గురజాడ సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చిన వారిలో ప్రథములు. ఈ మొదటి తరంలోని కథకులందరూ ఒకరిని మించి ఒకరు తమ రచనల ద్వారా సమాజంలోని అవలక్షణాలను ఎత్తిచూపి, దారి తప్పిన మనుషులను తిరిగి సన్మార్గంలోకి తేవాలన్న సమున్నత లక్ష్యంతో తమ కలాలను ఝుళిపించిన అక్షరయోధులే కావడం గమనార్హం.ఈ సంకలనాన్ని వెలుగులోకి తీసుకురావడం ద్వారా కళింగాంధ్ర కథక మిత్రులు మిగిలిన ప్రాంతాల కథకులకు మార్గదర్శకులవుతారని కథా ప్రేమికులమంతా ఆశిద్దాం. **ఎ4 సైజులో 455 పేజీలున్న ఈ అరుదైన పుస్తకం ధర రూ.400. ప్రజాశక్తి, నవతెలంగాణ బుక్ హౌస్ లో లభిస్తుంది. ప్రచురణకర్త చీకటి దివాకర్ (94411 76882) ను కూడా సంప్రదించొచ్చు.**

– శిరంశెట్టి కాంతారావు

సింగిల్ పేజీ కథల పోటీ

వంశీ ఇంటర్నేషనల్ 52 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో సాహితీకిరణం మాసపత్రిక సౌజన్యంతో సింగిల్ పేజీ కథల పోటీ నిర్వహిస్తోంది. ఉత్తమ కథకి రూ.5000, ద్వితీయ బహుమతి రూ. 3000, తృతీయ బహుమతి రూ. 2000 ఇవ్వడం జరుగుతుంది. కథలు సామాజిక స్పృహ కలిగివుండాలి. డిటిపిలో ఒక పేజీకి (ఫాంట్ 16, ఎ4 సైజు మాత్రమే ఉపయోగించాలి) మించరాదు. ఎంపిక చేయబడిన మరో 50 కథలతో కలిపి ఒక సంకలనంగా ప్రచురిస్తాం.కథలు అందవల్సిన చివరి తేదీ : 31.7.2024. కథలు పంపాల్సిన చిరునామా : ఎడిటర్, సాహితీకిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ -500102. సెల్:94907 51681.

ఖమ్మం ఈస్థటిక్స్ -2024 పురస్కారాలకు ఆహ్వానం

ఖమ్మం ఈస్థటిక్స్ 2024 పురస్కారాలకు ఆహ్వానం. మూడు ఉత్తమ కథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలు ఇవ్వడమే కాక మరి కొన్ని కథలను కూడా సాధారణ ప్రచురణకు ఎంపిక చేసి ఒక పుస్తకంగా అచ్చెయ్యడం జరుగుతుంది. మూడు ఉత్తమ కథలకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండవ బహుమతిగా రూ.15 వేలు, మూడవ బహుమతిగా రూ.10 వేలు అందచేస్తారు. ఉత్తమ కవితా సంపుటికి రూ.40 వేల నగదు బహుమతి ఉంటుంది. కవితా సంపుటి 2023 ఏప్రిల్, 2024 మార్చి మధ్య కాలంలో ప్రచురితమై ఉండాలి. సంపుటి కనీసం 25 కవితలకు తగ్గకుండా ఉండాలి. పురస్కారం కోసం కవితా సంపుటి నాలుగు ప్రతులను పంపాల్సి ఉంటుంది. పోటీకి పంపే కథలు కేవలం ఈ పురస్కారం కోసం మాత్రమే రాసినవై ఉండాలి. కథ ప్రింట్ నాలుగు ప్రతులను పోస్టులో, యూనికోడ్ సాఫ్ట్ కాపీ ఈమెయిల్‌కి పంపాలి. ఖమ్మంలో నవంబర్‌లో జరిగే వేడుకలో అవార్డుల ప్రదానం ఉంటుంది. కథలు, కవితా సంపుటులు 31 ఆగస్టు 2024లోగా పంపాలి. చిరునామా : ఖమ్మం ఈస్థటిక్స్, హార్వెస్ట్ స్కూలు, 5-7-200/11, పాకబండ బజారు, ఖమ్మం – 507 002. మొబైల్ 98491 14369. మెయిల్ ఐడి : Khammamaesthetics@gmail.com

4న ‘పండుటాకు ...’ కథా సంపుటి ఆవిష్కరణ సభ

జూలై 4వ తేదీ గురువారం సాయంత్రం 6.30 గంటలకు అన్నమయ్య కళావేదిక, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, బృందావన గార్డెన్స్, గుంటూరులో కాట్రగడ్డ దయానంద్ కథా సంపుటి ‘పండుటాకు ఎట్ గుండక్కమ్మ తీరాన’ కథాసంపుటిని డాక్టర్ పాపినేని శివశంకర్ ఆవిష్కరిస్తారు. కందిమళ్ళ శివప్రసాద్ అధ్యక్షత వహించే ఈ సభలో డి.ఎస్.వి.ఆర్.మూర్తి, వాసిరెడ్డి నవీన్, వి.ప్రతిమ, మోదుగుల రవికృష్ణ పాల్గొంటారు.

'హోదా' కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచండి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 ఎన్నికలకు ముందు ప్రధాని నరేంద్ర మోడీ తాము అధికారంలోకి వస్తే రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అయినా రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి లేదన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి టిడిపి 16 ఎంపిలు, బీహార్‌కు చెందిన జెడియు 12 మంది ఎంపిల మద్దతు కీలకమయ్యాయని తెలిపారు. జెడియు అధినేత నితీష్‌కుమార్ తమకు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు చంద్రబాబు కూడా ప్రత్యేక హోదాకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

వాగులో పడి ఇద్దరు చిన్నారుల మృతి

ప్రజాశక్తి-దర్శి (ప్రకాశం జిల్లా)

ప్రమాదవశాత్తు వాగులో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన ప్రకాశం జిల్లా దర్శి మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తూర్పు వీరాయపాలెంలో ఏర్పాటు చేసిన కోలాటం ప్రదర్శనను తిలకించేందుకు అక్కా, చెల్లెళ్ల పిల్లలైన పొదిలి మండలం ఏలూరు గ్రామానికి చెందిన ధర్నాసి రమణ (10), అద్దంకి మండలం వేలమూరుపాడు చెందిన పులి రాఘవ (12) తూర్పు వీరాయపాలెంలోని తమ అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. గ్రామ సమీపంలోని వాగు వద్దకెళ్లి ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయారు. వాగులో లోతైన గుంట ఉండడంతో ఊపిరి ఆడక చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సాయంతో మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు. నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ కడియాల లలిత సాగర్ చిన్నారుల మృతదేహాలను సందర్శించి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.

స్టాప్ డయేరియాను జయప్రదం చేయండి

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఐదేళ్లలోపు చిన్నారుల్లో డయేరియా మరణాల్ని నివారించే లక్ష్యంతో చేపట్టిన స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి కె సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుండి చేపట్టే ఈ స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఇప్పటికే రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఏర్పాట్లను పూర్తి చేసింది. జులై ఒకటో తేదీ నుండి 31 వరకు స్టాప్ డయేరియా కార్యక్రమానికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించనుంది. ఈ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, కమిషనర్ వెంకటేశ్వర్లు.. జిల్లా, మండల స్థాయిల్లో వుండే ఆరోగ్య కేంద్రాలను ఆదివారం సమాయత్తం చేశారు. పిల్లలకు నీళ్ల విరేచనాలు అవుతున్నట్లు తెలిసిన వెంటనే దగ్గర్లోని ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి వైద్యసేవలు పొందాలని పేర్కొన్నారు. అలాగే పరిశుభ్రమైన నీరు అందుతుందా లేదా అని తనిఖీలు చేయాలన్నారు.

పిచ్చి కుక్క స్వైర విహారం

- 30 మందికి గాయాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఓ పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కనపడిన వారందరిపై దాడి చేసి గాయపరిచింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్, సుద్దులపేట, దేవనగర్ తదితర ప్రాంతాలలో పిచ్చి కుక్క చిన్న, పెద్ద తేడా లేకుండా అందరిపై దాడి చేసి కరిచింది. మున్సిపాలిటీలో పని చేస్తున్న మహిళ పెదవిని కొరింది. చిన్నారులపై కూడా దాడి చేసి గాయపరిచింది. కుక్క కాటుకు గురైన బాధితులు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. గాయపడిన వారందరికీ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

'కొటియా' సమస్యకు పరిష్కారమెప్పుడు?

- ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు దృష్టి పెడతారా?

కొటియా గ్రామాలు

ప్రజాశక్తి- సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

సుమారు ఐదు దశాబ్దాలుగా ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల మధ్య నలుగుతున్న కొటియా గ్రామాల వివాదం ఇప్పటికైనా పరిష్కారం అవుతుందా అనే చర్చ ప్రారంభమైంది. కేంద్రంలో ఎన్‌డిఎ కూటమి, ఒడిశాలో ఎన్‌డిఎ భాగస్వామ్యమైన బిజెపి ప్రభుత్వం, మన రాష్ట్రంలో ఎన్‌డిఎ భాగస్వామ్యమైన టిడిపి కూటమి ప్రభుత్వం ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో సమస్యను ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి చర్చించి పరిష్కరించాలని కొటియా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. బిజెపి గతంలో మాదిరిగా రెచ్చగొట్టే వైఖరి తీసుకుంటుందో? చర్చలకు సహకరిస్తుందో? అనే చర్చ మళ్లీ మొదలైంది. ఇరు రాష్ట్రాల సరిహద్దుల్లోని 21 కొటియా గ్రామాల వివాదాన్ని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు అనేక ఏళ్ల క్రితం తీర్పు చెప్పింది. 1968 నుంచి ఇరు రాష్ట్రాల మధ్య కొటియా గ్రామాల వివాదం నడుస్తోంది. ఆ గ్రామాలు తమవేనని ఒడిశా ప్రజాప్రతినిధులు, అధికారులు వాదిస్తున్నారు. గతంలో రెండు రాష్ట్రాల అధికారులు, ఉద్యోగులు ఆ గ్రామాలకు సజావుగా రాకపోకలు సాగించే పరిస్థితి ఉండేది. గడిచిన మూడేళ్లుగా ఒడిశాలో అప్పట్లో ప్రతిపక్షంగా ఉన్న బిజెపి వైఖరి వల్ల వివాదం మరింత రచ్చకెక్కింది.

మూడేళ్ల క్రితం జరిగిన మన రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో కొటియా గ్రామాల ఓటర్లను పాల్గొననీయకుండా ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులు అడ్డుకోవడంతో వివాదం మళ్లీ రాజుకుంది. అప్పుడు మన రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులు గట్టిగా ప్రతిఘటించడంతో స్థానిక ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అప్పటి నుంచి ఒడిశాలోని కొరాపుట్ జిల్లా అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు ఏదో ఒక పేరున కొటియా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. తద్వారా అక్కడి ప్రజలపై ఒత్తిడి పెంచాలని ఒడిశా చూస్తోందని మన రాష్ట్ర అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఏడాది మే వరకు ఒడిశాలో బిజూ జనతాదళ్ ప్రభుత్వం, మన రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నాయి. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జలవివాదాలు, కొటియా గ్రామాల వివాదాన్ని పరిష్కరించే దిశగా అప్పటి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య చర్చలు జరిగాయి. అయినా, వివాదం కొలిక్కి రాలేదు.

రచ్చకెక్కించడంలో బిజెపి కీలకపాత్ర

కొటియా గ్రామాల వివాదాన్ని రచ్చకెక్కించడంలో ఒడిశాకు చెందిన బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించారు. కొటియా గ్రామాల్లో ఒకటైన పట్టు చెన్నూరులో పర్యటించినకు వచ్చిన ఒడిశాకు చెందిన బిజెపి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్... ఆంధ్రా ఉద్యోగులను ఉద్దేశించి 'ఆంధ్రా గో బ్యాక్' అనడం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. కొరాపుట్ జిల్లాకు చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులనూ ఆయన రెచ్చగొట్టారు. గత మూడేళ్లుగా మన రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు సంయమనంతో వ్యవహరించారు.

ఖనిజ సంపద వల్లే వివాదం!

కొటియా గ్రామాల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపద వల్లనే రెండు రాష్ట్రాలు పట్టు వీడడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. వివాదాస్పదంగా ఉన్న కొన్ని గ్రామాల్లో బాక్సైట్, మాంగనీస్, బంగారం ఖనిజాలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం.

విసిల వ్యవస్థపై ఆరోపణలు సరికాదు

- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌లపై వ్యవస్థాపరమైన విమర్శలు చేయడం మానుకొని, టిడిపి ప్రభుత్వమే అధికారంలో ఉన్నందున విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ అన్నారు. వైస్ ఛాన్సలర్ వ్యవస్థను భ్రష్టు పట్టించే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. విజయనగరంలోని తన సోదరుడు, మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య నివాసంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తాము మూడు రాజధానులకే కట్టుబడి ఉన్నామన్నారు. తమ పార్టీ విధానం మారితే అప్పుడు చెబుతామని, ఇప్పటికైతే మూడు రాజధానులే తమ పార్టీ విధానమని పేర్కొన్నారు.

ఏప్రిల్ నెలాఖరు నాటికి రిటైర్మెంట్‌లు కలుపుకొని 6100 పోస్టులకు డిఎస్‌సి నోటిఫికేషన్ వైసిపి ప్రభుత్వం ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం ఏ విధంగా 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తుందో తెలియాల్సి ఉందని తెలిపారు. పార్టీ కార్యాలయాలపై ఏ పార్టీకి చెందిన వారైనా దాడి చేయడం సరికాదన్నారు. తమ పార్టీ కార్యాలయాలకు కొన్ని రకాల అనుమతులు లేవని, వాటికి వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని అధికారులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. అయితే, ఓ ప్రజా ప్రతినిధి తమ పార్టీ కార్యాలయం చూసేందుకు వెళ్లడం అక్షేపణీయమన్నారు. అక్రమాలు జరిగితే విచారణ చేసి చర్యలు తీసుకోవాలేగానీ ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి వందల మందిని వెంట బెట్టుకొని కార్యాలయాలను పరిశీలించే సంప్రదాయం మంచిది కాదని అదితి విజయలక్ష్మి గజపతిరాజును ఉద్దేశించి అన్నారు.

వలంటీర్లు అవసరం లేదు...

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి- జగ్గంపేట(కాకినాడ జిల్లా)

ప్రస్తుతం వలంటీర్ల అవసరం లేదని, వారికి చంద్రబాబు ఇస్తానన్న రూ.10 వేలు పారిశుధ్య కార్మికులకు ఇస్తే గ్రామాలు పారిశుధ్య లోపం నుంచి బయటపడతాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఆదివారం కాకినాడ జిల్లా జగ్గంపేటలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వలంటీర్లకు ఇచ్చే రూ.10 వేలను పారిశుధ్య కార్మికులకు ఇస్తే పదిమందికి పని కల్పించినవారవుతామని, గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని అన్నారు. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. ఈ విషయాన్ని వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానన్నారు. చంద్రబాబు హయాంలోనే సంక్షేమం సాధ్యమని పేర్కొన్నారు. పింఛను పంపిణీకి రూ.4,408 కోట్ల నిధులు ఇప్పటికే ఆయా సచివాలయాలకు చేరాయన్నారు. వికలాంగులకు పింఛను రూ.6 వేలకు పెంచిన ఘనత చంద్రబాబుదేనని పేర్కొన్నారు. మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు పింఛను, డయాలసిస్ రోగులకు రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు పింఛను పెంచారన్నారు.

మందులపై జిఎస్‌టి దారుణం

- ప్రభుత్వ మందులు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలి
- ఎపిఎంఎస్ఆర్‌యు నేత కృష్ణయ్య

సదస్సులో మాట్లాడుతున్న కృష్ణయ్య

ప్రజాశక్తి - కాకినాడ

మందులపై జిఎస్‌టిని తొలగించాలని, మందుల ధరలు నియంత్రించాలని, ప్రభుత్వ మందులు, వ్యాక్సిన్ కంపెనీలను పునరుద్ధరించాలని ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు యువి.కృష్ణయ్య డిమాండ్ చేశారు. 'మందుల రంగంలో మార్పులు - ప్రజలపై ప్రభావం' అనే అంశంపై కాకినాడలోని యుటిఎఫ్ హోమ్‌లో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన శనివారం రాత్రి సదస్సు నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సదస్సులో కృష్ణయ్య మాట్లాడుతూ.. భారతదేశంలో స్వాతంత్ర్య సాధన తరువాత మందులు, వ్యాక్సిన్ రంగంలో ప్రభుత్వ రంగం చాలా కీలకపాత్ర పోషించిందన్నారు. 1970లో మందుల ధరల నియంత్రణ చట్టం ఉండేదని తెలిపారు. 1990 తరువాత దేశంలో అమలైన నూతన ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగం నిర్వీర్యమై ప్రయివేటు రంగం విజృంభించిందన్నారు. దీంతో ప్రభుత్వ మందులు, వ్యాక్సిన్ కంపెనీలు మూతపడ్డాయని తెలిపారు. ప్రయివేటు ఫార్మా కంపెనీలు వందల కోట్ల రూపాయలు ఎలక్టోరల్ బాండ్స్ కొన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. దేశంలో కరోనా తరువాత వైద్య కోసం ప్రజలు అప్పులపాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలంటే వైద్యారోగ్య రంగానికి బడ్జెట్‌లో 6 శాతం నిధులు కేటాయించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాలని, మార్కెట్ ఆధారిత ధరల వ్యవస్థ స్థానంలో ఉత్పత్తి ఆధారిత ధరల నిర్ణయం జరగాలని సూచించారు. డ్రగ్ కంట్రోల్ వ్యవస్థ పటిష్టంగా ఉండాలని, మందులు, వైద్య పరికరాలపై జిఎస్‌టిని పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. జెవివి కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీరామారావు ఆహ్వానం పలుకగా ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు వందన సమర్పణ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.అన్నారాం, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ

- సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐవి

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ-2024 డిసెంబర్‌లో నిర్వహించనున్నామని, దీన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు తెలిపారు. కాకినాడ అంబేద్కర్ భవన్లో ఆదివారం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి అన్నారాం అధ్యక్షతన యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భావం, ఆవశ్యకతను వివరించారు. స్వర్ణోత్సవాల విజయవంతానికి తోడ్పాటును అందిస్తానన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబర్ 14, 15 ,16 ,17 తేదీల్లో యుటిఎఫ్ స్వర్ణోత్సవ రాష్ట్ర మహాసభ కాకినాడలో నిర్వహిస్తామన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 వేల మంది ఉపాధ్యాయులు ఈ మహాసభకు హాజరవుతారని తెలిపారు. ఉపాధ్యాయులతో పాటు ప్రజా ప్రతినిధులు, నగర, జిల్లా ప్రముఖులు, విద్యావేత్తలు, విద్యా శ్రేయోభిలాషులు మహాసభల జయప్రదానికి సహకారం అందించాలని కోరారు. తొలుత అమరజీవులు చెన్నుపాటి లక్ష్మయ్య, అప్పారి వెంకట స్వామి, మైనేని వెంకట రత్నం, దాచూరి రామిరెడ్డి, వత్సవాయి సూర్యనారాయణ రాజు చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ సీనియర్ నేత గారా చిట్టిబాబు, రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మి రాజా, ఎస్ఎస్ నాయుడు, రెడ్డి మోహన్ రావు, కిశోర్, జివి రమణ, సుభాషిణి, అరుణ కుమారి, జ్యోతిబసు, శ్రీలక్ష్మి, ఎస్.పి. మనోహర్, హనుమంతరావు పాల్గొన్నారు.

రాంకీపై చర్యలు కోరుతూ ఆందోళన

- గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - పరవాడ (అనకాపల్లి జిల్లా)

రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా పరవాడ మండలం భరణికం గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, భరణికం మాజీ సర్పంచ్ బొండా తాతారావు, జనసేన నాయకులు పెద్దిశెట్టి సత్యారావు మాట్లాడుతూ భరణికం గ్రామాన్ని ఆనుకొని ఉన్న మల్లోడు గెడ్డలోకి ఫార్మా వ్యర్థ రసాయనాలను వదలడం వల్ల వల్ల తీవ్ర దుర్వాసన వస్తోందన్నారు. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, వ్యవసాయానికి నష్టం వాటిల్లుతోందని, పశువులు చనిపోతున్నాయని తెలిపారు. రాంకీ యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘించి ఆరుబయట గెడ్డలు, కాలవలు, చెరువుల్లోకి ఫార్మా వ్యర్థ జలాలను ఇష్టానుసారంగా వదులుతోందని తెలిపారు. ఫిర్యాదులు అందుతున్నా కాలుష్య నియంత్రణ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రాంకీ తీరుతో ప్రజల ఆరోగ్యానికి హాని కలుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించాలని కోరారు. ఇప్పటికే రాంకీ తీరుపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో సిపిఎం కేసు వేసిందని తెలిపారు. కార్యక్రమంలో భరణికం గ్రామస్తులు బొండా వెంకట సత్యారావు, గనిశెట్టి అప్పలరాజు, బి శివకుమార్ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న భరణికం గ్రామస్తులు

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ఆదివాసీలకు న్యాయం చేయండి

- మెగాడిఎస్‌సిపై ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్‌సిలో ఆదివాసీలకు న్యాయం చేయాలని, ఆదివాసీ డిఎస్‌సి అభ్యర్థులకు ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, మెటీరియల్ పంపిణీ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేసింది. జిఒ 3కి చట్టబద్ధత కల్పించి గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌కు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర, అల్లూరి జిల్లా నాయకులు ఎస్ ధర్మన్న పడాల్, పి బాలదేవ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ గిరిజన స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఏజెన్సీలో ఏకలవ్య గురుకుల పాఠశాల, కళాశాల సీట్లు కోసం 2500 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఈ నేపథ్యంలో సరిపడా సీట్లు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా గురుకుల పాఠశాల, కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. పివిటిజిలకు ప్రత్యేక పాఠశాల, కళాశాల నెలకొల్పాలని కోరారు. జనరల్ డిఎస్‌సికి సన్నద్ధమవుతున్న వారికి అరకు, పాడేరు, చింతపల్లి కేంద్రాల్లో ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీలో వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో దోమల నియంత్రణకు మందును పిచికారీ చేయించాలని, మలేరియా నివారణ చర్యల్లో భాగంగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వర్కర్లను నియమించాలన్నారు. కలెక్టర్ స్పందిస్తూ ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

వైసిపి హయాంలో రద్దయిన పింఛన్ల పునరుద్ధరణ

- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో రద్దు చేసిన ఐదు లక్షల సామాజిక పింఛన్లను పునరుద్ధరించే యోచనలో టిడిపి ప్రభుత్వం ఉందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని ఎంపిడిఒ కార్యాలయంలో ఆదివారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యుత్ యూనిట్లు 300 దాటిందనో, వారి పిల్లలు ఐటి రిటర్న్లు దాఖలు చేశారనే కారణాలతో వైసిపి ప్రభుత్వం పింఛన్లు రద్దు చేసిందని, వాటిని పునరుద్ధరించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెప్పారు. జగన్‌కు ప్రజలు ఒక్క ఛాన్స్ ఇస్తే ఇష్టమొచ్చినట్లు అప్పులు చేయడమే కాకుండా పింఛన్లు సైతం తొలగించారన్నారు. పింఛను సొమ్ము ఏకమొత్తంగా మూడు నెలలకోసారి ఇచ్చే ప్రతిపాదన సైతం ప్రభుత్వం వద్ద ఉందని వెల్లడించారు.

టీమిండియా విజయం స్ఫూర్తిదాయకం : పవన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెండోసారి టి-20 ప్రపంచకప్ గెలుచుకుని విశ్వ విజేతగా నిలిచిన టీం ఇండియాకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 140 కోట్ల ప్రజల ఆకాంక్షలను నిలబెడుతూ రోహిత్ సేన సాధించిన విజయం భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇది చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. జట్టు మొత్తం సమిష్టిగా రాణించిన తీరు అద్భుతమన్నారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో ఒత్తిడిని జయించి సగర్వంగా ప్రపంచకప్ సాధించిన క్రికెటర్లకు పేరుపేరునా శుభాకాంక్షలు తెలిపారు.

చల్లా తెలుగువారికి గర్వకారణం

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి పేరును ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూషన్స్ బోర్డు సిఫార్సు చేయడం తెలుగు వారందరికీ గర్వకారణమని పవన్‌కల్యాణ్ అన్నారు. ఈ మేరకు శ్రీనివాసులు శెట్టికి శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయ నేతల గుప్పెట్లో బందీ

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌ను ఎపి, తెలంగాణ, పంజాబ్, ఢిల్లీకి చెందిన క్రీడాకారులు ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వైసిపి హయాంలో క్రీడా రంగం అస్తవ్యస్తంగా మారిందని, రాజకీయ నేతల గుప్పెట్లో క్రీడా సంఘాలు బందీలయ్యాయని పవన్‌కల్యాణ్‌కు క్రీడాకారులు వివరించారు.

ప్రారంభ వేడుకలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు

ఎసిఎతో గ్రామీణ ఆణిముత్యాల వెలికితీత

- ఎపిఎల్ ప్రారంభ వేడుకలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - పిఎం.పాలెం (విశాఖపట్నం)

గ్రామీణ ఆణిముత్యాలను వెలికితీసేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) మంచి వేదిక అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. విశాఖలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఎపిఎల్) మూడో సీజన్ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ వందలాది మంది ఆటగాళ్లకు ఎపిఎల్ సువర్ణావకాశమని, ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల నుంచి యువతను ప్రోత్సహించాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. క్రీడాకారులను ఆర్థికంగా ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎపిఎల్ ద్వారా ఆంధ్ర క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి ఖ్యాతి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. ప్రతిభ కలిగి గుర్తింపులేని గ్రామీణ ప్రాంత క్రికెటర్ల కోసం రైజింగ్ స్టార్స్ పేరుతో ఒక చక్కటి వేదిక కల్పించామన్నారు. ఎసిఎ విడుదల చేసిన వేలం అర్హత జాబితాలో లేని దాదాపు మూడు వేల మంది ఆటగాళ్లకు ట్రయల్స్ నిర్వహించి ప్రతిభ చూపిన 21 మందికి ఎపిఎల్‌లో స్థానం కల్పించామని తెలిపారు. వారిలో ఏడుగురిని ఫ్రాంచైజర్లు వేలం పాటలో కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎసిఎ ప్రెసిడెంట్ శరత్ చంద్రారెడ్డి, ఎపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ మాంఛో ఫెర్రర్, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ కె మయూర్ అశోక్, మాజీ ఎంపి, బిసిసిఐ మాజీ ఉపాధ్యక్షులు గోకరాజు గంగరాజు, విశాఖ ఎంపి ఎం శ్రీభరత్, విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, విశాఖ తూర్పు, ఉత్తర ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి విష్ణుకుమార్ రాజు, జివిఎంసి మేయర్ జి హరివెంకట కుమారి పాల్గొన్నారు.

పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా రఫి, కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్‌ఎండి రఫి, ఎస్ కిరణ్‌కుమార్ ఎన్నికయ్యారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో పిడిఎస్‌యు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పిడిఎస్‌యు రాష్ట్ర కమిటీకి నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంది. అధ్యక్షులుగా రఫి, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్‌తోపాటు ఉపాధ్యక్షులుగా భానుప్రసాద్, సహాయ కార్యదర్శిగా బి సిద్ధూ, కోశాధికారిగా రూపాశంకర్, కార్యవర్గ సభ్యులుగా చంద్రశేఖర్, శ్రీను, నాగరాజు, సోమశేఖర్, సాహిత్, వేణు, వైష్ణవ్‌లతో రాష్ట్ర కమిటీ ఎన్నికైంది. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ టి సత్యనారాయణ, పిడిఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎమ్ రామకృష్ణ మాట్లాడారు. విద్యార్థులకు శాస్త్రీయమైన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని అన్నారు.

ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
ADITYA BIRLA CAPITAL — PROTECTING INVESTING FINANCING ADVISING
రిజిస్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండు, వెరవల్, గుజరాత్-362266
బ్రాంచి ఆఫీసు: ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.40-2-5ఎ, సి.వి.ఆర్.చాంబర్, 6వ అంతస్తు, కళానికేతన్ ప్రక్కన, ఎం.జి.రోడ్, విజయవాడ-520010.

అనుబంధం-4
(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(1))
స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

ఏదైతే, క్రింది సంతకందారు, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002)(షార్ఫసీ యాక్ట్) క్రింద **ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, తేది: **23.04.2024**నాటి **డిమాండ్ నోటీసు** జారీచేసి, **రుణగ్రహీత: నంబూరి మధుసూధన రావు, లక్ష్మి నంబూరి, మెసర్స్ వెంకట సాయి రైస్ & జెనరల్ మర్చంట్** అనువారిని సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలు **రూ.24,00,202.09పై.లు (రూపాయలు ఇరువై నాలుగు లక్షల రెండు వందల రెండు మరియు తొమ్మిది పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీతలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సర్వజనులను ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **28 జూన్, 2024న స్వాధీనంచేసుకున్నారు.**
ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, **ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** కుమొత్తాలు **రూ.24,00,202.09పై.లు (రూపాయలు ఇరువై నాలుగు లక్షల రెండు వందల రెండు మరియు తొమ్మిది పైసలు మాత్రమే)**లను చెల్లించుటకులోబడి ఉంటుంది.
సెక్యూర్డ్ అసెట్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.
స్థిరాస్తి వివరణ
గుంటూరు, ఆం.ప్ర.-522004 వద్ద రిషి వ్యాలీ హౌమ్స్ యొక్క సైటు యొక్క 3324.4/9 చ.గ.ల విస్తీర్ణంనకుగాను ఆర్. అగ్రహారం గ్రామం యొక్క డి.నం.4/1బి, అర్బన్ ల్యాండ్ సీలింగ్స్‌చేత సిద్ధంచేసిన సబ్-డివిజన్ ప్రకారం డి.నం.4/1, పట్టా నం.1053, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధుల్లో, టొబాకో బోర్డు ఎదురుగా, నల్లపాడు రోడ్, గుంటూరు సిటీ, గుంటూరు సబ్-డిస్ట్రిక్ట్, గుంటూరు జిల్లాలో గల సైటులో కేటాయించిన ఏదైతే 798చ.అ.ల (ఉమ్మడి ఏరియాలేకుండా) ప్రతిపాదిత ప్లింత్ ఏరియాతో "రిషి వ్యాలే హౌమ్స్" యొక్క ప్రతిపాదిత మూడవ అంతస్తులోగల ఫ్లాట్ నం.బి-411 యొక్క మొత్తం భాగం. మరియు **సరిహద్దులు: తూర్పు:** ఒపెన్ టు స్కై, **పడమర:** ఉమ్మడి కారిడార్, **ఉత్తరం:** ఒపెన్ టు స్కై, **దక్షిణం:** ఒపెన్ టు స్కై.

ప్రదేశం: గుంటూరు — అధీకృత అధికారి
తేది: 28.06.2024 — ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

స్వాధీనతా ప్రకటన DCB BANK

ఏదైతే, క్రింది సంతకందారు డిసిబి బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు జారీచేసి, రుణగ్రహీతలు & సహ-రుణగ్రహీతలును సదరు నోటీసు తేది నుండి 60 రోజుల్లోగా ట్యాబులర్ ఫారంలో దిగువ వివరించినట్లు నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను దానిపై తదురి వడ్డీతో మొ॥వాటితోపాటు తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
రుణగ్రహీత మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెంది యున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత, హామీదారులు మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సదరు రూల్స్ యొక్క రూల్ 8తో మరియు సెక్షన్ 14(1)తోచదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని ఇందు దిగువ వివరించిన ఆస్తిని ఇందు దిగువ పేర్కొన్న తేదీన **స్వాధీనంచేసుకున్నారు.**
ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, డిసిబి బ్యాంక్ లిమిటెడ్‌కు ఇందు దిగువ పేర్కొన్న సదరు మొత్తాలను చెల్లించుటకులోబడి ఉంటుంది.
రుణగ్రహీతలు సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు, అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)కు నియమాలతో శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది.

1)
డిమాండ్ నోటీసు తేది: 26 ఫిబ్రవరి, 2024 | లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 26 జూన్, 2024.
రుణగ్రహీతలు & సహ-రుణగ్రహీతల పేరు: శ్రీ అయ్యపు రెడ్డి అనిల్ & శ్రీమతి అయ్యపురెడ్డి అరుణ.
లోన్ అకౌంట్ నంబరు: డిఆర్‌బిఎల్‌విజఎ00504140.
బకాయి మొత్తాలు: 26 ఫిబ్రవరి 2024 నాటికి **రూ.26,16,188.85/-** (రూపాయలు ఇరువై ఆరు లక్షల పదహారు వేల నూటా ఎనభై ఎనిమిది మరియు ఎనభై ఐదు పైసలు మాత్రమే)
స్థిరాస్తి వివరణ: గుంటూరు జిల్లా, గుంటూరు సబ్-డిస్ట్రిక్ట్, బుదంపాడు గ్రామ పంచాయతి, ఇప్పుడు గుంటూరు మున్సిపాలిటీ కార్పొరేషన్ ఏరియా పరిధుల్లోనిది, బుడంపాడు గ్రామం, డోర్ నం.131/డి, ఎక.2-25సెంట్లకుగాను ఎక.0-90 1/2 సెంట్లులో 106-49చ.గల విస్తీర్ణంలో ఆకుల రాంబాబు యొక్క ఉత్తరం వైపు సైటు, ఆర్‌సిసి ఇంటితో సైటు (సెక్యూర్డ్ అసెట్స్)"

2)
డిమాండ్ నోటీసు తేది: 27 మార్చి, 2024 | లాంఛనప్రాయ స్వాధీనతా తేది: 26 జూన్, 2024.
రుణగ్రహీతలు & సహ-రుణగ్రహీతల పేరు: శ్రీ భీమిరెడ్డి నాగఛౌదర్ రెడ్డి, శ్రీమతి భీమిరెడ్డి ప్రియాంక, శ్రీ భీమిరెడ్డి శరన్ కుమార్ రెడ్డి, మెసర్స్ మల్లేశ్వరి డైరీ ఫారం ప్రతినిధి: శ్రీ భీమిరెడ్డి నాగఛౌదర్ రెడ్డి & శ్రీమతి భీమిరెడ్డి రాణి.
లోన్ అకౌంట్ నంబరు: డిఆర్‌బిఎల్‌విజఎ00535917.
బకాయి మొత్తాలు: 27 మార్చి 2024 నాటికి **రూ.83,72,701/-** (రూపాయలు ఎనభై మూడు లక్షల ...

ఎడతెరపిలేని వర్షం

- మెట్ట పంటలకు జీవం
- కృష్ణాలో 908.8 మిల్లీ మీటర్లు నమోదు

గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని జగనన్న కాలనీలో చిత్తడిగా మారిన రోడ్లు

ప్రజాశక్తి-యంత్రాంగం
బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పలు జిల్లాల్లో ఎడతెరపిలేని వర్షం కురిసింది. దీంతో మెట్ట పంటలకు జీవం పోసినట్లైంది. పత్తి, మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా సాగుచేయని పొలాల్లో విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమయ్యారు.

ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం 8.30 నుంచి ఆదివారం 8.30 గంటల వరకు కృష్ణా జిల్లాలోని 25 మండలాల్లో 908.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున ఒక్కో మండలంలో 36.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కృత్తివెన్ను మండలంలో 72.2 మిల్లీ మీటర్లు, నందివాడలో 57.4, బంటుమిల్లిలో 54.2, పెదపారుపూడిలో 53.2, గుడివాడలో 48.2, పామర్రులో 46.2, నాగాయలంకలో 44.8, గుడ్లవల్లేరులో 44.8, వుయ్యూరులో 43.4, ఉంగుటూరులో 42.6, ఘంటసాలలో 41.8, పమిడిముక్కలలో 38.6, చల్లపల్లిలో 34.6, తోట్లవల్లూరులో 33.4, పెనమలూరులో 32.2, కంకిపాడులో 28.2, అవనిగడ్డలో 26.8, గన్నవరంలో 26.4, కోడూరులో 23.4. మచిలీపట్నంలో 21.6, మోపిదేవిలో 20.2, బాపులపాడులో 19.8, మొవ్వలో 18.8, గూడూరులో 18.2, అత్యల్పంగా పెడనలో 17.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. గుంటూరులో అత్యధికంగా 113.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 60.5 మిల్లీ మీటర్ల సగటు వర్షంపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై వర్షం నీరు, మురుగునీరు కలిసి పారడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పల్నాడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మెట్ట భూముల్లో పత్తి, అపరాల సాగుకు అవకాశాలు మెరుగుపడ్డాయి.

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, రాజానగరం, కడియం మండలాల్లో గంటపాటు భారీ వర్షం కురిసింది. రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. కాకినాడ జిల్లా సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. యు.కొత్తపల్లిలో సముద్రం అల్లకల్లోలంగా ఉంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆలమూరు, కొత్తపేట, అమలాపురం, రాజోలు, సఖినేటిపల్లి మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షాలతో కోనసీమలో రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు.

అల్లూరి జిల్లా జికె.వీధి మండలం సీలేరులో ఆదివారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో వారపు సంతకు అంతరాయం ఏర్పడింది. విఆర్.పురం మండలంలో కురిసిన వర్షానికి కొండలపై నుంచి వరద రావడంతో అన్నవరం వాగు పొంగి ప్రవహించింది. రాకపోకలకు అంతరాయం తలెత్తింది.

ఫ్యూడల్ శక్తులను తరిమికొడతాం

- జార్ఖండ్ మాజీ సిఎం హేమంత్ సొరేన్

సాహిబ్‌గంజ్ : సంతాల్ తిరుగుబాటు స్ఫూర్తితో ఫ్యూడల్ శక్తులను, బిజెపిని తరిమికొడతామని జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం) అధినేత హేమంత్ సొరేన్ ప్రకటించారు. రాంచీలో భూమి పత్రాలు ఫోర్జరీ చేశారంటూ ఇడి నమోదు చేసిన మనీ లాండరింగ్ కేసులో ఆధారాలు లేవంటూ శుక్రవారం ఆయనను బెయిల్‌పై హైకోర్టు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆదివారం ఇక్కడ జరిగిన సభలో ఆయన సిఎం చంపయి సొరేన్, తన భార్య కల్పనతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమంత్ సొరేన్ మాట్లాడుతూ బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సాగిన సంతాల్ తిరుగుబాటు తరహాలో జార్ఖండ్ నుంచే కాకుండా దేశం నుంచే భూస్వామ్య శక్తులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత బిజెపి జార్ఖండ్‌లో తుడిచిపెట్టుకుపోతుందని చెప్పారు. దేశవ్యాప్తంగా అధికారం నుంచి బిజెపిని ఇండియా వేదిక పెకలిస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ తప్పుడు విధానాలపై గళం విప్పుతున్న వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. తనను తప్పుడు కేసుల్లో ఇరికించారని, మరోసారి జైలుకు పంపేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. జార్ఖండ్ విప్లవకారుల భూమి అని, జైలుకైనా, లాఠీ దెబ్బలకైనా, చివరికి ఉరి శిక్షకు సైతం భయపడేలది లేదని సొరేన్ అన్నారు.

టిస్‌లో సిబ్బంది తొలగింపు నిర్ణయం వెనక్కి

ముంబయి: అధ్యాపకులు, సిబ్బంది తొలగింపునకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఉద్యమించడంతో టిస్ యాజమాన్యం దిగొచ్చి తన నిర్ణయాన్ని వెనక్క తీసుకుంది. ముంబయి, హైదరాబాద్, గౌహతిలోని నాలుగు టిస్ క్యాంపస్‌లలో కాంట్రాక్టు పద్ధతిన నియమించిన వందమందికిపైగా బోధన, బోధనేతర సిబ్బందిని తొలగిస్తున్నట్లు తొలుత ప్రకటించింది. ఈ మేరకు నోటీసులు కూడా ఇచ్చింది. అయితే, దీనిపై పెద్దయెత్తున విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేయడంతో టాటా ఎడ్యుకేషన్ ట్రస్టు టిస్ ఫ్యాకల్టీ, నాన్ టీచింగ్ సిబ్బంది జీతాల కోసం నిధులు సమకూర్చుతామని హామీ ఇవ్వడంతో సిబ్బంది కుదింపు ప్రస్తుతానికి లేనట్టేనని టిస్ ఆదివారం నాడొక ప్రకటనలో తెలిపింది. ఇనిస్టిట్యూట్ నడపడంలో టిస్ పరిపాలనా నాయకత్వ వైఫల్యం, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. దాదాపు వంద మంది ఉద్యోగుల జీవనోపాధి లాగేసి, విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడవేసేందుకు ప్రస్తుత టిస్ యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం యత్నించాయని అది విమర్శించింది. టిస్ 1936లో ప్రారంభించబడిన డీమ్డ్ విశ్వవిద్యాలయం. ఇది పూర్తిగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిధులతో టిస్ సొసైటీ చే నిర్వహించబడుతోంది. టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ కాంట్రాక్టు నియామకాలకు సంబంధించి నిధులను ట్రస్ట్ గ్రాంట్ల ద్వారా ఇస్తుంది.

ఇపిఎఫ్‌ఓలో తగ్గిన కొత్త సభ్యులు

న్యూఢిల్లీ : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఇపిఎఫ్ఓ)లో కొత్త సభ్యుల చేరిక తగ్గిపోయింది. గత సంవత్సరంతో పోలిస్తే 2023-24లో కొత్త చందాదారుల సంఖ్య 4 శాతానికి తగ్గి 10.9 మిలియన్లకు చేరిందని గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ నివేదిక తెలిపింది. 2022-23లో ఇపిఎఫ్‌ఓలో 11,498,453 మంది కొత్త సభ్యులు అదనంగా చేరగా 2023-24లో 10,993,119 మాత్రమే చేరారు. నూతన సభ్యుల చేరిక తగ్గడానికి కోవిడ్ కూడా కారణమేనని భావిస్తున్నారు. 2019-20లో 11,040,683 మంది కొత్త సభ్యులు చేరగా 2020-21లో 8,548,898 మంది చేరారు. 2021-22లో సభ్యుల సంఖ్య మళ్లీ పెరిగి 10,865,063కు చేరింది.

ప్రాణాంతక కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2020, 2021లో పలు ఆంక్షలు విధించాయి. ఫలితంగా ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగాలపై ప్రభావం పడింది. 2023-24కు ముందు ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఇపిఎఫ్‌ఓలో చేరిన నూతన సభ్యుల సంఖ్య కోవిడ్‌కు ముందున్న 2018-19 స్థాయికి చేరుకోలేకపోయింది. 2018-19లో ఇపిఎఫ్ఒలో 13,944,349 మంది కొత్త సభ్యులు చేరారు. ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఇఎస్ఐసి)లో కూడా నూతన సభ్యుల చేరిక తగ్గింది. 2022-23లో 17,760,672 మంది సభ్యులు చేరితే 2023-24లో మంది 16,773,023 మాత్రమే చేరారు. జాతీయ పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్)లో మాత్రం నూతన చందాదారుల సంఖ్య పెరిగింది.

టీమిండియాకు రూ.125 కోట్ల నజరానా

- బిసిసిఐ కార్యదర్శి జైషా వెల్లడి

ముంబయి : టి20 ప్రపంచ కప్ 2024ను సాధించిన భారత పురుషుల క్రికెట్ జట్టుకు బిసిసిఐ బహుమతిని ప్రకటించింది. జట్టు మొత్తానికి రూ.125 కోట్ల నగదు బహుమతి ఇస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు సామాజిక మాధ్యమాల్లో బిసిసిఐ కార్యదర్శి జైషా తెలిపారు. శనివారం దక్షిణాఫ్రికాతో జరిగిన ఫైనల్‌లో భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించి రెండోసారి టీ20 ప్రపంచకప్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అద్భుతంగా ఆడి ప్రపంచకప్ గెలుచుకున్న టీం ఇండియాపై ప్రశంసలు కురుస్తున్నాయి. దీంతో విజేత భారత జట్టుకు బిసిసిఐ భారీ మొత్తాన్ని ప్రకటించింది.

జలపాతం వద్ద నలుగురు గల్లంతు

ముంబయి : సెలవు రోజు సరదాగా గడిపేందుకు విహారయాత్రకు వచ్చిన ఓ కుటుంబానికి తీరని విషాదం మిగిలింది. ఓ జలపాతం వద్ద మహిళ, నలుగురు చిన్నారులు గల్లంతయ్యారు. ఇందులో ముగ్గురి మృతదేహాలు లభ్యం కాగా.. మిగతా ఇద్దరి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మహారాష్ట్రలో లోనావాలా ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కుటుంబం ఆదివారం లోనావాలాలో డ్యామ్ సమీపంలోని జలపాతం సందర్శనకు వచ్చింది. వీరిలోని ఒక మహిళ (40), ముగ్గురు బాలికలు, ఓ బాలుడు ప్రమాదవశాత్తు అందులో జారిపడిపోయారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా Bank of Baroda
లక్ష్మీపురం బ్రాంచి
డి.నెం. 5-87-6, లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, గుంటూరు - 522007, ఎపి. ఇండియా

డిమాండ్ నోటీసు
(సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం)

ఋణగ్రహీత : 1) మెస్సర్స్ ధరణి ఇన్‌ఫ్రాటెక్ ప్రై.లి., రిజిస్టర్డ్ ఆఫీస్ : ఫ్లాట్ నెం. 401, 4వ అంతస్తు, శ్రీ బ్రహ్మరి హోమ్స్, విద్యానగర్, 1వ లైన్, గుంటూరు -522007. డైరెక్టర్స్ : 1) శ్రీ నాగిరెడ్డి దుర్గా మహేష్, తండ్రి : బాబూరావు, డోర్ నెం. 80-1-8, జయ శ్రీ గార్డెన్స్, 3వ వీధి, ఎ వి అప్పారావు రోడ్డు, రాజమండ్రి (అర్బన్), తూర్పు గోదావరి, ఎపి-533101. **2) శ్రీ కంచేటి శ్రీనివాసరావు,** తండ్రి : వర ప్రసాదరావు, డోర్ నెం. 2-7/3, భట్లూరు, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా, ఎపి-522403. **3) శ్రీ వెంకటరావు గాడిపర్తి,** తండ్రి : వెంకటేశ్వర్లు, డోర్ నెం. 5-5-21, నాగార్జున నగర్, లాల్‌బహదూర్ రోడ్డు, సత్తెనపల్లి, గుంటూరు జిల్లా, ఎపి - 522403. **హామీదారు : శ్రీ పెంకె కోటేశ్వరరావు,** తండ్రి : రాంబాబు, డోర్ నెం. 2-547, ఎల్ఐజి-2-164, ఎపిహెచ్‌బి కాలనీ, లాల్ చెరువు, రాజనగరం, తూర్పు గోదావరి, ఎపి-533108

విషయము: బ్యాంక్ ఆఫ్ బరోడా, లక్ష్మీపురం బ్రాంచి వారు మీకు మంజూరు చేసిన ఆర్థిక సహాయం- క్యాష్ క్రెడిట్ లోన్ చెందిన అసలు మరియు వడ్డీ, మొదలగునవి చెల్లించడంలో మీరు విఫలం అయినారు.
సెక్యూరిటైజేషన్ అండ్ రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిస్టర్ పోస్ట్ ద్వారా **తేది. 25-06-2024** న మీకు తిరుగు రసీదుతో కూడిన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. కానీ సదరు నోటీసు బట్వాడ కానందున తపాల శాఖ వారిచే బ్రాంచినకు తిరిగి వచ్చినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది : మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించ నందున సదరు అకౌంట్ **తేది. 17-05-2024 నుండి నిరర్థక ఆస్తిగా** (ఎన్‌పిఎ) పరిగణింపబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు ది. 22-06-2024 నాటికి చెల్లించవలసిన **బకాయి మొత్తం రూ. 92,47,328/- (అక్షరాల తొంభై రెండు లక్షల నలభై ఏడు వేల మూడు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు ది. 23-06-2024 నుండి వర్తించని వడ్డీ మరియు ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు బ్యాంక్ ఆఫ్ బరోడా వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (13) నియమాను సారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా వారి ముందస్తు లిఖిత అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకం, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం జారీచేయబడినది.

ఆస్తి వివరములు:
ఆస్తి వివరం 1 : (సేల్ డీడ్ నెం. 11841/2015, తేది : 21-11-2015, రాజమండ్రి ఎస్ఆర్ఓ నందు రిజిస్టర్ కాబడినది) తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి జిల్లా రిజిస్ట్రార్, రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్, గాంధీపురం-3 గ్రామ ఆర్.ఎస్.నెం. 266/పి, మున్సిపల్ పాత వార్డు నెం. 31, కొత్త వార్డు నెం. 12, డోర్ నెం. 77-2-27, మున్సిపల్ ...

నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ nido HOME FINANCE
(గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)
రిజిస్టర్డు ఆఫీసు: 5వ అంతస్తు, టవర్ 3, వింగ్ బి, కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్, కుర్లా (వెస్ట్), ముంబయి-400070.
రీజినల్ ఆఫీసు చిరునామా: 3వ & 4వ అంతస్తు, శ్రీ ప్రశాంతి సాయి టవర్స్, ప్లాట్ నెం.68, మున్సిపల్ నెం.8-2-248, నాగార్జున హిల్స్,రోడ్ నెం.1, బంజారాహిల్స్, పంజగుట్ట దగ్గర, హైదరాబాద్-500082

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు) (రూల్8(1))
ఏదైతే క్రింది సంతకందారు నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (రెండవ) ఆర్డినెన్స్ 2002, (ఆర్డర్ 3 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క (రూల్ 3)తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో ఈ నోటీసు స్వీకరించిన 60 రోజులలోగా నోటీసులో పేర్కొన్న మొత్తాలు **రూ.36,51,156.19/-(రూపాయలు ముప్పైఆరులక్షల యాభైఒకవేల ఒకవంద యాభైఆరు & పందొమ్మిది పైసలు మాత్రమే)** తిరిగిచెల్లించవలసిందిగా **శ్రీ గంజికుంట కోదండ రామాంజనేయులు (రుణగ్రహీత) మరియు శ్రీమతి గంజికుంట శ్రీనివాసరావు(సహ-రుణగ్రహీత)**కోరుతూ **తేది.21.11.2023నాటి డిమాండ్ నోటీసు** జారీచేయబడినది.
రుణగ్రహీతలు బకాయిలను చెల్లించుటలో విఫలం చెందియున్న కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగు సంతకందారులు సెక్యూరిటి ఇంట్రెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదవగల చట్టంలోనిసెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని అధీకృత అధికారి **26 జూన్, 2024**న భౌతికంగా స్వాధీనంలోకి తీసుకున్నారు.
ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా ఆస్తులతో లావాదేవీలు జరపరాదని మరియు ఆస్తులతో లావాదేవీలకు జరుపుటకు **నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తెలిసినది)** వారికి బకాయిలు **రూ.36,51,156.19/-(రూపాయలు ముప్పైఆరులక్షల యాభైఒకవేల ఒకవంద యాభైఆరు & పందొమ్మిది పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది.
సెక్యూర్డు అసెట్స్‌ను విడిపించుటకు అందుబాటులోన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉప-సెక్షన్ (8)లోని నియమాలను అనుసరించి రుణగ్రహీతల శ్రద్ధను ఆహ్వానిస్తున్నారు.
ఆస్తి యొక్క షెడ్యూలు:
గుండిమీద గ్రామపంచాయతీ, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా-522501లోని డోర్ నెం.254, జిఆర్ ఎన్‌క్లేవ్, 1వ అంతస్తు, ఫ్లాట్ నెం.201 కలిగిన మొత్తం భాగం. **సరిహద్దులు:ఉత్తరం:** ఒపెన్ టు స్కై, **దక్షిణం:** ఒపెన్ టు స్కై, **తూర్పు:** ఒపెన్ టు స్కై, **పడమర:** మెట్లు, లిఫ్ట్& ఉమ్మడి కారిడార్.

ప్రదేశం: గుంటూరు, — సం/- అధీకృత అధికారి
తేది:26.06.2024 — నిడో హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున (గతంలో ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

ఫారం నం.3
(రెగ్యులేషన్-15(1)(ఎ) చూడండి)/16(3)
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ విశాఖపట్నం
గ్రౌండ్ & ఆంప్; 1వ అంతస్తు, 31-31-21, సాయిబాబా వీధి, నారాయణ్ భవన్, దాదా గార్డెన్స్, విశాఖపట్నం-530020.
కేస్ నం.: ఓ.ఎ. నం. 35 ఆఫ్ 2022
డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్, 1993 యొక్క రూల్ 5 యొక్క సబ్-రూల్ (2ఎ)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 19 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద సమ్మన్లు.
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
మరియు
మెసర్స్ మహతి మెడికేర్ & ఇతరులు
టు,
డి1 మెసర్స్ మహతి మెడికేర్, ప్రతినిధియైన దీని యజమాని, శ్రీ సురేశ్ కుమార్ పెనుమడు, తండ్రి సుబ్రమణ్యం, 72/6/2, 1వ అంతస్తు, లక్ష్మి నర్సింగ్ హౌమ్ వీధి, రిలయన్స్ డిజిటల్ ప్రక్కన, పటమట, విజయవాడ-520010.
డి2 సురేశ్ కుమార్ పెనుమడు, తండ్రి సుబ్రమణ్యం, లోటస్ జి-2, వికాస్ పబ్లిక్ స్కూల్ రోడ్, బల్లెం వారి వీధి, ప్రసాదంపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా-521108.
డి3 శ్రీమతి హేమలత పెనుమడు, విజయవాడ, కృష్ణా జిల్లా-521108.
పత్రికా ప్రకటన రూపంలో సమ్మన్లు
ఏదైతే, గౌరవ ప్రిసైడింగ్ ఆఫీసుర్/ రిజిస్ట్రార్ వారి సమక్షంలో 24.07.2024న ఓఎ/35/2022 లిస్టెడ్‌చేయబడినది.
ఏదైతే, ఈ గౌరవ ట్రిబ్యునల్ వారు **రూ.39,35,843.76 పై.లు** (అనుబంధం, పత్రాలు మొ॥వాటి కాపీలతోపాటు దరఖాస్తు)ల డెట్‌ను రికవరీచేయుట కొరకు మీ పై ఫైల్‌చేసిన (ఓఏ), చట్టం యొక్క సెక్షన్ 19(4) క్రింద సదరు దరఖాస్తుపై సమ్మన్లు/నోటీసు జారీచేసింది.
చట్టం యొక్క సెక్షన్ 19 యొక్క సబ్-సెక్షన్ (4)తో అనుసరించి, ప్రతివాదులను దిగువ విధంగా ఆదేశించబడినది:
(1) కోరిన నష్టపరిహారం ఎందుకు ఇవ్వకూడదో తెలుపుతూ సమ్మన్స్ జారీ నుండి ముప్ఫై రోజుల్లోగా షోకాజ్‌కు;
(2) ఒరిజినల్ దరఖాస్తు యొక్క వరుస నంబరు 3ఎ క్రింద దరఖాస్తుదారునిచే సూచించిన ఆస్తులు లేదా అసెట్స్ కు ఇతరత్రా ఆస్తులు మరియు అసెట్స్ డిస్‌క్లోజ్ వివరాలు;
(3) ఆస్తుల అటాచ్‌మెంట్ కొరకు దరఖాస్తు విచారణ& డిస్పోజల్ పెండింగులో, ఒరిజినల్ దరఖాస్తు యొక్క వరుస నంబరు 3ఎ క్రింద సెక్యూర్డ్ అసెట్స్ లేదా అట్టి ఇతర అసెట్స్ & ఆస్తుల డిస్‌క్లోజ్డ్ లేదా లావాదేవీల నుండి మీరు నిషేదింపబడినారు;
(4) ట్రిబ్యునల్ యొక్క ముందస్తు ఆమోదం లేకుండా ఒరిజినల్ దరఖాస్తు యొక్క వరుస నంబరు 3ఎ క్రింద ఏదైతే క్రియేట్‌చేసిన సెక్యూరిటీ ఇంటెరెస్ట్ మరియు/లేదా ఇతర అసెట్స్ & సూచించిన ఆస్తులు లేదా డిస్‌క్లోజ్డ్ ఆస్తులతో అతని సాధారణ వ్యాపారం చేయుటకు మినహా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాల ద్వారా మీరు బదిలీచేయలేరు.
(5) అట్టి ఆస్తుల పై సెక్యూరిటీ ఇంటెరెస్ట్ నిర్వహించుట ఆర్థిక సంస్థలు లేదా బ్యాంకుతో నిర్వహిస్తున్న ఖాతాలోకి ప్రవేశించిన అట్టి అమ్మకం డిపాజిట్ మరియు వ్యాపారంను సాధారణంగా నిర్వహణలో సెక్యూర్డ్ అసెట్స్ లేదా ఇతర ఆస్తుల అమ్మకం ద్వారా రియలైజ్డ్‌కు అమ్మకం కొరకు మీ ఖాతాకు ఆస్కారం ఉంటుంది.
దరఖాస్తులో చూపినట్లుగా ఒక కాపితో వ్రాతపూర్వక నివేదిక ఫైల్‌చేయవలసిందిగా మిమ్ములను ఆదేశించబడినది మరియు **24.07.2024**న ఉ॥ **10:30గం.లకు** ప్రిసీడింగ్ ఆఫీసర్/ రిజిస్ట్రార్ సమక్షంలో హాజరవవలెను, విఫలం చెందిన ఏదైతే, మీ గైర్హాజరులో విచారణ జరిపి& నిర్ణయం తీసుకోబడుతుంది.
తేది: **13.06.2024**న ఈ ట్రిబ్యునల్ ముద్రవేసి నా స్వహస్తాలతో ఇవ్వబడినది.
SEAL — అధికారి సంతకం, సమ్మన్లు జారీచేసిన అధికారి.

ఫారం నం.3
(రెగ్యులేషన్-15(1)(ఎ) చూడండి)/16(3)
డెట్స్ రికవరీ ట్రిబ్యునల్ విశాఖపట్నం
గ్రౌండ్ & ఆంప్; 1వ అంతస్తు, 31-31-21, సాయిబాబా వీధి, నారాయణ్ భవన్, దాదా గార్డెన్స్, విశాఖపట్నం-530020.
కేస్ నం.: ఓ.ఎ. నం.835 ఆఫ్ 2021
డెట్ రికవరీ ట్రిబ్యునల్ (ప్రొసీజర్) రూల్స్, 1993 యొక్క రూల్ 5 యొక్క సబ్-రూల్ (2ఎ)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 19 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద సమ్మన్లు.
ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ లిమిటెడ్
...
తేది: **13.06.2024**న ఈ ట్రిబ్యునల్ ముద్రవేసి నా స్వహస్తాలతో ఇవ్వబడినది.
SEAL — అధికారి సంతకం, సమ్మన్లు జారీచేసిన అధికారి.

లాంఛనప్రాయ స్వాధీనతా ప్రకటన
ICICI Home Finance
రిజిస్టర్డు ఆఫీసు: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బంద్ర-కుర్ల కాంప్లెక్స్, బంద్ర (ఈస్ట్), ముంబయి-400051. **కార్పొరేట్ ఆఫీసు:** ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, జెబి నగర్, అంథేరి కుర్ల రోడ్, అంథేరి ఈస్ట్, ముంబయి-400059.
బ్రాంచి ఆఫీసు: సుప్రియ టవర్స్, 1వ అంతస్తు, డోర్ నం.5-37-155, 4/15 బ్రోడిపేట్, గుంటూరు, ఆం.ప్ర.-522002.
ఏదైతే, క్రింది సంతకందారు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, డిమాండ్ నోటీసులు జారీచేసి, దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలును, సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా కోరబడినది.
ఆ విధంగా మొత్తాలను తిరిగి చెల్లించుటలో విఫలం చెందియున్నందున, ఇందుమూలంగా రుణగ్రహీత మరియు సర్వజనులకు ప్రకటన ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు దిగువ పేర్కొన్న తేదీలలో సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువబడే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని, ఇందు దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనంచేసుకున్నారు.** ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సర్వజనులను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవేని లావాదేవీలు జరుపుట అనునది, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌కు చెల్లించుటకులోబడి ఉంటుంది.

క్ర సం.	రుణగ్రహీత / సహ- రుణగ్రహీత పేరు/ రుణ ఖాతా నంబరు	ఆస్తి వివరణ/ స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులోని మొత్తాలు (రూ)	బ్రాంచి పేరు
1.	షేక్ మహ్మద్ ఖాసిం (రుణగ్రహీత), షేక్ గౌసియా (సహ-రుణగ్రహీత) LHGTR00001405507.	డోర్ నం.22-5-31,పెద్ద మసీదు సెంటర్, సత్తెనపల్లి, యాక్సిస్ బ్యాంక్ దగ్గర, 188, గుంటూరు-522403, సరిహద్దులు: ఉత్తరం: షేక్ ఖయ్యూమ్ ఆస్తి 106, దక్షిణం: 106 యొక్క ప్రహారీగోడ, తూర్పు: మున్సిపల్ బాజారు 24.7, పడమర: ఖాసిం అలి & ఇతరుల ఆస్తి 24.5/ **స్వాధీనతా తేది: 26 జూన్-2024.**	26-12-2022 Rs. 16,10,331/-	గుంటూరు -బి.
2.	షేక్ మహ్మద్ ఖాసిం (రుణగ్రహీత), షేక్ గౌసియా (సహ-రుణగ్రహీత) LHGTR00001407246.	డోర్ నం.22-5-31,పెద్ద మసీదు సెంటర్, సత్తెనపల్లి, యాక్సిస్ బ్యాంక్ దగ్గర, 188, గుంటూరు-522403, సరిహద్దులు: ఉత్తరం: షేక్ ఖయ్యూమ్ ఆస్తి 106, దక్షిణం: 106 యొక్క ప్రహారీగోడ, తూర్పు: మున్సిపల్ బాజారు 24.7, పడమర: ఖాసిం అలి & ఇతరుల ఆస్తి 24.5/ **స్వాధీనతా తేది: 26 జూన్-2024.**	26-12-2022 Rs. 72,694/-	గుంటూరు -బి.
3.	అనిల్ కుమార్ అడిపె (రుణగ్రహీత), శాంతి స్వరూప రాణి అడిపె (సహ-రుణగ్రహీత) LHGTR00001439022.	ఫ్లాట్ నం.04, 3వ అంతస్తు, మా ప్లాజా గ్రూప్ హౌసింగ్, నల్లపాడు గ్రామం, గుంటూరు, 179/సి, గుంటూరు, ఆం.ప్ర.-522002 (రెఫరెన్స్ ల్యాన్ నం.ఎల్‌హెచ్‌జిటిఆర్00001439022), సరిహద్దులు: ఉత్తరం: ఉమ్మడి కారిడార్, దక్షిణం: గ్రౌండ్‌లో ఒపెన్ ఏరియా, తూర్పు: గ్రౌండ్ లో ఒపెన్ ఏరియా, పడమర: గ్రౌండ్ లో ఒపెన్ ఏరియా/ **స్వాధీనతా తేది: 27 జూన్-2024.**	18-03-2024 Rs. 30,66,741/-	గుంటూరు -బి.

పై పేర్కొనబడిన రుణగ్రహీతలు/ హామీదారులును బకాయి పడిన మొత్తాలను 30 రోజుల్లోగా, తిరిగి చెల్లించవలసిందిగా ఇందుమూలంగా కోరబడుచున్నది, లేని పిమ్మట తాకట్టుపెట్టబడిన ఆస్తులును సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8&9 క్రింది నియమాల ప్రకారం, ఈ నోటీసు ప్రచురించబడిన తేది నుండి 30 రోజులు ముగిసిన వెంటనే విక్రయించబడుతాయి.
తేది: జులై 01, 2024, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

మోడీ ఇలాకాలో పేపర్ లీకేజీల బాగోతం!

- బిజెపి మోడల్ రాష్ట్రం గుజరాత్‌లో పలు ప్రశ్నాపత్రాలు లీక్
- లక్షలాది ఉద్యోగార్థుల ఆశలు ఆవిరి

న్యూఢిల్లీ : పేపర్ లీకేజీల కారణంగా పరీక్షలు రద్దు కావడమే కాదు. లక్షలాది మంది అభ్యర్థుల ఆశలు ఆవిరవుతున్నాయి. గత ఐదేళ్ల కాలంలో పేపర్ లీకేజీలతో పదిహేను రాష్ట్రాల్లో 41 నియామక పరీక్షలు రద్దయ్యాయి. ఫలితంగా సుమారు 1.4 కోట్ల మంది ఉద్యోగార్థులు తీవ్రమైన నిరాశానిస్పృహలకు గురయ్యారు. ప్రధాని నరేంద్ర మోడీ స్వరాష్ట్రమైన గుజరాత్‌లో, బిజెపి ప్రభుత్వ ఏలుబడిలో అనేక ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి. పేపర్ లీకేజీ కుంభకోణం కారణంగా మోడీ సన్నిహితుడు, గుజరాత్ సెకండరీ సర్వీస్ సెలక్షన్ బోర్డు ఛైర్మన్ అసిత్ ఓరా తన పదవికి రాజీనామా చేశారు. పేపర్ లీకేజీ బాగోతంలో ఓ ప్రింటింగ్ ప్రెస్ ప్రమేయం ఉన్నదని వార్తలు వచ్చాయి. ఈ ప్రెస్‌లోనే గతంలో మోడీ రాసిన ఓ పుస్తకాన్ని అచ్చు వేశారు.

ఉత్తరప్రదేశ్, బీహార్‌లోనే కాదు... బిజెపి మోడల్ రాష్ట్రమైన గుజరాత్‌లోనూ పరిస్థితి దారుణంగా ఉంది. ఆ రాష్ట్రంలో జరిగిన ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో భారీ కుంభకోణాలు వెలుగు చూశాయి. నియామక పరీక్షల్లో పేపర్ లీకేజీలను అరికట్టేందుకు గత సంవత్సరం ఫిబ్రవరిలో గుజరాత్ ప్రభుత్వం శాసనసభలో ఓ బిల్లును ఆమోదించింది. రాష్ట్రంలో గత 11 సంవత్సరాల్లో 11 పేపర్ లీకేజీ కేసులు నమోదయ్యాయని, 201 మంది నిందితులపై కేసులు నమోదు చేశామని, 10 కేసుల్లో చార్జిషీటు కూడా దాఖలయ్యాయని బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా హోం మంత్రి చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో పేపర్ లీకేజీ మూలాలు బాగా వేళ్లూనుకుపోయాయని, వాటికి బిజెపి పాలనతో సంబంధం ఉన్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన పరీక్షలన్నింటినీ గుజరాత్ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (జిఎస్ఎస్ఎస్‌బి) నిర్వహిస్తుంది. అనేక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను

ప్రధాని మోడీ పాల్గొన్న సభలో పాల్గొన్న పేపర్ లీక్ అయిన ఎడ్యుటెస్ట్ సంస్థ వ్యవస్థాపకులు సురేష్ చంద్ర ఆర్య (ఫైల్)

అహ్మదాబాద్‌లోని సూర్యా ఆఫ్‌సెట్ ప్రింటింగ్ ప్రెస్‌లోనే ముద్రించారు. అక్కడి నుండే ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయి.

ప్రశ్నాపత్రాన్ని అమ్ముకున్నారు

2021లో హెడ్ క్లర్క్ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షకు సంబంధించిన పేపర్ లీక్ అయింది. ఈ ఉదంతం ప్రభుత్వాన్ని కుదిపేయడంతో గుజరాత్ సెకండరీ సర్వీస్ సెలక్షన్ బోర్డు ఛైర్మన్ అసిత్ ఓరా తన పదవికి రాజీనామా చేశారు. ఈ పరీక్షకు 88 వేల మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షకు ముందే ప్రశ్నాపత్రాన్ని లక్షలది రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపణలు రావడంతో చివరికి పరీక్షను రద్దు చేశారు. ఈ కేసులో గుజరాత్ పోలీసులు 14 వేల పేజీల చార్జిషీటును దాఖలు చేశారు. ఈ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తూనే ఉంది. సూర్య ప్రెస్‌లోనే పేపర్ లీక్ అయిందని పోలీసులు గుర్తించారు.

అవినీతిపరుడికి అందలం

2004-05లోనే సూర్య ప్రింటింగ్ ప్రెస్‌ను గుజరాత్ యూనివర్సిటీ బ్లాక్‌లిస్టులో పెట్టింది. ఈ ప్రెస్ రాష్ట్రంలోని ఐదు యూనివర్సిటీలకు పరీక్షా పత్రాలు ముద్రించి ఇస్తుంది. ప్రెస్ యజమాని ముద్రేష్ పురోహిత్‌కు ఆర్ఎస్ఎస్, బిజెపితో సంబంధాలున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. అరెస్టు నుండి తప్పించుకునేందుకు ముద్రేష్ కోర్టు నుండి ముందస్తు బెయిల్ పొందారు. ఇక జిఎస్ఎస్ఎస్‌బి ఛైర్మన్‌గా వ్యవహరించిన ఓరా పదవీకాలంలో రెండు ప్రధాన నియామక పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి. ఆయన హయాంలో పరీక్షా ఫలితాల తారుమారు సహా 61 ఆరోపణలు వచ్చాయి. అయినప్పటికీ ఆయనకు బిజెపి ప్రభుత్వం రెండోసారి అదే పదవిని కట్టబెట్టింది. అహ్మదాబాద్ మేయర్, మున్సిపాలిటీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ సహా అనేక పదవులను ఓరా బిజెపి హయాంలో నిర్వహించారు.

ప్రభుత్వ ప్రమేయంతోనే : కాంగ్రెస్

గత దశాబ్ద కాలంలో ప్రభుత్వోద్యోగాలలో నియామకాలకు సంబంధించి 14 పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని కాంగ్రెస్ ప్రతినిధి మనీష్ చెప్పారు. 2020-21, 2022-23 మధ్యకాలంలో గుజరాత్‌లో విద్యార్థుల ఆత్మహత్యలు 21 శాతం పెరిగాయి. పరీక్షా పత్రాల లీకేజీలు కూడా ఆత్మహత్యలకు కారణమయ్యాయి. ప్రభుత్వ ప్రమేయం లేకుండా పేపర్ లీకేజీ ఎలా జరుగుతాయని మనీష్ ప్రశ్నించారు. రాష్ట్రంలో పేపర్ లీకేజీలు వ్యవస్థీకృత నేరంగా మారాయని మండిపడ్డారు. ఉద్యోగ ప్రకటన వెలువడిన వెంటనే రేటు నిర్ణయిస్తారని, లక్షలది రూపాయలకు ప్రశ్నాపత్రాన్ని అమ్ముకుంటారని తెలిపారు.

బ్లాక్ లిస్ట్‌లో అహ్మదాబాద్ సంస్థ
యుపి కానిస్టేబుల్ పేపర్ లీక్‌తో ఎట్టకేలకు చర్య

ఉత్తర ప్రదేశ్ పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ పరీక్షలో పేపర్ లీక్ అయిన నేపథ్యంలో గత వారం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అహ్మదాబాద్‌కు చెందిన ఎడ్యుటెస్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను బ్లాక్ లిస్ట్ చేసింది. ఈ కంపెనీ దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో పేపర్ లీకేజీలు, రిక్రూట్‌మెంట్ స్కామ్‌లకు పాల్పడినట్లు వైరల్ సంస్థ దర్యాప్తుల్లో వెల్లడైంది. దీని వ్యవస్థాపకుడు-డైరెక్టర్, సురేశ్‌చంద్ర ఆర్య, సర్వదేశక్ ఆర్యప్రతినిధి సభకు అధ్యక్షుడు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సహా పలువురు బిజెపి ప్రముఖ నాయకులు సభ నిర్వహించే కార్యక్రమాలకు హాజరయ్యారు. ఇప్పటికే చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కంపెనీని బ్లాక్ లిస్టులో పెట్టాయి. సురేష్‌చంద్ర కుమారుడు, ఎడ్యుటెస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ ఆర్య 2017లో జైలు పాలయ్యాడు. అయినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, అనేక రాష్ట్రాల బిజెపి ప్రభుత్వాలు ఈ కంపెనీకి పరీక్ష నిర్వహణ కోసం కాంట్రాక్టులను మంజూరు చేస్తూనే ఉన్నాయి. ఫిబ్రవరి 17, 18 తేదీల్లో 63,244 కానిస్టేబుల్ పోస్టుల నియామక పరీక్ష పేపర్ లీక్ కావడంతో, ఎడ్యుటెస్ట్ సంస్థను జూన్ 20న యుపి ప్రభుత్వం బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. 43 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు, దేశం నలుమూలల నుంచి అభ్యర్థులు యుపి రాజధాని లక్నోకు చేరుకుని రెండ్రోజుల పాటు నిరసనలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే యోగి సర్కారు ఈ చర్యకు దిగింది.

నావికుడు మృతిపై భారత దౌత్యవేత్తకు శ్రీలంక సమన్లు

కొలంబో : తమ నావికాదళ ఉద్యోగి మరణించిన ఘటనపై భారత దౌత్యవేత్తకు శ్రీలంక ప్రభుత్వం సమన్లు జారీ చేసింది. శుక్రవారం విదేశాంగశాఖ కార్యాలయానికి భారత దౌత్యవేత్తను పిలిపించుకుంది. తమ దేశ జలాల్లో అక్రమంగా, విచక్షణారహితంగా చేపల వేటకు పాల్పడటం, దాడులు చేయడం తదితర అంశాలపై శ్రీలంక ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసిందని కొలంబోకు చెందిన సండే టైమ్స్ వార్తాపత్రిక పేర్కొంది. జూన్ 25న జాఫ్నా ద్వీపకల్పంలోని కంకేసంతురై వద్ద భారతీయ జాలర్లు, నౌకపై శ్రీలంక ఆపరేషన్ నిర్వహించింది. ఈ ఆపరేషన్‌లో శ్రీలంకకు నావికా దళానికి చెందిన ఒకరు మరణించారు. నాగపట్టణకు చెందిన ఏడుగురు, కడలూరుకు చెందిన ఒకర్ని, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మరో ఇద్దర్ని చేపల వేట అక్రమంగా సాగిస్తున్నారనే ఆరోపణలతో శ్రీలంక సైన్యం అరెస్టు చేసింది. భారత జాలర్ల ఫిషింగ్ ట్రాలర్‌ను స్వాధీనం చేసుకుంది. భారత జాలర్ల దూకుడు ప్రవర్తన వల్లే తమ నావికుడు మరణించాడని శ్రీలంక ఆరోపిస్తుంది. ఇదే రోజున న్యూఢిల్లీలోని శ్రీలంక హైకమిషనర్ క్షేణుక సెనెవిరత్న భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌తో భేటీ అయ్యి, ఇదే విషయాన్ని ప్రస్తావించినట్లు కూడా పత్రిక తెలిపింది. తాజా పరిణామం పాక్ జలసంధిలో ఇరు దేశాల జాలర్ల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంఘర్షణను వెలుగులోకి తీసుకొచ్చింది.

అమరావతి రాజధాని కనెక్టివిటీ కోసం సీడ్ యాక్సెస్ రోడ్డు విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 30 ఎకరాలు రైతుల నుండి తీసుకోవాల్సి ఉంది. అయితే ఎకరాకు ఎంత పరిహారం ఇస్తారనే అంశంపై సమస్య పెండింగ్‌లో ఉంది. ఏ పాయింట్ ఎంత భూమి కావాల్సి వస్తుందో మార్కింగు చేస్తే దాని ఆధారంగా పరిహారం అంశం పరిష్కరించుకోవచ్చని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు. 2021లోనూ ఈ రోడ్డు విస్తరణ అంశంపై చర్చ జరిగింది. 15.6 కిలోమీటర్ల రోడ్డును విస్తరించేందుకు రూ.150 కోట్లతో మేఘా కంపెనీకి పనులు అప్పగించారు. భూములకు నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. రైతులు కోర్టుకు వెళ్లడంతో పనులు ఆగిపోయాయి.

200 అడుగుల రోడ్డు

ప్రస్తుతం వెంకటపాలెం సరిహద్దు వద్ద ఆగిపోయిన సీడ్ యాక్సెస్ రోడ్డును మూడు దశల్లో విస్తరించనున్నారు. తొలిదశలో వెంకటపాలెం రెవెన్యూ నుండి ప్రకాశం బ్యారేజీ సమీపంలోని పాత జాతీయ రహదారి వరకూ విస్తరిస్తారు. దీనికి సంబంధించిన భూ సమీకరణ ప్రక్రియ మొదలుపెట్టి తొలివిడతలో రైతులతో సమావేశం నిర్వహించారు. రెండోదశలో పిడబ్ల్యుడి వర్కుషాపు నుండి 1.8 కిలోమీటర్ల దూరం ఫ్లైఓవర్ పద్ధతిలో రోడ్డు నిర్మిస్తారు. మూడోదశలో 4.8 కిలోమీటర్ల పొడవైన రోడ్డును మణిపాల్ వరకూ నిర్మించి అక్కడ జాతీయ రహదారికి లింకు ఏర్పాటు చేయనున్నారు. ప్రకాశం బ్యారేజీ వరకూ రోడ్డు వేసినా ట్రాఫిక్ సమస్యకు పెద్దగా పరిష్కారం దొరకదని, జాతీయ రహదారికి అనుసంధానం చేస్తేనే పరిష్కారమవుతుందని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు.

అమూల్ సంకటం!

(మొదటి పేజీ తరువాయి)

మార్కెటింగ్ ఫెడరేషన్ (జిసిఎంఎంఎఫ్-అమూల్) సహకార రంగంలోనిదైనప్పటికీ ఆ రాష్ట్రానికి పరిమితం కాకుండా కార్పొరేట్ సంస్థ వలే మార్చేందుకు మోడీ సర్కారు ప్రయత్నిస్తోంది. సహకార రంగం అనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం కాగా కేంద్రం సహకార వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తోంది. అందుకే హోంమంత్రి అమిత్‌షాకు కేంద్రంలో సహకార శాఖను మోడీ సర్కారు అప్పగించింది. మల్టీ స్టేట్ కో-ఆపరేటివ్స్ చట్టాన్ని ముందుకు తెచ్చి అన్ని రాష్ట్రాల్లోనూ వ్యాపారం చేసుకునేందుకు మార్గం వేసింది. దక్షిణాదిలోని కర్ణాటక, తమిళనాడుకు అమూల్‌ను విస్తరించేందుకు ప్రయత్నాలు చేయగా అక్కడి ప్రజలు, ప్రభుత్వాలు ప్రతిఘటించాయి. మన రాష్ట్రంలో మాత్రం గత వైసిపి సర్కారు, మోడీ, అమిత్‌షా ఒత్తిళ్లతో అమూల్‌కు సాదరంగా

స్వాగతం పలికింది. అయితే నాడు జగన్ సర్కారును దుయ్యబట్టిన టిడిపి, ప్రస్తుతం అధికారంలోకి వచ్చాక అమూల్‌పై ఆచితూచి అడుగులేస్తోంది. ఎన్‌డిఎలో ఉన్నందున అమూల్ జోలికెళితే మోడీకి, అమిత్‌షాకు కోపం వస్తుందని ఆలోచిస్తోంది. కాగా, చంద్రబాబుకు చెందిన హెరిటేజ్, మరికొందరు టిడిపి నాయకుల చేతుల్లో ఉన్న సహకార, ప్రైవేటు డెయిరీలను దెబ్బ కొట్టేందుకు జగన్ ప్రభుత్వం వ్యూహాత్మకంగా అమూల్‌ను తీసుకొచ్చిందన్న అభిప్రాయం టిడిపి నేతల్లో బలంగా ఉంది. తమ వ్యాపారాలను, ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు అమూల్‌ను జగన్ అస్త్రంగా వాడుకున్నారని, అధికారంలోకి వచ్చాం కనుక అమూల్‌పై కఠినంగా వ్యవహరించాలన్నది పలువురు టిడిపి నేతల మాట. తమకు అండగా నిలబడిన నాయకుల, సానుభూతిపరుల డిమాండ్ ఒకవైపు, రాజకీయంగా బిజెపితో ఉన్న పొత్తు సంబంధాలు మరోవైపు అమూల్ విషయంలో అడుగు ముందుకేయలేని సంకట పరిస్థితిని టిడిపికి కల్పించాయని తెలుస్తోంది.

మూకదాడి మృతునిపైనే ఎదురు కేసు

(మొదటి పేజీ తరువాయి)

ముస్లింలు కూడా ఆందోళన చేశారు. హత్య కేసులో నిందితుల్ని వదలవద్దని డిమాండ్ చేశారు. దీంతో కొన్ని రోజుల నుంచి ఇక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది.

ఈ నేపథ్యంలో మృతుడు ఔరంగజేబ్‌పై శనివారం లక్ష్మీరాణి మిట్టల్ ఫిర్యాదుతో ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఔరంగజేబ్, అతని సోదరుడు, మరో ఐదుగురిపై అలీగఢ్‌లోని గాంధీ పార్క్ పోలీస్‌స్టేషన్‌లో దోపిడీ, మహిళపై వేధింపుల కేసు నమోదైంది. మిట్టల్ కుటుంబం గ్రౌండ్ ఫ్లోర్లో దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తూ.. రెండో అంతస్తులో నివాసం ఉంటోంది. మిట్టల్ ఫిర్యాదు ప్రకారం జూన్ 18వ తేదీ రాత్రి ఔరంగజేబ్, ఇతరులు నాటు తుపాకీ, కత్తులతో ఆమె ఇంట్లో ప్రవేశించారు. తుపాకీతో బెదిరించి తాను ధరించిన బంగారు హారాన్ని చోరీ చేశారని, ఈ సమయంలో తనతో అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపించారు. ఆ సమయంలో తన భర్త, పిల్లలు వేరే గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారని, మామగారు గుడికి వెళ్లినట్లు చెప్పింది. తరువాత తనను వేరే గదిలోకి తీసుకెళ్లి అక్కడ అల్మారాలో ఉంచిన రూ. 2.5 లక్షల నగదు, కొన్ని బంగారు, వెండి నగలు ఇవ్వాలని తుపాకీతో బెదిరించారని తెలిపారు. దీంతో తాను వారికి వాటిని అప్పగించినట్లు తెలిపింది. ఇంతలో బయట నుంచి శబ్దాలు వినపడటంతో దుండగలు పారిపోయారని తెలిపింది. ఈ క్రమంలోనే ఔరంగజేబ్ మెట్లపై నుంచి జారిపడిపోయాడని, తలకు, ఇతర చోట్ల గాయాలయ్యాయని తెలిపింది. తాను సహాయం కోసం కేకలు వేశానని, ఇది విని వచ్చిన కొందరు స్థానికులు ఔరంగజేబ్‌ను పట్టుకున్నారని చెప్పారు. ఔరంగజేబు తన సోదరుడు మహ్మద్ జాకీ, సల్మాన్, అకర్బర్, నవాబ్, షమీమ్, అషు పాన్ వాలే కా లడ్కా పేరు వెల్లడించాడని మహిళ తెలిపింది. ఎఫ్ఐఆర్‌లో వీరి పేర్లే నమోదు చేశారు. గుడి నుంచి తిరిగి వచ్చిన తరువాత తన మామగారు పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి ఔరంగజేబ్‌ను తీసుకెళ్లారని చెప్పారు. ఇన్ని రోజులు ఆలస్యంగా మహిళ ఫిర్యాదు చేయడంపై పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఔరంగజేబ్ సోదరుడు జాకీ ఫిర్యాదుతో 10 మంది హిందువులు, గుర్తుతెలియని మరో 12 మందిపై హత్య, చట్టవిరుద్ధంగా గుమిగూడడం, మారణాయుధాలతో అల్లర్లకు పాల్పడటం, అక్రమంగా నిర్బంధించడం, నేరాలకు పాల్పడటం వంటి అభియోగాలతో కేసు నమోదు చేశారు. అలీగఢ్‌లో ఒక క్రాసింగ్ వద్ద ఔరంగజేబ్‌ను కొంతమంది చుట్టుముట్టి లాఠీలతో కొట్టడం, కాళ్లతో తన్నడం, పిడిగుద్దులు గుద్దడం వంటి దృశ్యాలు ఉన్న వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయినా పోలీసులు ఇప్పటి వరకూ నలుగురినే అరెస్టు చేశారు.

మహారాష్ట్ర ఎన్నికల్లో కలిసి పోటీచేస్తాం : శరద్‌పవార్

పూణె : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి (ఎస్‌పి) కలిసి పోటీ చేస్తాయని శరద్ పవార్ పేర్కొన్నారు. ఈ ఏడాది అక్టోబర్ - నవంబర్‌లో మహారాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఆదివారం పూణెలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్, ఉద్ధవ్ థాకరే శివసేనతో కలిసి పోటీచేస్తామని చెప్పారు. సీట్ల కేటాయింపుపై త్వరలో చర్చిస్తామని, మూడు నెలల సమయం ఉందని చెప్పారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో సంకీర్ణంలో భాగమైన చిన్న మిత్రపక్షాల ప్రయోజనాలను రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పరిరక్షించడం మహారాష్ట్రలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీల నైతిక బాధ్యత అని అన్నారు. రాష్ట్రంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని, దానిని అమలు చేయడం ప్రతిపక్ష కూటమి నైతిక బాధ్యతని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షాలు సమిష్టిగా ఉంటాయని తెలిపారు. వామపక్షాలు, పీసెంట్స్ అండ్ వర్కర్స్ (పిడబ్ల్యుపి) సంకీర్ణంలో భాగమైనప్పటికీ.. లోక్‌సభ ఎన్నికల్లో సీట్లు ఇవ్వలేకపోయామని, ఈ ఎన్నికల్లో వారితో కలిసి ముందుకు వెళ్లడం తమ నైతిక బాధ్యతని చెప్పారు.

దక్షిణ కొరియా, జపాన్, అమెరికా సంయుక్త విన్యాసాలకు ఉత్తరకొరియా ఖండన

ప్యోంగ్యాంగ్ : దక్షిణ కొరియా, జపాన్, అమెరికా సంయుక్త సైనిక విన్యాసాలను ఉత్తర కొరియా ఆదివారం ఖండించింది. వాటిని నాటో ఆసియా వెర్షన్ అని అభివర్ణించింది. అవి "ప్రమాదకరమైన పరిణామాలు"కు దారితీస్తాయని హెచ్చరించింది. వార్షిక కసరత్తులు నిర్వహించాలని గత ఏడాది త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశంలో అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. డెమొక్రటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా (డిపిఆర్‌కె)కు వ్యతిరేకంగా సైనిక విన్యాసాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఉత్తరకొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనలో పేర్కొంది.

'పోలవరం' కాఫర్ డ్యామ్‌లపై అణువణువూ పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

వీరు అధికారులు, ప్రాజెక్టుకు సంబంధించిన నిపుణులతో చర్చించనున్నారు. దీనిలో పోలవరం ప్రాజెక్టు అథారిటీ ముఖ్యులు, కేంద్ర జలసంఘం నిపుణులు, సిఎస్ఎంఆర్ఎస్ సంస్థ ప్రతినిధులు, వ్యాప్కోస్, బావర్, కెల్లర్, మేఘా కంపెనీ ప్రతినిధులు, అంతర్జాతీయ డిజైన్ సంస్థ ఆఫ్రే ప్రతినిధులు పాల్గొంటారు. ఆ తర్వాత నైపుణ్య ఏజెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయ బృందం చర్చించనుంది. ఈ పర్యటనలో పోలవరం ప్రాజెక్టు సిఇ నరసింహమూర్తి, ఇఇ మల్లికార్జునరావు, ప్రాజెక్టు గౌరవ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, సిడబ్ల్యుసి డిప్యూటీ డైరెక్టర్ అశ్విన్‌కుమార్ ఉన్నారు.

నూతన ఆర్మీచీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది

(మొదటి పేజీ తరువాయి)

30న ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన మనోజ్ పాండే ఈ ఏడాది మే 30న పదవి విరమణ చేయాల్సి వుంది. కొత్త చీఫ్ నియామకంలో జాప్యం కారణంగా కేంద్రం ఆయన సర్వీసును నెలరోజుల పాటు పొడిగించింది. జూన్ 11న వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ద్వివేదిని నూతన చీఫ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

నూతన నియామకాలు

వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, సెంట్రల్ ఆర్మీ కమాండర్‌గా లెఫ్టినెంట్ జనరల్ అనింద్యసేన్‌గుప్తా, సౌత్ ఆర్మీ కమాండర్‌గా లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేత్, సౌత్‌వెస్ట్ ఆర్మీ కమాండర్‌గా లెఫ్టినెంట్ జనరల్ మంజీందర్‌సింగ్ నియమితులయ్యారు.

అసోంలో మార్క్‌షీట్ స్కామ్

- గౌహతి వర్శిటీలో ముగ్గురు ప్రభుత్వ అధికారులుసహా పదిమంది అరెస్టు

న్యూఢిల్లీ : నీట్ స్కామ్ మరువక ముందే అస్సాంలోని బిజెపి ప్రభుత్వ హయాంలో మరో స్కాం వెలుగుచూసింది. గౌహతి యూనివర్సిటీలో విద్యార్థుల పరీక్ష పేపర్లలో మార్కులను మార్పు చేసి, ఎక్కువ మార్కులు నమోదు చేస్తూ.. పెద్దమొత్తంలో నగదు గుంజుతున్నారని వెల్లడైంది. ఒక పేపరులో మార్కులు పెంచడానికి రూ.16 వేలు, ఒక సెమిస్టర్‌లోని అన్ని పేపర్లలో మార్కులు మార్పు చేసేందుకు లక్ష రూపాయలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు తెలిపారు. ఈ స్కామ్‌లో ఇప్పటివరకూ ముగ్గురు ప్రభుత్వ ఉద్యోగులు సహా పదిమందిని అరెస్టు చేసినట్లు సిఐడి, అస్సాం పోలీసులు ఆదివారం తెలిపారు. యూనివర్శిటీలోని వివిధ విభాగాలకు చెందిన కొందరు ఉద్యోగులు ఈ మోసాలకు పాల్పడుతున్నారని విద్యార్థులు చెప్పారు. యూనివర్శిటీలో ఏజెంట్లను పెట్టారని, వారు విద్యార్థులతో మాట్లాడతారని, ఎక్కువ మార్కులకు ఎక్కువ ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారని వివరించారు. బార్‌పేటలో ఆరు కేసులు వెలుగు చూశాయని, అదే ప్రాంతానికి చెందిన కృష్ణమూర్తి ప్రధాన నిందితుడిని, అతనిని అరెస్టు చేశామని పోలీసులు చెప్పారు. గౌహతి విశ్వవిద్యాలయం ఇంటిగ్రేటెడ్ యూనివర్శిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఐయుఎంఎస్)ని థర్డ్‌పార్టీకి ఆపరేటర్‌కి అవుట్ సోర్స్ కింద ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఐటిఐ లిమిటెడ్ అనేది డేటా ఎంట్రీ బాధ్యత వహించే కేంద్ర ప్రభుత్వ సంస్థ అని, ట్యాంపరింగ్ జరిగినట్లు ఆ వర్గాలు తెలిపాయి. తాజాగా అరెస్టు చేసిన పదో నిందితుడు అడ్వకేట్ అని, అతనిని ఇంటరాగేట్ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నీట్-యుజి పేపర్ లీక్ కేసులో గోద్రా ప్రైవేట్ స్కూల్ ఓనర్ అరెస్టు

అహ్మదాబాద్ : నీట్-యుజి పేపర్ లీక్ కేసులో గోద్రాలోని ఒక ప్రైవేట్ స్కూల్ యజమానిని సిబిఐ ఆదివారం ఉదయం అరెస్టు చేసింది. గోద్రాలోని నివాసంలో దీక్షిత్ పటేల్‌ను అరెస్టు చేసిన సిబిఐ అనంతరం అహ్మదాబాద్‌లోని కోర్టుకు తరలించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాకేష్ ఠాకూర్ మీడియా వెల్లడించారు. గోద్రాలోని మిస్టర్ పటేల్స్ జయ్ జలరామ్ స్కూల్‌కు దీక్షిత్ పటేల్ యాజమాని. మే 5న నిర్వహించిన నీట్ యుజి పరీక్షా కేంద్రాల్లో ఈ స్కూల్ కూడా ఒకటి. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలు, అవకతవకలతో ఈ పాఠశాలకు కూడా సంబంధం ఉందని ఆరోపణలు ఉన్నాయి. నీట్ పేపర్ లీక్ కేసులో సిబిఐ అరెస్టు చేసిన ఆరో నిందితుడు దీక్షిత్ పటేల్.కొంత మంది అభ్యర్థుల నుంచి నిందితులు రూ 10 లక్షల వరకూ వసూలు చేశారని ప్రాథమిక దర్యాప్తులో సిబిఐ గుర్తించింది.

బ్రిటన్ ఎన్నికల్లో లేబర్ పార్టీకే ఎక్కువ అవకాశాలు

- ఇస్లింగ్టన్ నుంచి ఇండిపెండెంట్‌గా జెరిమి కార్బిన్

లండన్ : మరో మూడు రోజుల్లో జరగనున్న బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో పద్నాలుగేళ్ల టోరీల (కన్సర్వేటివ్స్) పాలనకు తెరపడనుందని, ప్రతిపక్ష లేబర్ పార్టీకి విజయావకాశాలు మెండుగా ఉన్నాయని పలు సర్వేలు వెల్లడించాయి.. కన్సర్వేటివ్ పార్టీకన్నా లేబర్ పార్టీ 20 శాతం ఓట్ల ఆధిక్యం కలిగివుందని మెజార్టీ ఒపీనియన్ పోల్స్ అభిప్రాయపడుతున్నాయి. రిషి సునాక్ నేతృత్వంలో కన్సర్వేటివ్ పార్టీ ఘోర పరాజయం పాలవడం తథ్యమనే భావన ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే సర్వత్రా నెలకొంది. కన్సర్వేటివ్ ప్రభుత్వం సంక్షేమంపై కోతలు, కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజలపై సంక్షోభ భారాలను మోపడం, కార్పొరేట్లకు భారీ రాయితీలు కల్పించడం వంటి చర్యలతో ఆ పార్టీ ప్రజల్లో భ్రష్టు పట్టిపోయిందని రాజకీయ వ్యాఖ్యాతలు పేర్కొంటున్నారు. కన్సర్వేటివ్ పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను కీర్ స్టార్మర్ నేతృత్వంలోని లేబర్ పార్టీ

పూర్తిగా సొమ్ము చేసుకోగలిగే స్థితి లేదు. దీనికి కారణం స్టార్మర్ ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల ముందుంచడంలో తటపటాయిస్తున్నాడు. లేబర్ పార్టీ మౌలిక లక్ష్యాల కోసం గట్టిగా నిలబడాలని వాదించిన వామపక్షవాది జెరిమి కార్బిన్‌ను, ఆయన అనుచరులను పార్టీ నాయకత్వ స్థానం నుంచే కాకుండా, ఏకంగా పార్టీ నుంచే బహిష్కరించారు. ఇజ్రాయిల్ గాజాలో సాగిస్తున్న దారుణ మారణ కాండను ఖండించడానికి లేదా పాలస్తీనీయులకు సంఘీభావంగా నిలవడానికి స్టార్మర్ సిద్ధం కాలేదు. ఇజ్రాయిల్ దాష్టీకాలకు వ్యతిరేకంగా బ్రిటన్ ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆగ్రహాన్ని గమనించకుండా టోరీల బాటలోనే ఆయన కూడా నడవడం పలు విమర్శలకు దారి తీసింది. బ్రిటన్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న వామపక్ష వాది 75ఏళ్ల జెరిమి కార్బిన్ ఈ ఎన్నికల్లో ఇస్లింగ్టన్ నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన బ్రిటన్ పార్లమెంటుకు 1983 నుంచి ఇప్పటివరకు వరుసగా ఎన్నికవుతూ వస్తున్నారు. లేబర్ పార్టీ నాయకుడిగా, పార్లమెంటులో ప్రతిపక్ష నేతగా 2015-2020 మధ్య పనిచేశారు. ఆయన ఎంతకాలం పని చేయాలనుకుంటే అంతకాలం ఆయనను ఎంపీగా ఎన్నుకుంటామని ఇస్లింగ్టన్ ఓటర్లు బాహాటంగానే చెబుతున్నారు. ఈ ఎన్నికల్లో కలవరపరిచే అంశమేమిటంటే పచ్చి మితవాద రిఫార్మ్ పార్టీ వేగంగా ముందుకురావడం. ఆ పార్టీ ఎన్నికల ప్రకటన నాటికి 10 శాతం ఓట్లు వస్తాయని ఒక అంచనా. ఎన్నికల పోలింగ్ తేదీ సమీపించే కొద్దీ దాని దూకుడు పెరుగుతూ వస్తోంది. ఇప్పుడు ఆ పార్టీకి 15-20 శాతం ఓట్లు రావచ్చని కొన్ని సర్వేలు చెబుతున్నాయి.

ఫ్రాన్స్ ఎన్నికలు
మొదటి రౌండ్‌లో 69శాతం పోలింగ్

పారిస్: ఆదివారం జరిగిన ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల మొదటి రౌండ్ పోలింగ్‌లో 69 శాతం దాకా ఓట్లు పోలయ్యాయి. 2022 ఎన్నికలతో పోల్చితే ఓటింగ్ శాతం 20శాతానికి పైగా పెరిగింది. రెండో రౌండ్ పోలింగ్ ఈ నెల7న జరగనుంది. యూరోపియన్ యూనియన్ పార్లమెంటు ఎన్నికల్లో అధ్యక్షుడు మాక్రాన్ నేతృత్వంలోని రినైజాన్స్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగలడం, మేరీ లీపెన్ నాయకత్వంలోని పచ్చి మితవాద పార్టీ నేషనల్ ర్యాలీ (ఆర్ఎన్) బాగా పుంజుకోవడంతో మాక్రాన్ పార్లమెంటును రద్దు చేసి ఆకస్మిక ఎన్నికలను ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీల ఆక్రమణ తరువాత మొదటి సారి ఫ్రాన్స్‌లో పచ్చి మితవాద పార్టీ అధికారాన్ని చేజిక్కించుకునే స్థాయికి ఎదిగింది. దీనిని సవాల్ చేస్తూ ఫ్రాన్స్‌లోని వామపక్ష, ప్రగతిశీల, ప్రజాతంత్ర శక్తులన్నీ కలసి న్యూ పాపులర్ ఫ్రంట్ గా ఏర్పడ్డాయి. ఇటీవల బ్రహ్మాండమైన ర్యాలీ కూడా నిర్వహించాయి. మొదటి రౌండ్‌లో పోలింగ్ శాతం పెరగడానికి 'ఫ్రాన్స్ భవిష్యత్తు ' గురించి ఆందోళన చెందుతున్న సెక్షన్ల ప్రజలు ఇంట్లో నుంచి పెద్ద సంఖ్యలో బయటకు రావడమే కారణమని ఎన్నికల విశ్లేషకులు పేర్కొంటున్నారు. మేరీ లీపెన్స్ విజయం అంత తేలికేమీ కాదని, పాపులర్ ఫ్రంట్ నుంచి అది గట్టి సవాల్ ఎదుర్కొంటుందని వారు అభిప్రాయపడుతున్నారు.

విమానయాన సిబ్బంది సమ్మెతో 400కుపైగా వెస్ట్‌జెట్ సర్వీసులు రద్దు

టొరంటో : మెకానిక్స్ యూనియన్ సమ్మెతో కెనడాలోని ప్రముఖ విమానయాన సంస్థ వెస్ట్‌జెట్ 407 విమాన సర్వీసులు రద్దు చేసింది. ఈ సర్వీసుల రద్దు సుమారు 50 వేల మంది ప్రయాణికులపై ప్రభావం చూపింది. తమ సమస్యలపై కనీసం చర్చలకు కూడా యాజమాన్యం ఇష్టపడకపోవడంతో వెస్ట్‌జెట్‌కు చెందిన మెయింటెనెన్స్ వర్కర్స్ యూనియన్ శుక్రవారం రాత్రి నుంచి సమ్మె ప్రారంభించింది. దీంతో వెస్ట్‌జెట్ తన సర్వీసులను రద్దు చేసుకోవాల్సి వచ్చింది. వెస్ట్‌జెట్‌కు కెనడాలో రెండో అతిపెద్ద విమానయాన సంస్థగా గుర్తింపు ఉంది. వెస్ట్‌జెట్‌కు సుమారు 200 విమానాలు ఉన్నాయి. సమ్మెతో దేశీయ, అంతర్జాతీయ సర్వీసులను వెస్ట్‌జెట్ రద్దు చేసింది. ఆదివారం సాయంత్రం నుంచి 30 సర్వీసులను పునరుద్ధరిస్తామని తెలిపింది. వేతన చెల్లింపులతోపాటు, కెనడా మంత్రివర్గం జారీ చేసిన

కెనడాలోని వాంకోవర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఆందోళన చేస్తున్న ఎయిర్‌లైన్స్ ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది

బైండింగ్ ఆర్బిట్రేషన్‌పై సమ్మె చేపట్టినట్లు మెకానిక్స్ యూనియన్ తెలిపింది. యూనియన్ నాయకులు మాట్లాడుతూ గౌరవ ప్రదమైన చర్చల కోసం సమ్మె చేయాల్సి వచ్చిందని చెప్పారు.

లిథియం నిల్వలపై కన్నేసిన అమెరికా

బొలీవియాలో కుట్రలకు ఇదే కారణమా?

లాపాజ్: బొలీవియాలో పెద్దయెత్తున ఉన్న లిథియం నిల్వలపై అమెరికా కన్నేసింది. తెల్ల బంగారంగా పిలువబడే ఈ ఖనిజ నిక్షేపాలను అమెరికన్ బడా కంపెనీలు వశపరచుకోడానికి అడ్డంకిగా ఉన్న వామపక్ష అనుకూల ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి పథక రచన చేసింది. ఆ కుట్రలో భాగమే గత వారం విఫలమైన సైనిక కుట్ర అని అధ్యక్షుడు ఆర్సె తెలిపారు. ఈ కుట్ర విఫలం కావడంతో డీలా పడిన పాశ్చాత్య దేశాల మీడియా బాకాల సాయంతో ఇక్కడి ప్రతిపక్షాలు దీనిని 'స్వీయ తిరుగుబాటు' అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అసోసియేటెడ్ ప్రెస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆర్సె తెలిపారు. తిరుగుబాటుకు యత్నించిన మాజీ ఆర్మీ జనరల్ జువాన జోస్ జునైగా, నేవీ అధిపతి జువాన్ ఆర్నెజ్. ఆర్మీ మెకనైజ్డ్ బ్రిగేడ్ మాజీ అధిపతి అలెగ్జాండ్రో ఐరాహొలాతో సహా 21 మందిని అరెస్టుచేసి కోర్టు ఎదుట హాజరు పరచగా ఆరు నెలలపాటు వారికి రిమాండ్ విధించారు. వారు అధికారాన్ని చేజిక్కించుకోవడానికి ఒక పథకం ప్రకారమే దాడికి దిగారని ఆర్సె తెలిపారు. లిథియం మైనింగ్, పారిశ్రామికీకరణ కోసం ప్రభుత్వం పెద్దయెత్తున పెట్టుబడులు పెట్టడం అమెరికాకు గిట్టడం లేదని, అందుకే అది ఈకుట్రను ప్రోత్సహించిందని అన్నారు. 2019లో కూడా మొరెల్స్ ప్రభుత్వాన్ని సైనిక కుట్ర ద్వారా కూల్చివేశారు.

సైనిక తిరుగుబాటును తిప్పికొట్టిన అనంతరం లాపాజ్‌లోని మురిలో ప్లాజా వద్ద పెద్దయెత్తున గుమికూడిన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న బొలీవియా అధ్యక్షుడు లూయిస్ ఆర్సె, ఇతర నేతలు

మీకోసం

రసం పిండిన నిమ్మ చెక్కలతో కత్తులు, కత్తిపీటలు రుద్దితే వాటికి అంటుకున్న ఉల్లిపాయ వాసన పోతుంది.

జీవన సౌరభం

ప్రయత్నాలను, పోరాటాలను.. పిరికివాళ్లు మొదలుపెట్టరు, బలహీనులు పూర్తిచేయరు, విజేతలు విడిచిపెట్టరు.

చంద్రయ్యకు గుణపాఠం



కృష్ణాపురంలో ఉండే రామయ్య పచారి కొట్టు నడుపుతున్నాడు. అతను అందరితో స్నేహంగా ఉంటాడు. ఉన్న దాంట్లో సహాయపడతాడు. అదే ఊర్లో ఉండే చంద్రయ్యకు రామయ్య అంటే గిట్టదు. ఒక రోజు అతడు రామయ్య పచారి కొట్టులో బియ్యం కొని తీసుకెళ్ళాడు. ఆ రోజు సాయంత్రం జమీందారు వద్దకు వెళ్లి 'రామయ్య బియ్యంలో రాళ్లు కలిపి అమ్ముతున్నాడు. ఈ రోజు ఉదయం అతను అమ్మిన బియ్యం వండుకుని తిన్నాము. ఆ రాళ్ల వల్ల నా నోటి పన్ను విరిగి పోయింది' అని చెప్పాడు.

జమీందారు రామయ్యను పిలిపించి, అడిగాడు. 'అయ్యా, నేను మంచి బియ్యమే అమ్ముతున్నాను. కావాలంటే తనిఖీ చేయించండి.' అన్నాడు రామయ్య. 'నీ వల్ల చంద్రయ్య పన్ను విరిగిపోయింది. ఇందుకు గాను నీవు అతనికి వెయ్యి రూపాయలు పరిహారంగా ఇవ్వాలి' అన్నాడు జమీందారు. 'అలాగే అయ్య గారు' అని చంద్రయ్యకు వెయ్యి రూపాయలు పరిహారంగా ఇచ్చాడు రామయ్య.

కొన్ని రోజుల తరువాత చంద్రయ్య వద్ద పని చేసే మేకల కాపరి మేకలను తోలుకుంటూ రామయ్య కొట్టు ముందు నుంచి వెళుతుండగా అందులోని ఒక మేక నాలుగు అరటి పండ్లు తినేసింది. రామయ్య ఆ మేకను పట్టుకుని జమీందారు వద్దకు తీసుకెళ్లి విషయం చెప్పాడు.

జమీందారు పిలుపుతో చంద్రయ్య వచ్చి విషయం తెలుసుకున్నాడు. 'చూడు చంద్రయ్యా! నీవు రామయ్యకు రెండు వేల రూపాయలు పరిహారంగా ఇవ్వాలి' అన్నాడు జమీందారు. 'అయ్యగారూ! నాలుగు అరటి పండ్లు తిన్నందుకు రెండు వేలు పరిహారంగా ఇవ్వమనడం న్యాయబద్ధంగా లేదు' అన్నాడు చంద్రయ్య. 'ఏదైనా తప్పు తప్పే!' అన్నాడు జమీందారు.

'అయ్యగారూ! నోరు ఉండి అబద్దాలు చెప్పే మనుషుల కన్నా నోరు లేని జంతువు చేసిన తప్పును క్షమించవచ్చు. నాకు పరిహారం అక్కరలేదు' అన్నాడు రామయ్య. 'చంద్రయ్యా! చూశావా రామయ్య మంచితనం' అన్నాడు జమీందారు. 'క్షమించండి అయ్య గారూ! నేను గతంలో అబద్ధం చెప్పి, రామయ్య నుంచి పరిహారంగా తీసుకున్నాను' అని ఆ డబ్బును రామయ్యకు తిరిగి ఇచ్చేశాడు చంద్రయ్య.

అటు పిమ్మట చంద్రయ్య ప్రతి ఒక్కరితో మంచిగా ఉండసాగాడు.

- యు.విజయశేఖర రెడ్డి,
99597 36475.

నేను గీసిన బొమ్మ

వి. అశ్రిత శ్రీ వర్ష,
8వ తరగతి,
అరవింద మోడల్ స్కూల్,
మంగళగిరి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

భారత్ జయించిందిలా!

ముంబయి : ప్రపంచ క్రికెట్ అగ్రజట్టు. అత్యంత ధనిక క్రికెట్ బోర్డు. స్వదేశంలో వంద కోట్ల విశేష అభిమాన ఆదరణ. అయినా, పదేండ్లుగా ఐసీసీ టైటిల్ విజయం లేదనే వెలితి. టీమ్ ఇండియా ద్వైపాక్షిక సిరీస్ పులి అంటూ.. పాశ్చాత్య మీడియా, క్రికెట్ విశ్లేషకులు హేళన చేసిన సందర్భాలు సైతం ఉన్నాయి. పదేండ్ల నిరీక్షణకు తెరదించుతూ రోహిత్‌సేన టీ20 ప్రపంచకప్ టైటిల్‌ను స్వదేశానికి పట్టుకొచ్చింది. పొట్టి ప్రపంచకప్ ట్రోఫీని భారత్ అందుకునేందుకు.. తెరవెనుక, తెర ముందు అవిశ్రాంత పోరాటం చేసిన హీరోల గురించి...ఇదు

ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో రోహిత్ ఒకడు. ముంబయి ఇండియన్స్‌కు ఐదు టైటిల్స్ అందించిన రోహిత్.. భారత్‌కు ఐసీసీ టైటిల్ లోటు తీర్చగలడని అప్పటి బీసీసీఐ బాస్ గంగూలీ గట్టిగా విశ్వసించాడు. రోహిత్ శర్మకు కెప్టెన్సీ పగ్గాలు దక్కటంలో దాదా పాత్ర ఎక్కువ. 2022 టీ20 ప్రపంచకప్‌లో భారత్ సెమీఫైనల్లో పోటీ ఇవ్వకుండా ఓటమి పాలైంది. అక్కడే కెప్టెన్ రోహిత్ శర్మ ఓ నిర్ణయానికి వచ్చాడు. సంప్రదాయ క్రికెట్‌తో ఐసీసీ టైటిల్ సాధించలేమని.. బ్రేకుల్లేని దూకుడు మంత్ర అవసరమని భావించాడు. జట్టుకు దూకుడు మంత్ర ఎక్కించాడు. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో ముందుండి ఎదురుదాడి చేశాడు. అజేయంగా ఫైనల్‌కు చేర్చినా.. ఆఖర్లో నిరాశే ఎదురైంది. అదే పంథా కొనసాగించి కరీబియన్ దీవుల్లో కప్పు కైవసం చేసుకున్నాడు. దక్షిణాఫ్రికాతో టైటిల్ పోరులో రోహిత్, పంత్, సూర్య పవర్‌ప్లేలో నిష్క్రమించినా.. క్రీజులోకి వస్తూనే అక్షర్ పటేల్ బౌండరీ బాదటం వెనుక రహస్యం ఇదే ఫార్ములా. వికెట్లు పడినా.. ఎదురుదాడి ట్రాక్ వీడొద్దనే ఫార్ములా భారత్‌ను నేడు చాంపియన్‌గా నిలిపింది.

భారత క్రికెట్ జెంటిల్‌మెన్ రాహుల్ ద్రవిడ్. స్వతహాగా సంప్రదాయ క్రికెటర్. కానీ కోచ్‌గా తన టీమ్‌ను పూర్తి భిన్న పథంలో నడిపించాడు. ఆటగాడిగా దక్కని ఐసీసీ టైటిల్‌ను.. కోచ్‌గా చివరి రోజు సాధించాడు. గతంలో తుది జట్టు కూర్పులో ప్రతి మ్యాచ్‌కు మార్పులు చేర్పులు సహజం. కానీ ఈ ప్రపంచకప్‌లో భారత్ 12 మంది ఆటగాళ్లతో బరిలోకి దింపింది. ప్రదర్శనతో సంబంధం లేకుండా ఆటగాళ్లపై విశ్వాసం ఉంచిన ద్రవిడ్.. గొప్ప ఫలితం సాధించాడు. తుది జట్టు కూర్పులో నలుగురు ఆల్‌రౌండర్లను ఎంచుకోవటం భారత్‌కు బాగా కలిసొచ్చింది. రవిశాస్త్రి, అనిల్ కుంబ్లేలు ఐసీసీ టైటిల్‌కు చేరువగా వచ్చినా.. రాహుల్ ద్రవిడ్ ఒక్కడే గత దశాబ్ది కాలంలో చాంపియన్‌గా నిలిచిన భారత చీఫ్ కోచ్.

ఆట పర్వం టీ20 ప్రపంచకప్ జట్టులో విరాట్ కోహ్లి చోటుపై ప్రశ్నలు. గ్రూప్, సూపర్8 మ్యాచుల్లో వైఫల్యంతో విమర్శలు. అయినా, జట్టు మేనేజ్‌మెంట్ కోహ్లిపై నమ్మకం ఉంచింది. కెరీర్ చివరి టీ20 మ్యాచ్‌లో కోహ్లి క్లాస్ చూపించాడు. బ్యాటింగ్‌కు సహకరించిన పిచ్‌పై సహచర బ్యాటర్లు నిరాశపరిచినా.. ఓ ఎండ్‌లో గట్టిగా నిలబడ్డాడు. 2014 టీ20 ప్రపంచకప్ ఫైనల్ తరహాలో 2024 టైటిల్ పోరులో అర్థ సెంచరీతో ఆదుకున్నాడు. అన్ని మ్యాచుల్లో పరుగుల వేట ఓ ఎత్తు.. టైటిల్ పోరు ఒక్కటీ ఓ ఎత్తు అని మరోసారి నిరూపించాడు. ఫైనల్లో విన్నింగ్ ఇన్నింగ్స్‌తో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. బ్రమా బ్యాటింగ్‌కు పెద్దగా అనుకూలించని పిచ్‌లపై టీమ్ ఇండియాను విజయ తీరాలకు చేర్చిన రథ సారథి, పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా. గ్రూప్ దశలో పాకిస్థాన్‌పై నిప్పులు చెరిగిన బుమ్రా.. స్వల్ప స్కోరును నిలబెట్టాడు. ఫైనల్లోనూ చేజారింది అనుకున్న మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. చరిత్ర పుటల్లో నిలిచిపోయే బుల్లెట్ల వంటి బంతులను సంధించాడు. భారత్ కష్ట కాలంలో ప్రతి సారి బంతి అందుకుని వికెట్ల వేట సాగించాడు. యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 8 మ్యాచుల్లో 17 వికెట్లు కూల్చగా.. బుమ్రా 8 మ్యాచుల్లో 15 వికెట్లు కూలదోశాడు. అర్ష్‌దీప్ సింగ్ సగటు 12.64 కాగా.. బుమ్రా సగటు 8.26 కావటం విశేషం. ముంబయి ఇండియన్స్‌కు ఐపీఎల్ నరాలు తెగే ఉత్కంఠ ఫైనల్లో అద్వితీయ విజయాలు అందించిన బుమ్రా.. ఈసారి ఆ పని భారత్‌కు చేసి పెట్టాడు. బుమ్రా లేకుండా భారత టీ20 ప్రపంచకప్ విజయాన్ని ఊహించలేం.

స్నేహ జోష్

● **8 వికెట్ల చెలరేగిన ఆఫ్ స్పిన్నర్**

చెన్నై : భారత్, దక్షిణాఫ్రికా మహిళల ఏకైక టెస్టులో టీమ్ ఇండియా ఆఫ్ స్పిన్నర్ స్నేహ రానా (8/77) మ్యాజిక్ చేసింది. 8 వికెట్ల ప్రదర్శనతో సఫారీ బ్యాటర్లను మాయలో పడేసింది. మరో స్పిన్నర్ దీప్తి శర్మ (2/47) సైతం మెరవటంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 84.3 ఓవర్లలో 266 పరుగులకే కుప్పకూలింది. సఫారీ తరఫున మారజానె కాప్ (74, 141 బంతుల్లో 8 ఫోర్లు), సునె లుస్ (65, 164 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో రాణించారు. 337 పరుగుల వెనుకంజలో నిలిచిన దక్షిణాఫ్రికాను భారత్ ఫాలోఆన్‌కు పిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో సఫారీలు ప్రతిఘటిస్తున్నారు. ఓపెనర్ లారా (93 నాటౌట్, 252 బంతుల్లో 12 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో, సునె లుస్ (109, 203 బంతుల్లో 18 ఫోర్లు) సెంచరీతో కదం తొక్కారు. 85 ఓవర్లలో 2 వికెట్లకు దక్షిణాఫ్రికా 232 పరుగులు చేసింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా మరో 105 పరుగుల వెనుకంజలో నిలిచింది. నేడు చివరి రోజు ఆటలో భారత స్పిన్నర్లు మెరిస్తే.. మరోసారి బ్యాట్ పట్టకుండానే భారత్ విజయం సాధించేందుకు అవకాశం ఉంది.

హెచ్‌సీఏ క్రికెట్ హెడ్‌గా వెంకటేశ్ ప్రసాద్?!

హైదరాబాద్ : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) క్రికెట్ వ్యవహారాల హెడ్‌గా భారత మాజీ క్రికెటర్ వెంకటేశ్ ప్రసాద్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఆ సంఘం అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు ప్రతిపాదించినట్టు సమాచారం. హైదరాబాద్‌లో ప్రపంచ శ్రేణి సదుపాయాలతో కూడిన ఆధునాతన స్టేడియం నిర్మాణంపై హెచ్‌సీఏ సిద్ధంగా ఉందని, స్థలం కేటాయింపు కోసం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించనున్నారు. జిల్లా కేంద్రాల్లో ఫస్ట్ క్లాస్ క్రికెట్ స్థాయి మూడు స్టేడియాలను నిర్మించేందుకు అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయం తీసుకున్నారు. 2018 నుంచి పెండింగ్‌లో ఉన్న ఆడిట్ నివేదికలను ఆమోదించటంతో బీసీసీఐ నిధుల విడుదలకు మార్గం సుగమం అయ్యింది. హెచ్‌సీఏ క్రికెట్ ఈ నెల 8 నుంచి ఆరంభం కానుండగా.. మహిళల లీగ్ క్రికెట్ రోడ్‌మ్యాప్‌పై అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించారు. హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు ఆర్. దేవరాజ్, సికె శ్రీనివాసరావు, సునీల్ అగర్వాల్‌లు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో వైద్య సేవ

జీవితంలో ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం బాగా లేకపోతే అన్నీ వృథానే! అయితే, సమాజం ఇంతగా అభివృద్ధి చెందినా చిన్న చిన్న అనారోగ్యాలకు కూడా వైద్యసేవలు పొందలేని సామాన్యులు ఎందరో ఉన్నారు. ప్రభుత్వరంగంలో వైద్య సదుపాయాలు అభివృద్ధి కావాల్సినంత స్థాయిలో లేవు. కార్పొరేటు హాస్పటళ్లు వచ్చాక మామూలు ప్రజలకు వైద్యం అందనంతదూరంలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన డాక్టర్ కారెం రవితేజ, డాక్టర్ శ్రావణి దంపతులు తమకు వీలైనంత మేర పేద ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. జులై 1 వైద్యుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ రవితేజ మాటల్లో వారి సేవల గురించి తెలుసుకుందాం. "ఆధునిక టెక్నాలజీ వైద్య రంగం స్వరూపాన్నే సమూలంగా మార్చేసింది. శరీరంలోని ప్రతి అవయవాన్నీ, ప్రతి భాగాన్ని శోధించి రోగానికి కారణాలేమేమిటో ఖచ్చితంగా కనిపెట్టగలిగే యంత్ర పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల వైద్యుని పాత్ర కూడా వేగంగా మారిపోయింది. స్పెషలైజేషన్స్ బాగా పెరిగిపోయాయి. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు పెరుగుతున్నాయి. ఆస్పత్రిలో చేరిన రోగి ఆరోగ్యంగా తిరిగి వెళ్లే పరిస్థితులు మెరుగుపడ్డాయి. మరోవైపు కుటుంబ వైద్యులు కనుమరుగవుతున్నారు. రోగికీ, వైద్యునికీ మధ్య అంతరం పెరుగుతోంది. అలాగే వైద్యంలో ఆధునీకరణ ఫలితాలు, నూతన ఆవిష్కరణలు వస్తున్నా ఇంకా సామాన్యులకు పూర్తిస్థాయిలో అందడంలేదు. అందుకే మా వంతుగా పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రభుత్వాసుపత్రిలో స్పెషలిస్ట్ డాక్టర్‌గా నా వృత్తి ధర్మాన్ని నిర్వహిస్తూనే.. సామాన్య పేద ప్రజలకు మారుమూల ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలను అందిస్తున్నాను. నాతోపాటుగా నా సతీమణి డాక్టర్ శ్రావణి కూడా వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. మేమిద్దరం గ్రామాల్లో ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

పట్టణాలు, నగరాల్లో వైద్యసేవలు అందుబాటులో ఉన్న నేటి రోజుల్లో మారుమూల గ్రామాల్లోనూ, నదీ, సముద్ర తీర ప్రాంతాల్లోనూ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో లేవు. ఈ విషయాన్ని గుర్తించిన మేము గత ఐదేళ్లుగా ఆ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించటంతోపాటు మందులు కూడా ఇస్తున్నాం. కోనసీమ ప్రాంతంలోని మత్స్యకార గ్రామాల్లో వైద్య సేవలు అంతగా అందుబాటులో లేవు. మేము ప్రతి ఆదివారం ఏదో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసుకుని వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం.

పేదలు నివసించే ప్రాంతాల్లో ...

నా సతీమణి డాక్టర్ శ్రావణి ఆధ్వర్యంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు నివసించే మారుమూల గ్రామాల్లో ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ వ్యాధులపై అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయటంతోపాటుగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం.

దత్తత గ్రామంలో సేవలు

అమలాపురం మండలంలోని సీతారామపురం గ్రామాన్ని దత్తత తీసుకున్నాం. ఇక్కడి గ్రామ ప్రజలకు మా వంతుగా వైద్య సేవలు అందించటంతోపాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణం, వివిధ వ్యాధులు-జాగ్రత్తలు, ఎయిడ్స్, క్షయ తదితర వ్యాధులపై అనేక రూపాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇంకా రంగాపురం, కిత్తన చెరువు, అయినవిల్లిలంక, ముక్తేశ్వరం, గోపవరం, ఉప్పలగుప్తం, గచ్చకాయల పొర, కాట్రేనికోన, నేదునూరు, ఎన్.కొత్తపల్లి, వీరవల్లి పాలెం, జనుపూడి గ్రామాల్లో ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేశాం.

కోవిడ్ సమయంలో ...

కోవిడ్ సమయంలో మారుమూల ప్రాంతాలకు వెళ్లి అక్కడి రోగులకు వైద్య సేవలు అందించటమే కాక గ్రామస్తులకు అవసరమైన ఆరోగ్య జాగ్రత్తలు తెలియజేశాం. ఆహార పొట్లాలు, మందులు వంటివి కూడా పంపిణీ చేశాం. పేదరికం కారణంగా వైద్యానికి దూరంగా ఉండిపోయేవారిని గుర్తించి, వారికి ఉచితంగా వైద్య సేవలు అందించాం."

- ఇంటర్వ్యూ : యడవల్లి శ్రీనివాసరావు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68